సంగీత మేరు శిఖరాలు
రూ॥ 120/-
పేజీలు: 138

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్), హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM సిటీ
సంపుటి 28, సంచిక: 316 | ఆదివారం | 10-05-2026 | హైదరాబాద్
Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12 | వెల రూ. 5.00

మా యుద్ధ లక్ష్యాలు న్యాయమైనవే
ఇరాన్ – అమెరికా మధ్య కాల్పుల్లో చిక్కుకున్న నౌక
విపత్కర పరిస్థితులు తప్పవు : ఇరాన్
08



మెజారిటీ వచ్చేసింది

# తమిళనాడు సిఎంగా నేడు విజయ్ ప్రమాణం

విజయ్‌తో సహా మరో 9 మంది కూడా
గవర్నర్ అనుమతితో ఉత్కంఠకు తెర
బేషరతుగా మద్దతు పలికిన విసికె, ఐయుఎంఎల్
కాంగ్రెస్, వామపక్షాలు, విసికె, ఐయుఎంఎల్ మద్దతుతో 120కి చేరిన సంఖ్యాబలం

**చెన్నై: ఎట్టకేలకు** తమిళనాడులో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. అవసరమైన మెజారిటీని కూడగట్టడంతో తమిళ వెట్రిగ కళగం (టివికె) అధినేత సి.జోసెఫ్ విజయ్‌ను ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు తమిళనాడు గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ అనుమతించారు. ఈనెల 13 లోపు శాసనసభలో బలనిరూపణ చేసుకోవాలని ఆదేశించారు. కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం), విసికె, ఐయుఎంఎల్‌ల మద్దతుతో శాసనసభలో సాధారణ మెజారిటీకి అవసరమైన 117కు మించి టివికె ప్రభుత్వానికి మద్దతిచ్చే ఎమ్మెల్యేల సంఖ్యాబలం 120కి చేరింది. కాగా టివికె ప్రభుత్వం నేడు (ఆదివారం) కొలువు తీరనుంది. ఈ పార్టీల మద్దతుతో చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఉదయం 10 గంటలకు విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు 9 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తదుపరి మంత్రివర్గ విస్తరణలో భాగస్వామ్య పార్టీలకు అవకాశం కల్పిస్తారని సమాచారం.

ఇదిలా ఉండగా, గవర్నర్ అర్లేకర్ అపాయింట్‌మెంట్ లభించడంతో శనివారం సాయంత్రం లోక్‌భవన్‌లో ఆయనను విజయ్ కలిశారు. ఆయన వెంట కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, విసికె, ఐయుఎంఎల్ నేతలు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా తనకు మద్దతిస్తున్న పార్టీల లేఖలను గవర్నర్‌కు విజయ్ అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించాలని కోరారు. ఇందుకు గవర్నర్ సమ్మతించారు. చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ప్రమాణస్వీకార కార్యక్రమం ఏర్పాటు చేశారు. అంతకుముందు రెండు రోజుల సస్పెన్స్‌కు తెరదింపుతూ టివికె పార్టీకి విసికె బేషరతుగా మద్దతు ప్రకటించింది. ఈ మేరకు టివికె పార్టీ నేత ఆదవ అర్జునకు విసికె నేత తిరుమావళవన్ లేఖ అందజేశారు ఐయుఎంఎల్ కూడా మద్దతు లేఖ అందజేసింది. కాగా 'మేం ప్రభుత్వంలో చేరబోం. వెలుపలి నుంచే మద్దతు ఇస్తాం. భవిష్యత్‌లో ప్రభుత్వంలో భాగం అవుతామా లేదా? అన్నది చెప్పలేం. రాష్ట్రపతి పాలనను నివారించేందుకు, ప్రజల తీర్పును నెరవేరేలా చేసేందుకు ప్రభుత్వ ఏర్పాటులో భాగం అవుతున్నాం' అని విసికె అధినేత తిరుమావళవన్ మీడియాకు వెల్లడించారు. తాము ఇప్పటికీ డిఎంకె నేతృత్వంలోని కూటమిలోనే ఉన్నామని విసికె, ఐఎంఎల్ వెల్లడించడం గమనార్హం.

| | |
|---|---|
| టివికె | 107 |
| కాంగ్రెస్ | 5 |
| సిపిఐ | 2 |
| సిపిఐ(ఎం) | 2 |
| విసికె | 2 |
| ఐయుఎంఎల్ | 2 |
| మొత్తం | 120 |


విజయ్‌ను ముఖ్యమంత్రిగా నియమిస్తూ అధికారిక పత్రాన్ని అందజేస్తున్న గవర్నర్



పెరుగుతున్న నగరీకరణతో

# కొత్త సవాళ్లు

- అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తాం
- హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం
- బహుళ విధానాల్లో రవాణా సౌకర్యాలు అభివృద్ధి
- మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నాం
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) మొత్తంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగిన గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఆధునీకరణ, నగరీకరణతో సమీప భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లు, వాటిని అధిగమించడానికి ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి సమావేశంలో వివరించారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు ఇతర సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. "పెరుగుతున్న నగరీకరణ వల్ల సమీప భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని, అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని, కీలకమైన ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఉపరితల రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్ల వంటి మూడు విధానాల్లో ట్రాఫిక్‌కు సులభతరమైన రవాణా మార్గాలను కల్పించే విధానాన్ని ఎంచుకున్నాం. ట్రాఫిక్ నియంత్రణ కోసం కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే చేపడితే సరిపోదు. బహుళ విధానాల్లో రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేయాలి. పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నాం" అని వివరించారు. 'రాష్ట్ర సమగ్ర అభివృద్ధి తరువాయి 8లో



# నేడు హైదరాబాద్‌కు ప్రధానమంత్రి

వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
మధ్యాహ్నం 2.20 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు రానున్న మోదీ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రాజధానిలో నేడు ప్రధాన మంత్రి పర్యటన కొనసాగనుంది. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు సికింద్రాబాద్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా నగరంలో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రధాని ముందుగా మధ్యాహ్నం 1:10 గంటలకు కర్ణాటకలోని హాల్ ఎయిర్‌పోర్ట్ నుంచి భారత వైమానిక దళానికి చెందిన ప్రత్యేక విమానం ఐఎఎఫ్ బిబిజె ద్వారా బయలుదేరనున్న ప్రధాని, మధ్యాహ్నం 2:20 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2:25 గంటలకు బేగంపేట్ విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి, మధ్యాహ్నం 2:55 గంటలకు హైదరాబాద్‌లోని హెచ్‌ఐసిసికి చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం 3 గంటల నుంచి 3:30 గంటల వరకు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం, జాతికి అంకితం చేసే కార్యక్రమాల్లో తరువాయి 8లో



లెఫ్ట్, విసికె

# నిర్ణయాన్ని గౌరవిస్తా

కొత్త ప్రభుత్వానికి ఎలాంటి ఆటంకాలు సృష్టించబోం
ఎం.కె. స్టాలిన్

చెన్నై : కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మేము ఎటువంటి అడ్డంకులు సృష్టించబోమని, డిఎంకె ఒక నిర్మాణాత్మక ప్రతిపక్ష పార్టీగా వ్యవహరిస్తుందని డిఎంకె అధ్యక్షుడు ఎం.కె.స్టాలిన్ ఒక ప్రకటనలో పునరుద్ఘాటించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఏ పక్షానికీ మెజారిటీ లభించని ఈ క్లిష్ట పరిస్థితుల్లో, అనేక పక్షాలు ప్రత్యామ్నాయ ఆలోచనలను ముందుకు తెచ్చాయని, మా మిత్రపక్షాలు ఏ నిర్ణయం తరువాయి 12లో

కాంగ్రెస్ వల్లే

# 'ఇండియా'కు బీటలు

గవర్నరు వ్యవస్థ దుర్వినియోగం : సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**న్యూఢిల్లీ:** తమిళనాడు రాజకీయ అనిశ్చితి వేళ ఇండియా ఐక్య సంఘటన చీలికపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టివికె పార్టీ అధినేత విజయ్‌కు కాంగ్రెస్ ఏకపక్షంగా మద్దతు ప్రకటించడంపై ఇండియా నుంచి వైదొలిగినట్లు డిఎంకే ప్రకటించింది. ఈ తాజా పరిణామాలపై సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పందించారు. కాంగ్రెస్ వైఖరిని తప్పుపట్టారు. ఇండియా ఐక్యసంఘటన చీలికకు కాంగ్రెస్ పార్టీయే కారణమని తరువాయి 12లో




బెంగాల్ సిఎంగా

# సువేందు అధికారి ప్రమాణం

మంత్రులుగా మరో ఐదుగురు ప్రమాణ స్వీకారం




**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా కాషాయ పార్టీ ప్రభుత్వం కొలువుదీరింది. శనివారం సువేందు అధికారి బెంగాల్ తొలి బిజెపి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్ వేదికగా నిలవగా, గవర్నర్ ఆర్.ఎన్. రవి సువేందు అధికారితో పదవీ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బిజెపి కేంద్ర నాయకత్వం, ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు విచ్చేసి వేదికపై ఆసీనులయ్యారు. అయితే 'జై శ్రీరామ్' నినాదాలు, డప్పుల మోతలు, కాషాయ జెండా రెపరెపలాడాయి. మోదీ వేదికపైకి నడుచుకుంటూ వచ్చి, జనసమూహం వైపు మోకరిల్లి, ప్రజల తీర్పు పట్ల గౌరవ సూచకంగా చేతులు జోడించి నుదుటిని వేదికకు తాకించారు. భవానిపూర్, నందిగ్రామ్ రెండు నియోజకవర్గాల నుంచి గెలిచిన అధికారి మొదటగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన అనంతరం, సీనియర్ బిజెపి నాయకుడు, ఆ పార్టీ మాజీ రాష్ట్ర యూనిట్ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ మంత్రిగా కేబినెట్‌లో చేరారు. బిజెపి శాసనసభ్యులు అగ్నిమిత్ర పాల్, అశోక్ కీర్తానియా, క్షుదీరామ్ టుడు, నిసిత్ ప్రమణిక్‌లు కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. బ్రాహ్మణ, ఒబిసి, గిరిజన, మతువా, రాజబన్షీ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ, సామాజిక, ప్రాంతీయ సమతుల్యతను సాధించాలన్న బిజెపి ప్రయత్నాన్ని ఈ ఆరుగురు సభ్యుల మంత్రివర్గం ప్రతిబింబించింది. అధికారి బ్రాహ్మణ వర్గానికి తరువాయి 12లో

# జనగణనలో బిసిలను ప్రత్యేకంగా లెక్కించాలి

ప్రధాని స్పందించాలని విహెచ్ నిరాహార దీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జనగణనలో ఓబిసిలను కూడా ప్రత్యేకంగా లెక్కించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ సలహాదారు, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు అంబర్‌పేటలోని తన నివాసంలో శనివారం నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి, టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, రాష్ట్ర ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న, ఓబిసి కమిటీ చైర్మన్ కె.శంకరయ్య, మోతా రోహిత్, తరువాయి 8లో





# తదుపరి సిడిఎస్‌గా రాజా సుబ్రమణి

నేవీ చీఫ్‌గా వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్

**న్యూఢిల్లీ :** భారత తదుపరి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్)గా లెఫ్టినెంట్ జనరల్ ఎన్‌ఎస్ రాజా సుబ్రమణి (రిటైర్డ్)ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆయన రక్షణ వ్యవహారాల విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ మిలిటరీ అఫైర్స్) కార్యదర్శిగానూ వ్యవహరించనున్నారు. మరోవైపు చీఫ్ ఆఫ్ నావల్ స్టాఫ్‌గా వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ నియమితులయ్యారు. ఈ నెల 31 బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు తరువాయి 12లో

# అమలులోకి 4 లేబర్ కోడ్‌లు



- గెజిట్‌లో నిబంధనలను నోటిఫై చేసిన కేంద్ర ప్రభుత్వం
- కార్మిక సంఘాలు, విపక్షాల నిరసనగళాన్ని తుంగలో తొక్కిన కేంద్రం

**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు, ప్రతిపక్షాలు తమ నిరసన గళాన్ని ముక్తకంఠంతో వినిపించినా, పెడచెవిన పెట్టిన కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా పూర్తిస్థాయిలో అమలులోకి తెచ్చింది. ఐదేళ్లకు పైగా సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కేంద్ర ప్రభుత్వం కార్మికులందరికీ కనీస వేతనం, సార్వత్రిక సామాజిక భద్రతను కల్పించేందుకు నాలుగు కార్మిక కోడ్‌ల కింద ఉన్న నిబంధనల(రూల్స్)ను ప్రభుత్వ అధికారిక గెజిట్‌లో నోటిఫై చేసి తన గట్టి పంతాన్ని నెగ్గించుకుంది. వేతనాల కోడ్ 2019, పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020, సామాజిక భద్ర త కోడ్ 2020, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ 2020 అనే నాలుగు కోడ్‌లు 2025 నవంబరు 21 నుంచి అమలులోకి వచ్చాయి. కార్మిక చట్టాలను ఆధునీకరించి, సరళీకృత, సమకాలీన చట్రంలోకి ఏకీకృతం చేయడానికి ఈ నాలుగు నియమావళులను ప్రవేశపెట్టారు. నాలుగు కోడ్‌ల తరువాయి 8లో

'విబి–జి రామ్ (జి)' చట్టం వెంటనే రద్దుకు...

# 15న ఉపాధి హామీ కార్మికుల జాతీయ సమ్మె

మద్దతు ప్రకటించిన కేంద్ర కార్మిక సంఘాలు

**న్యూఢిల్లీ :** వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్, అజీవికా మిషన్ (గ్రామీణ్) చట్టం–2025 (విబి జి రామ్ (జి) ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికులు మే 15న (శుక్రవారం) చేపట్టనున్న ఒక రోజు జాతీయ సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాల (సిటియు) వేదిక మద్దతు ప్రకటించింది. ఈ మేరకు శనివారం ఇక్కడ కేంద్ర కార్మిక సంఘాలలో భాగస్వాములైన ఎఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్, ఎఐయుటియుసి, టియుసిసి, ఎస్ఇడబ్ల్యుఎ, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసి & స్వతంత్ర రంగాల సమాఖ్యలు ఈ జాతీయ సమ్మెకు మద్దతు పలికాయి. మోదీ ప్రభుత్వం విబి జిరామ్ (జి)చట్టాన్ని తక్షణమే వెనక్కి తీసుకుని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలన్న డిమాండ్లతో రోజ్‌గార్ వ్యవసాయ, గ్రామీణ కార్మికుల సంయుక్త వేదిక, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం సంఘర్ష్ మోర్చా సంయుక్తంగా ఈ ఒక రోజు అఖిల భారత సమ్మెకు పిలుపునిచ్చాయి.15వ తేదీన దేశ వ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎన్‌ఆర్ఇజిఎ) కార్యక్షేత్రాలలో మహాత్మాగాంధీజాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్ఇజిఎ) కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని తరువాయి 8లో

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై

# పోక్సో కేసు

**హైదరాబాద్ :** ఒక మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడిపై మల్కాజిగిరిలోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో 'పోక్సో' చట్టం కింద కేసు నమోదైంది. అయితే, సదరు బాలిక, ఆమె తల్లిదండ్రులు తమను బెదిరించి, డబ్బు గుంజడానికి ప్రయత్నిస్తున్నారని నిందితుడు ఆరోపిస్తున్నాడు. 17 ఏళ్ల ఆ బాలిక తల్లి తెలిపిన వివరాల ప్రకారం, తన కుమార్తెతో ప్రేమ సంబంధం కొనసాగిస్తున్న సంజయ్ కుమార్ కుమారుడు భగీరథ్, ఆమెను లైంగికంగా వేధించాడు. వీరిద్దరి మధ్య ఈ సంబంధం సుమారు ఏడు నుంచి ఎనిమిది నెలల క్రితం మొదలైందని పోలీసులు తెలిపారు. విద్యార్థిని అయిన ఆ బాలికను పోలీసులు ఇంకా విచారించలేదు. ఇదిలా ఉండగా, తనతో పరిచయం పెంచుకున్న ఆ బాలిక, తన కుటుంబ కార్యక్రమాలకు, స్నేహితుల సమూహ సమావేశాలకు తరువాయి 8లో




## డా విన్సీ ప్రతిభకు మూలం ఏమిటి?



ఎంతో మంది శాస్త్రవేత్తలను వేధిస్తున్న ప్రశ్న ఇది. లియోనార్డో డా విన్సీ పేరు విననివారు, మోనాలిసా చిత్రాన్ని గుర్తుపట్టనివారు అరుదు. అతను కేవలం చిత్రకారుడు మాత్రమేకాదు.. వివిధ కళల్లో నిష్ణాతుడు. విజ్ఞాన శాస్త్రంలో ఎన్నో ప్రయోగాలు, మరెన్నో ఆవిష్కరణలు చేశాడు. ఒక్కమాటలో చెప్పాలంటే, ప్రపంచానికి లభించిన ఒక నిజమైన బహుముఖ ప్రజ్ఞాశాలి డా విన్సీ. ఒక మనిషిలో ఇన్ని కోణాలు.. ఇంతటి అసాధారణ ప్రతిభ ఎలా సాధ్యమన్న ప్రశ్న చాలా మందిలో ఉంది. యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరెన్స్ శాస్త్రవేత్తలు చాలాకాలంగా పరిశోధనలు చేస్తున్నారు. ఇటీవల కీలకమైన అంశాలను వారు కనుగొనడంతో, ఈ పరిశోధన వేగాన్ని సంతరించుకుంది. తొలుతగా డా విన్సీ జీవవంశంలో ఉన్న వారిద్వారా అతని డిఎన్ఎను విశ్లేషించడం మొదలుపెట్టారు. జీనియాలజికల్ రీసెర్చ్ ద్వారా అతని బంధువులను గుర్తించి, ఆధునిక డిఎన్ఎ టెక్నాలజీ ద్వారా జరిపిన ప్రయోగాల్లో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. డా విన్సీ ప్రతిభా రహస్యాలు శాస్త్రవేత్తలు, జీనియాలజికల్ విశ్లేషణపై దృష్టి పెట్టారు. డా విన్సీకి సొంత పిల్లలు లేరు. కానీ, అతని తండ్రి, దాయాదుల వారసత్వాన్ని 21 తరాల పాటు అన్వేషించారు. 15వ తరానికి చెందిన బంధువుల్లో ఆరుగురు పురుషులలో 'Y' క్రోమోజోమ్ విశిష్ట భాగాలు పోలికగా ఉండటం ద్వారా జెనటిక్ లైన్‌ను నిర్ధారించారు. డా విన్సీ శరీర అవశేషాలను, విన్సీ పట్టణంలోని 'చర్చి ఆఫ్ సొంట క్రోచె'లో ఉన్న కుటుంబాలకు సంబందించిన సమాధి తవ్వకాల్లో లభించిన అతని సోదరులు, తాతల అవశేషాలను ప్రయోగశాలకు తరలించారు. కొన్ని అస్థిపంజర ముక్కలను రేడియోకార్బన్ డేటింగ్, పేలోజెనోమిక్ విశ్లేషణ చేసిన శాస్త్రవేత్తలు, అవి డా విన్సీ కాలానికి చెందిన పురుషులవని నిర్ధారించారు. ఈ డిఎన్ఎతో, శాస్త్రవేత్తలు డా విన్సీ ప్రతిభ అతనికి జీన్స్ ద్వారా లభించి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. డా విన్సీ దార్శనికత, విద్వత్తు, సృజనాత్మకతకు డిఎన్ఎ కిలకమని అంటున్నారు. డా విన్సీ రెండు చేతులతోనూ రాసేవాడు. అంతేకాదు.. ఒకే సమయంలో, రెండు చేతులతో రెండు వేరువేరు విషయాలపై నోట్స్ రాసుకునేవాడు. ఇది సామాన్యులకు అందని, వారు చేయలేని అత్యంత అరుదైన ప్రతిభ. ఇది కూడా జీన్స్ ద్వారానే అతనికి సంక్రమించిందనే అభిప్రాయం తెరపైకి వచ్చింది. మొత్తానికి, తాజా ఆవిష్కరణ డిఎన్ఎలోని ఉత్తేజితమైన మార్పులకు లోనుచేసే శక్తి ఏదో ఉండవచ్చనే కొత్త సిద్ధాంతానికి బీజం వేస్తున్నది. ఈ డిఎన్ఎ విశ్లేషణ ద్వారా ఒక వ్యక్తి ప్రతిభ, మేధస్సు, సృజనను వంశపారంపర్యం, పర్యావరణం కలిసిన ఫలితంగా అర్థం చేసుకోవాల్సిన సమయం వచ్చిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జీన్స్ మాత్రమే కాదు, ఆ పెరిగిన వాతావరణం, సమాజ ప్రభావం కూడ మేధస్సుకు కారణం. కానీ, డా విన్సీ వంటి అసాధారణ సంఘటనలు మనల్ని మానవ సామర్థ్యం హద్దులను చెరిపేసింది. మనిషి జీవితంలో డిఎన్ఎ ప్రదర్శించే మరో కోణాన్ని తాజా పరిశోధన ఆవిష్కరించింది.

## కోల్డ్ వెల్డింగ్ అంటే..



అంతరిక్షంలో రెండు ఒకటే రకమైన మెటల్ ముక్కలు ఒకదానిని మరొకటి తాకినప్పుడు, అవి ఉష్ణం లేదా గలితం లేకుండానే మనకూ తెలుసనిపించని విధంగా బంధించుకోవచ్చు. దీన్ని 'కోల్డ్ వెల్డింగ్' (Cold Welding) అంటారు. ఇది భూమిపై సాధ్యపడదు, ఎందుకంటే మన వాతావరణంలో లోహాలపై ఆక్సైడ్ లేయర్ ఏర్పడుతుంది. ఈ లేయర్ తాకితే, రెండు మెటల్స్ నిజంగా కలిసిపోవడాన్ని నిరోధిస్తుంది. స్పేస్‌లో వాతావరణం లేకపోవడం వల్ల ఆక్సిజన్ ఉండదు. అందువల్ల, మెటల్ ఉపరితలంపై ఆక్సైడ్ లేయర్ కూడా ఉండదు. అలా పరిశుభ్రంగా ఉన్న మెటల్ ఉపరితలాలు ఒకటి మరొకటి తాకినప్పుడు, ఆ ఉపరితలాల మధ్య ఉన్న అణువులు ఎటువంటి అడ్డంకి లేకుండా బంధించుకుపోతాయి. అప్పుడు ఆ రెండు ముక్కలు ఒక్కటిగా మారిపోతాయి. ఉదాహరణగా, 1991లో గాలిలియో స్పేస్‌క్రాఫ్ట్‌కు జరిగిన యాంత్రి క సమస్య ఒక భాగం కోల్డ్ వెల్డింగ్ వల్ల తప్పుగా పని చేయడం ద్వారా జరిగినట్లు గుర్తించారు. కోల్డ్ వెల్డింగ్‌ను పరిశుద్ధ మెటల్ ఉపరితలాల్లో స్పెషల్ కంట్రోల్డ్ ఎన్విరాన్మెంట్‌లో మాత్రమే ఉపయోగిస్తారు. దీనికి శక్తిని ఉపయోగించడం, ఉపరితల శుభ్రత, ఆక్సిజన్ లేకపోవడం వంటి షరతులు తప్పనిసరి. ఇవి మినహాయిస్తే, స్పేస్‌లో ఆకస్మికంగా వ్యర్థ యంత్ర భాగాలు అనుకోకుండా కలిసిపోవడం వంటివి జరగొచ్చు. స్పేస్‌లో కోల్డ్ వెల్డింగ్ స్టేషన్ డిజైన్, స్పేస్‌క్రాఫ్ట్ భాగాల నియామకంలో ఒక సవాలుగా మారింది. కోల్డ్ వెల్డింగ్ వల్ల యాంత్రిక సమస్యలు తలెత్తవచ్చు, ముఖ్యంగా ఫోల్డబుల్ యంత్రాల్లో భాగాలు అతికిపోవడం, ఫ్రీగా కదలకపోవడం జరుగుతుంది. ఏదిఏమైనా, భూమి వాతావరణంలో కనపడని, స్పేస్‌లోని ఒక ప్రత్యేక స్వభావ గ్రహించదగిన అద్భుత ఇంజినీరింగ్ సూత్రాల్లో కోల్డ్ వెల్డింగ్ ఒకటి.

## భూభ్రమణంలో మార్పులు!



భూమి నిరంతరం తన అక్షంపై తిరుగుతోంది. ఈ భ్రమణం కారణంగానే మనకు పగలు–రాత్రులు ఏర్పడతాయి. ఇది అందరికీ తెలిసిన విషయమే. అయితే ఈ భ్రమణ వేగం ఎప్పటికీ ఒకేలా ఉండదనేది చాలా మందికి తెలియకపోవచ్చు. శాస్త్రవేత్తల పరిశోధనల ప్రకారం భూమి భ్రమణం చాలా స్వల్పంగా నెమ్మదిగా మారుతోంది. అంటే కాలక్రమేణా ఒక రోజు పొడవు కొద్దిగా పెరుగుతోంది. గణాంకాల ప్రకారం సగటున ప్రతి శతాబ్దానికి సుమారు 1.8 సెకన్లు రోజుకు అదనంగా చేరుతున్నాయి. ఇది మన రోజువారీ జీవితంలో వెంటనే గమనించగలిగే మార్పు కాదు, ఎందుకంటే ఈ మార్పు చాలా నెమ్మదిగా జరుగుతుంది. అయితే లక్షల, కోట్ల సంవత్సరాల కాలాన్ని పరిశీలిస్తే ఈ తేడా స్పష్టంగా కనిపిస్తుంది. భూమి భ్రమణం నెమ్మదించడానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా చంద్రుడి గురుత్వాకర్షణ ప్రభావాన్ని పేర్కోవచ్చు. భూమిపై సముద్ర జలాలను చంద్రుడు ఆకర్షించి అలలను సృష్టిస్తుంది. ఈ అలల వల్ల సముద్రాల్లో ఏర్పడే ఘర్షణ భూమి భ్రమణాన్ని క్రమంగా తగ్గిస్తుంది. ఈ ప్రక్రియను టైడల్ ఫ్రిక్షన్ అని పిలుస్తారు. దీని వల్ల భూమి తన భ్రమణ శక్తిలో కొంత భాగాన్ని కోల్పోతుంది. ఈ మార్పు ఎంత పెద్దదో అర్థం చేసుకోవాలంటే గత కాలాన్ని పరిశీలించాలి. ఆ విధమైన పరిశోధనల ప్రకారం, సుమారు 600 మిలియన్ సంవత్సరాల క్రితం భూమిపై ఒక రోజు పొడవు కేవలం 21 గంటలు మాత్రమే ఉండేదని శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. అంటే అప్పట్లో భూమి ఇప్పటి కంటే వేగంగా తిరిగేది. కాలక్రమేణా భూమి భ్రమణం నెమ్మదిగా తగ్గుతూ వచ్చింది. ఫలితంగా రోజులు క్రమంగా పొడవయ్యాయి. భవిష్యత్తులో కూడా ఇదే ధోరణి కొనసాగుతుంది. అయితే ఈ మార్పు చాలా నెమ్మదిగా జరుగుతుండటంతో మనుషుల జీవితకాలంలో పెద్దగా ప్రభావం కనిపించదు. ఈ ఉదాహరణ ప్రకృతి వ్యవస్థలు పూర్తిగా స్థిరంగా ఉండవని, విశ్వంలోని శక్తుల పరస్పర చర్యల వల్ల అవి క్రమంగా మారుతూ ఉంటాయని చూపిస్తుంది.

# మరో 'వలస' ముఖ్యమంత్రి

ఎట్టకేలకు బిజెపి వాషింగ్ మిషన్‌లో అవినీతి మరకలు మాయమైన మరో వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యారు. అతనెవరో కాదు.. శనివారం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సువేందు అధికారి. తొలుత ఆ మహదావకాశం పొరుగు రాష్ట్రమైన అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మకు దక్కింది. వీరిద్దరికీ అనేక సారూప్యతలు ఉన్నాయి. సమవయస్కులే గాక, పూర్వాశ్రమంలో హిమంత, సువేందు కాంగ్రెస్ పార్టీలో కీలక నేతలు. ఆ తరువాత సువేందు తృణమూల్ కాంగ్రెస్‌లో మంత్రిగా పని చేశారు. హిమంత సైతం తరుణ్ గొగొయ్ నేతృత్వంలోని అస్సాం కాంగ్రెస్ ప్రభుత్వంలో అమాత్యుడిగా ఉండేవారు. ఇద్దరూ పార్టీలో నంబర్ టూ స్థానాన్ని ఆస్వాదించారు. అంతేగాక పశ్చిమ బెంగాల్‌లో మొదలై ఇరుగుపొరుగు రాష్ట్రాలకు పాకిన శారద చిట్ ఫండ్ కుంభకోణంలో వారిద్దరూ అవినీతికి పాల్పడినట్లు వార్తలు గుప్పుమన్నాయి. సువేందు ఏకంగా నారదా స్టింగ్ ఆపరేషన్‌లో రూ.5లక్షలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అవినీతిపరులని అందోళనలు చేయడమే కాక, శారద చిట్ ఫండ్ కుంభకోణంపై కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం సిబిఐ దర్యాప్తును చేపట్టింది. ఈ విషయంలో వారిద్దరూ విచారణను ఎదుర్కొన్నారు. ఇటు హిమంత, అటు సువేందులపై స్వయంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గతంలో ఎన్నికల ప్రచారాలలో అవినీతి ఆరోపణాస్త్రాలను సంధించారు.

వీరిద్దరికీ తీవ్రమైన రాజకీయ కాంక్షలు, ముఖ్యమంత్రి పదవి చేపట్టాలనే లక్ష్యం ఉండేది. కానీ, అవినీతి కేసులు, వేధింపులు ఆటంకాలుగా మారాయి. అదే సమయంలో బిజెపి ఎంతో కాలంగా అస్సాం, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో పట్టు సాధించేందుకు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతూనే ఉన్నాయి. రోగికి కావాల్సింది, వైద్యుడు ఇచ్చేది ఒక్కటే అయినట్లుగా, అటు బిజెపికి, ఇటు హిమంత, సువేందులను దగ్గర చేశాయి. తొలుత 2016లో హిమంత బిశ్వ శర్మ బిజెపిలో చేరారు. 2020లో సువేందు అధికారి అదే బాట పట్టారు. అంతే, వాషింగ్ మిషన్‌లో మురికి బట్టలు స్వచ్ఛంగా మారినట్లు, అప్పటి వరకు అవినీతి కేసులు, విమర్శలు ఎదుర్కొన్న వారిద్దరూ పునీతులైపోయారు. ముందు హిమంత విశ్వ శర్మ 2021లో అస్సాం ముఖ్యమంత్రి అవ్వగా, మరో దఫా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పుడు బెంగాల్ ముఖ్యమంత్రిగా సువేందు చేతికి పగ్గాలు అందాయి. అంతుకుముందు రోజు బిజెపి శాసనసభాపక్ష నాయకుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రోజు ఇదే సువేందుడు అవినీతిపై విరుచుకుపడతానని ప్రకటించటం వైచిత్రి. అన్నిటికంటే పశ్చిమ బెంగాల్ విజయాన్ని బిజెపి అత్యంత అపురూపంగా ఆస్వాదిస్తోంది. ఆ పార్టీ పూర్వగామి భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ స్వస్థలి కావడం ఒక కారణం. అలాగే బిజెపికి కొరకరాని కొయ్యగా మారిన మమతా బెనర్జీని ఓడించటం మరో కారణం. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ కోల్‌కతాలో జరిగిన సువేందు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సభికులకు వేదికపై నుంచి మోకరిల్లారు. ఈ విజయం చారిత్రాత్మకమే. ఎందుకంటే బెంగాల్ నేల భారతదేశ రాజకీయాలలో స్వాతంత్ర్యపూర్వం నుంచే కీలక పాత్ర. ఇక్కడే రెండు శతాబ్దాల బ్రిటీష్ పాలనకు బీజం పడింది. 1757లో బెంగాల్ నవాబు సిరాజుద్దౌలాను ప్లాసీ యుద్ధంలో బ్రిటీషర్లు ఓడించటంతో చరిత్ర కీలక మలుపు తీసుకుంది. బెంగాల్ నవాబుకు బలమైన సైనిక శక్తి ఉన్నప్పటికీ, స్వంత సైన్యాధికారి జాఫర్ అలీ నమ్మకద్రోహం ఫలితంగా పరాజయం పాలయ్యారు. అప్పట్లోనే బెంగాల్‌లో వెన్నుపోటు రాజకీయాలు తలెత్తాయి. అప్పటి నుంచి బెంగాల్ కేంద్రంగా, 1772లో కలకత్తాను రాజధానిగా మార్చుకొని బ్రిటీష్ పాలకులు సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూ పోయారు. సుమారు 140 ఏళ్ళు భారతదేశానికి రాజధానిగా సేవలందించింది. ఇదే బెంగాల్ బ్రిటీష్ సామ్రాజ్యవాద పాలకులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యోద్యమం, విప్లవోద్యమాలకు కేంద్రంగా నిలిచింది. అనేక సంస్కరణోద్యమాలకు ఆలవాలమైంది. ఎన్నికల మార్గంలో సుదీర్ఘకాలం వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉన్న ఘనత కూడా బెంగాల్‌దే. అంతటి ఘన చరిత కలిగిన బెంగాల్‌లో మతరాజకీయాలను రెచ్చగొట్టి, మైనారిటీలను ఒకవైపునకు నెట్టడమే కాకుండా, సర్ పేరుతో 91 లక్షల ఓట్లు తొలగించబడి ఎన్నికల ఫలితాలను తారుమారు చేసారని విశ్లేషణలు చెబుతున్నాయి. చివరగా, మమతాబెనర్జీపై భవానీపూర్ నియోజకవర్గంలో విజయం సాధించిన తరువాత సువేందు అధికారి స్పందిస్తూ ఇది హిందూత్వ విజయమని, ముస్లింలు పెద్ద ఎత్తున మమతాకు ఓటేసినా, హిందువుల ఓట్లతో తాను గెలిచానని ఘనంగా చెప్పుకున్నారు. కానీ, ఇదే బెంగాల్‌లో బిజెపి ఆరాధ్యుడు శ్యామప్రసాద ముఖర్జీ నేతృత్వంలోని నాటి హిందూ మహాసభ 1940లలో ముస్లిం లీగ్‌తో చేతులు కలిపి ప్రాదేశిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం చరిత్రపుటల్లో నిక్షిప్తమై ఉంది. మతాన్ని తమ రాజకీయాల్లో తమకు అనుకూలంగా అన్వయించుకోవడం కాషాయపార్టీకి మొదటి నుంచి అలవాటే!

ప్రగతిశీల భావాలకు నిలయమైన పశ్చిమ బెంగాల్ బిజెపి పాలనలో సవాలు కానుంది. ఏ చొరబాటుదారులను బూచిగా చూపి మమతకు వ్యతిరేకంగా హిందువులను సమీకరించారో, అదే చొరబాటుదారులను దేశంనుంచి పంపివేయటం బిజెపికి పెనుసవాలు కానుంది. ●

# ఎన్నికల్లో పరాజయాలు వామపక్షాలకు మరణశాసనమా?



మనోజ్ కుమార్ ఝా
రాజ్యసభ సభ్యుడు, ఆర్‌జెడి జాతీయ అధికార ప్రతినిధి

ఇటీవలి కాలంలో భారత రాజకీయ వ్యాఖ్యానాల్లో సంతాప వ్యక్తీకరణ పేజీలు అసాధారణంగా నిండిపోతున్నాయి. వామపక్షం అంతం కానప్పటికీ, ఒక వ్యాఖ్యాత తర్వాత మరొకరు వామపక్షం అంతిమ పతనానికి చేరుకుందని ప్రకటిస్తూనే ఉన్నారు. చూసిన వెంటనే ఈ సమాచారం నమ్మేట్లుగానే కనిపించవచ్చు. ఎన్నికల పరంగా వామపక్షం చాలా బలహీనపడింది. దాని రాజకీయ కార్యక్రమ సైతం, రూపాంతరం చెందిన సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా లేదని చాలామందికి అనిపించవచ్చు. ఇలాంటి సంతాప వార్తల ధోరణిలో తరచుగా ఒక నిశ్చితి కనిపిస్తుంది. అదేమంటే, భావజాల చరిత్రలో ఒక సుదీర్ఘ అధ్యాయం ముగిసిపోయిందన్నట్లుగా ఉంటుంది.

అయినప్పటికీ చరిత్ర అరుదుగా అటువంటి స్పష్టమైన ముగింపులను ఇస్తుంది. ఎందుకంటే భావజాలాలు అదృశ్యం కాబోవని మనకు తెలు సు. అవి వెనక్కి తగ్గుతాయి, తమను తాము పునఃసమీక్షించుకుంటాయి, తిరిగివస్తాయి. తరచుగా వాటి కి కారణమైన పరిస్థితులు మార్పు చెందిన రూపాల్లో తిరిగి తలెత్తినప్పుడు పునరుద్భవిస్తాయి. రాజకీయ పార్టీల ఎన్నికల విజయాలను ఆలోచనల సజీవతతో ముడిపెట్టాలనే ప్రలోభం అర్థం చేసుకోదగినదే. కానీ అది తీవ్రంగా తప్పుదోవ పట్టిస్తుంది కూడా.

### వామపక్షాల సంక్షోభం నిజమే..

భారతదేశంలో వామపక్షాల సంక్షోభం వాస్తవమైనదని మనం అంగీకరించాలి. ముఖ్యంగా ఇటీవల కేరళ ఓటమి సహా సుదీర్ఘకాలంగా కంచుకోటలుగా ఉన్న ప్రాంతాలలో ఎన్నికల ఎదురుదెబ్బలు తీవ్రంగా ఉన్నాయి. ఒకప్పుడు ప్రశంసలు అందుకున్న సంస్థాగత నిర్మాణాలు బలహీనపడ్డాయి. అస్థిత్వం, సాంస్కృతిక అసంతృప్తి, ప్రజాకర్షణవాదం తదితర అంశాలతో నడుస్తున్న రాజకీయ సంస్కృతిలో 'వర్గ రాజకీయాలు' అనే భాష అంతకంతకూ అసందర్భంగా తోస్తోంది. ఇలాంటి వాతావరణంలో, ప్రస్తుత తరుణాన్ని కేవలం ఒక దశగా కాకుండా, ఒక అంతిమ దశగా భావించడం బహుశా సులభం. కానీ, ఈ వ్యాఖ్యానం ఆ సంస్థలను ఆలోచనలతో ముడిపెడుతుంది. ఎందుకంటే వామపక్షాన్ని దాని సంస్థాగత వాహకాలకు ఎన్నడూ కుదించలేము. అసమానత, కార్మిక హక్కులు, సామాజిక న్యాయం, అనియంత్రిత మార్కెట్లకున్న పరిమితులు వంటి దాని స్థిరమైన ఆందోళనలు పార్టీ కార్యాలయాలలో కాకుండా, భారతదేశం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాధారణ పౌరుల జీవన వాస్తవాలలో పాతుకుపోయి ఉన్నాయి. ఎప్పుడైతే అసమానతలు పెరిగి, జీవనోపాధులు అస్థిరంగా మారతాయో, ఈ ప్రశ్నలు మరింత తీవ్రతతో తిరిగి వస్తాయి. భారతదేశపు సొంత గమనం ఈ ఉద్రిక్తతకు నిదర్శనంగా నిలుస్తుంది.1990వ దశకం ప్రారంభంలోని ఆర్థిక సంస్కరణలు వృద్ధిని, ఆశాభావాన్ని తీసుకువచ్చినప్పటికీ, అవి జాతీయ స్థాయిలో వామపక్ష పార్టీలు క్రమంగా ప్రాధాన్యతను కోల్పోవడానికి కూడా దోహదపడ్డాయి. కొంతకాలంపాటు, సరళీకరణ వాదన తిరుగులేనిదిగా కనిపించినప్పటికీ, విధాన రూపకల్పనలలో వామపక్ష భావజాలం ముద్ర అంటిపెట్టుకుని ఉంది. వామపక్ష బృందాలు, వాటి అనుబంధ పౌర సమాజం నిరంతర భాగస్వామ్యంతోనే పారదర్శకతను పెంచి, గ్రామీణ ఉపాధికి హామీని కల్పించి, అణగారిన వర్గాల హక్కులను గుర్తించిన హక్కుల ఆధారిత చట్టాలు గణనీయంగా రూపుదిద్దుకున్నాయి. ఈ జోక్యాలు రాజ్యం – పౌరుల సంబంధాల స్వరూపాన్ని మార్చివేశాయి. తర్వాతి దశాబ్దం ఈ కథనాన్ని మరింత సంక్లిష్టం చేసింది. ఉద్యోగాలు లేని వృద్ధి, వ్యవసాయ సంక్షో భం, అసంఘటిత, గిగ్ వర్కర్స్ పనుల విస్తరణ కొత్త అభద్రతలను సృష్టించాయి. ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి, జీవనోపాధుల పెళుసుదనాన్ని కలవరపరిచే స్పష్టతతో బయటపెట్టింది. పెద్ద నోట్ల రద్దు వంటి వ్యవస్థాగత దెబ్బ, విధాన రూపకల్పనలో చిన్న వ్యాపారాలకు ప్రాధాన్యత తగ్గించడం వంటి వాటితో అప్పటికే ఒత్తిడికి గురవుతున్న జీవనోపాధుల బలహీనతను ఇది మరింత స్పష్టం చేసింది. రహదారులపై నడుస్తున్న వలస కార్మికుల దృశ్యాలు, కాలక్రమేణా పేరుకుపోయిన వ్యవస్థాగత అసమానతలకు నిదర్శనాలుగా నిలిచాయి. ఇలాంటి సమయాల్లో, శ్రమ గౌరవం, ప్రభుత్వ పాత్ర, వనరుల పంపిణీకి సంబంధించిన ప్రశ్నలు నూతన నైతిక శక్తిని సంతరించుకుంటాయి.

### యూరప్, లాటిన్ అమెరికాలో లెఫ్ట్ రాజకీయాల ప్రాబల్యం

ప్రపంచ అనుభవాన్ని కూడా పరిశీలిద్దాం. 1991లో సోవియట్ యూనియన్ పతనాన్ని సోషలిజం నిర్ణయాత్మక ఓటమిగా విస్తృతంగా భావించారు. ఆ విజయోత్సాహం తరువాత, మార్కెట్లు, సరళీకరణ అనే పదాలు అనివార్యమైనవిగా కనిపించాయి. అయినప్పటికీ, రెండు దశాబ్దాల లోపే, 2008 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభం, నియంత్రణలు లేని పెట్టుబడిదారీ విధానంలోని బలహీనతలను బయటపెట్టింది. ప్రభుత్వం బ్యాంకులను ఆదుకున్నప్పటికీ, సమాజంపై పొదుపు చర్యలు విధించబడ్డాయి. ఒక కొత్త తరం వారు వారసత్వంగా పొందిన సాంప్రదాయవాదాన్ని ప్రశ్నించడం ప్రారంభించింది.



అమెరికాలోని ఆక్యుపై వాల్ స్ట్రీట్ వంటి ఉద్యమాలు, అలాగే గ్రీస్‌లో సిరిజా ఎదుగుదల నుండి స్పెయిన్‌లో పోడెమోస్ ఆవిర్భావం వరకు యూరప్‌లోని కొన్ని ప్రాంతాలలో సాంఘిక ప్రజాస్వామిక సోషల్ డెమొక్రసీ, వామపక్షజనరంజక రాజకీయాల పునరుజ్జీవనం, వామపక్ష ప్రేరేపిత భావనలు ప్రధాన స్రవంతి చర్చల్లోకి తిరిగి ప్రవేశించడాన్ని సూచించాయి. సుస్థిరమైన ప్రజాస్వామ్య దేశాలలో కూడా ఇది కనిపించింది. యుకెలో జెరెమీ కార్బిన్, అమెరికాలో బెర్నీ సాండర్స్ వంటి నాయకులు అసమానత, ప్రజా సంక్షేమం, కార్పొరేట్ జవాబుదారీతనం వంటి అంశాలకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా గణనీయమైన ప్రజా మద్దతును పొందారు.

లాటిన్ అమెరికాలో కూడా ఇలాంటి నమూనానే కనిపించింది. అక్కడ 2000వ దశాబ్దం ప్రారంభంలో 'పింక్ టైడ్' అనే పేరుతో మొదలైన ఉద్యమం, ఆ ప్రాంతమంతటా వామపక్ష భావజాలం గల ప్రభుత్వాల ఎన్నికల విజయానికి దారితీసింది. తర్వాతి దశాబ్దంలో ఈ ప్రభంజనం తగ్గినప్పటికీ, బ్రెజిల్‌లో లూలా డా సిల్వా, కొలంబియాలో గుస్తావో పెట్రో, చిలీలో గాబ్రియేల్ బోరిక్ వంటి నాయకుల పునరాగమనంతో ఇటీవలి సంవత్సరాలలో ఇది గణనీయంగా పుంజుకుంది. యూరప్, లాటిన్ అమెరికా రెండింటిలోనూ వామపక్షాల పునరావిర్భావం అనేది కేవలం సైద్ధాంతిక గతాన్ని తలచుకోవడం కన్నా, కొత్త ఆర్థిక, సామాజిక వాస్తవాలకు అనుగుణంగా తమ ప్రధాన ఆందోళనలను మార్చుకోవడంలోనే ఎక్కువగా ఉంది. ఇటీవలి కాలంలో న్యూయార్క్‌లో జోహ్రాన్ మమ్దానీ, యుకెలో జాక్ పోలాన్స్కీ వంటి వ్యక్తులు ఈ స్రవంతిని మరింత ముందుకు తీసుకెళ్లారు. గృహ ఖర్చులు, స్తంభించిపోయిన వేతనాలు, కార్పొరేట్ ఆధిపత్యం వంటి అంశాలపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని, ఎన్నికలలో ప్రతిధ్వనించే వేదికలుగా మలిచారు. వారి ఎదుగుదల సూచిస్తున్నదేమిటంటే, వర్గ ప్రభావిత రాజకీయాలు కాలం చెల్లినవి కాకపోగా, మధ్యేమార్గ సాంప్రదాయవాదం, మితవాద ప్రజాకర్షణవాదం రెండింటిపైనా విరక్తి చెందిన ఓటర్లలో మళ్లీ ఆదరణ పొందుతున్నాయి.

సాంప్రదాయకంగా బలమైన వామపక్ష ఉద్యమాలతో సంబంధం లేని దేశాలలో కూడా, వాడుకలోని పదజాలం వామపక్షం వైపు మళ్లింది. సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ, కనీస ఆదాయ హామీలు, కార్పొరేట్ జవాబుదారీతనం వంటి అంశాలపై చర్చలు చట్టబద్ధతను సంతరించుకున్నాయి. బహుశా మన కాలపు అత్యంత కీలకమైన సవాలు అయిన వాతావరణ మార్పు ఉమ్మడి చర్య, ప్రభుత్వ జోక్యం కోసం వాదనలను మరింత బలోపేతం చేసింది; ఇవి చారిత్రాకంగా వామపక్షాలు వ్యక్తపరిచిన వైఖరులు. ఇదంతా సమకాలీన వ్యాఖ్యాతలకు ఒక పునశ్చరణగా ఉపయోగపడాలి.

### యువతతో తెగిపోయిన సంబంధాలు

వ్యాఖ్యాతలు ఈ విషయాన్ని గుర్తించాలని నేను కోరినప్పుడు, నా ఉద్దేశ్యం వామపక్షాన్ని ఆదర్శంగా చూపించడం కాదు, ఎందుకంటే విస్మరించలేని అంతర్గత పరిమితులు ఉన్నాయి. సంస్థాగత కాఠిన్యం, బిరుసుతనం, కొత్తగా ఉద్భవిస్తున్న సామాజిక కూటములకు అనుగుణంగా మారలేకపోవడం, కొన్ని యువ వర్గాలతో సంబంధాలు తెగిపోవడం వంటివి దాని ఆకర్షణను బలహీనపరిచాయి. అది సుదీర్ఘకాలం పాలించిన ప్రాంతాలలో, నాయకత్వ పునరుద్ధరణ, మారుతున్న ఆకాంక్షలకు స్పందించడంలో ఉన్న సవాలు స్పష్టంగా కనిపిస్తోంది.

కాబట్టి ఎలాంటి అర్థవంతమైన పునరుజ్జీవమైనా అవకాశంలోనేగాక ఆత్మపరిశీలనలో కూడా పాతుకుపోయి ఉండాలి. అదే సమయంలో, ఒక పరివర్తన జరుగుతోంది. చారిత్రాకంగా వామపక్షాలతో ముడిపడి ఉన్న అనేక ఆలోచనలు విస్తృత రాజకీయ రంగంలోకి చొచ్చుకుపోయాయి. సంక్షేమ పథకాలు, రాయితీతో కూడిన సేవలు లేదా ఆదాయ మద్దతు వంటివి ఇప్పుడు భారతదేశంలోని సైద్ధాంతిక విభేదాలకు అతీతంగా పార్టీలకు సర్వసాధారణమైపోయాయి. వాడే పదజాలం వేరుగా ఉండవచ్చు, ప్రేరణలు విభిన్నంగా ఉండవచ్చు, కానీ అంతర్లీనంగా ఉన్న గుర్తింపు మాత్రం మారలేదు: తీవ్ర అసమానతలున్న సమాజంలోని సంక్లిష్టతలను కేవలం మార్కెట్లు మాత్రమే పరిష్కరించలేవు.

భావజాల ప్రాధాన్యత ఆవర్తన స్వభావం భౌతిక పరిస్థితులతో సన్నిహితంగా ముడిపడి ఉంటుంది. సాపేక్ష స్థిరత్వ కాలాలు సామర్థ్యం, వ్యక్తిగత కృషికి సంబంధించిన కథనాలకు ప్రాధాన్యతనిస్తాయి. దీనికి విరుద్ధంగా, సంక్షోభ కాలాలు సామూహిక ఆందోళనలను ముందుకు తీసుకువస్తాయి.

### సాంప్రదాయ నిర్మాణం సరిపోదు

ఆర్థిక అనిశ్చితి, సాంకేతిక అంతరాయం, పర్యావరణ ఒత్తిడితో కూడిన ప్రస్తుత ప్రపంచ సందర్భం, ఈ రెండవ దశ ఊపందుకుంటుందని సూచిస్తోంది. కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్ అనేవి పని భవిష్యత్తు గురించే ప్రాథమిక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. అంటే, ఉత్పాదకత పెరుగుదల వల్ల ఎవరు ప్రయోజనం పొందుతారు? రోజురోజుకు మరింత సరళంగా మారుతున్న కార్మిక మార్కెట్లలో కార్మికులకు ఎలా రక్షణ కల్పించబడుతుంది? అనేవి ఆ ప్రశ్నలు. ఇవి కేవలం మార్కెట్ కేంద్రీకృత చట్రంలో పరిష్కరించగల ప్రశ్నలు కావు. అయితే, భారతదేశంలోని ప్రస్తుత పరిస్థితిని మనం ఎలా అర్థం చేసుకోవాలి? దీనిని ఒక సంధికాలంగా, అంటే స్థిరపడిన రూపాలు బలహీనపడగా, కొత్తవి ఇంకా స్థిరపడని దశగా చూడ టం మరింత సరైనది కావచ్చు. వామపక్షాల సాంప్రదాయ సంస్థాగత నిర్మాణాలు ఇకపై సరిపోకపోవచ్చు, కానీ అది చర్చించే సామాజిక ప్రశ్నలు పరిష్కారానికి చాలా దూరంలో ఉన్నాయి. నిజానికి, అవి మరింత సంక్లిష్టంగా మారుతున్నాయి.

> *భారతదేశంలో వామపక్షాల సంక్షోభం వాస్తవమైనదని మనం అంగీకరించాలి. ముఖ్యంగా ఇటీవల కేరళ ఓటమి సహా సుదీర్ఘకాలంగా కంచుకోటలుగా ఉన్న ప్రాంతాలలో ఎన్నికల ఎదురుదెబ్బలు తీవ్రంగా ఉన్నాయి. ఒకప్పుడు ప్రశంసలు అందుకున్న సంస్థాగత నిర్మాణాలు బలహీనపడ్డాయి. అస్థిత్వం, సాంస్కృతిక అసంతృప్తి, ప్రజాకర్ష–ణవాదంతో నడుస్తున్న రాజకీయ సంస్కృతిలో 'వర్గ రాజకీయాలు' అనే భాష అసందర్భంగా తోస్తోంది.*

### మరి మార్గమేమిటి?

వామపక్షం భవిష్యత్తు అర్థవంతంగా ఉండాలంటే, అది దాని గతాన్ని పోలి ఉండే అవకాశం లేదు. అది వర్గం, కులం, ప్రాంతానికి అతీతంగా ఉండే కొత్త పొత్తుల ద్వారా ఆవిర్భవించవచ్చు. దాని పూర్వపు అజెండాలో ప్రాధాన్యత లేని పట్టణ అభద్రత, పర్యావరణ న్యాయం, డిజిటల్ హక్కులు వంటి అంశాలపై జరిగే ఉద్యమాలలో తనను తాను వ్యక్తపరచవచ్చు. అంతేకాక, విభిన్న అనుభవాలు, ఆకాంక్షలతో రూపుదిద్దుకున్న తరాన్ని ఆకట్టుకోవడానికి, సుపరిచితమైన నినాదాలను దాటి, తన భాషను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం కూడా దానికి ఉంటుంది. వామపక్షం లేదా మరేదైనా భావజాలం యొక్క మనుగడ అనేది, ఒక నిర్దిష్ట సమయంలో దాని సంస్థాగత ఉనికి కన్నా, అది నిరంతరం అడిగే ప్రశ్నల మీదే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. అసమానత కొనసాగినంత కాలం, న్యాయం అసంపూర్తిగా ఉన్నంత కాలం, గౌరవం వాయిదా పడుతున్నంత కాలం, వామపక్ష ఆలోచనకు ప్రాణం పోసే ప్రేరణ వ్యక్తీకరణను పొందుతూ ఉంటుంది. అది ఎల్లప్పుడూ సుపరిచితమైన రూపాల్లో గుర్తించబడకపోవచ్చు, కానీ అది నిలిచి ఉంటుంది.

కాబట్టి, ఆ సంతాప వార్తలు భావాల భవిష్యత్తు గురించి చెప్పడం కన్నా, ప్రస్తుత నిశ్చయ భావన మనోగతం గురించి మనకు ఎక్కువగా తెలియజేయవచ్చు. చరిత్రను గమనిస్తే, ఆ నిశ్చయ భావన తొందరపాటు అని రుజువయ్యే అవకాశం ఉంది.

(ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో..)

## ధాన్యం, మొక్కజొన్నల కొనుగోళ్లను..

# వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు
చాడ వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం/ వరంగల్, ఎల్కతుర్తి:** వరి ధాన్యం, మొక్కజొన్నల కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలోని శివనగర్‌లోని తమ్మెర భవన్ సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఇంకా చాలా వరి ధాన్యం కల్లం నుండి మిల్లుకు కదలలేదు. కొనుగోలు చేసింది నామమాత్రమే. తెలంగాణ అంతటా లక్షలాది రైతుల వరికుప్పలు, గ్రామాలలో, పంట పొలాలలో ఎక్కడికక్కడే రోడ్లపై ఆరబోసి ఉన్నాయి. వర్షం వస్తే తమ ఆరు నెలల కష్టం వరద పాలవుతుందని రైతులు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారన్నారు. అలాగే మొక్కజొన్న రైతులు కూడా చాలా ఇబ్బంది పాలవుతున్నారని, గన్నీ సంచల కొరత వల్ల, కాంటాలై మొక్కజొన్నలను తీసుకుపోయే లారీలు లేక రైతన్నలు నిద్రలేని రాత్రులు గడుపుతూ అక్కడే కావలి కోసం పడుకోవడం జరుగుతుందన్నారు. మొక్కజొన్న కాంటా జరగాలంటే లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చిందని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి అధికారులు పర్యవేక్షణ చేస్తూ రైతులను ఆదుకోవాలని, పది రోజులలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు పూర్తి చేయకుంటే రైతులను కూడగట్టి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, పంజాల రమేష్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు లక్ష్మ ణ్, ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, బద్రి, ఎలేందర్, యాకాంబ్రచారి, రాజేందర్, పార్థసారథి పాల్గొన్నారు.

**అసంపూర్తిగా ఉన్న దేవాదులను పూర్తి చేయాలి:**
రాజకీయ పార్టీలు హుందాతనంతో సమస్యలపై స్పందించాలి కానీ వ్యక్తిగత దూషణలు మానుకొని ప్రజలకు ఉపయోగపడే విధంగా విధానాలను తీసుకురావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. రెండో విడత ఇందిరమ్మ గృహాలు మంజూరు చేసి పేదలను ఆదుకోవాలని,మిషన్ భగీరథ నీళ్ల నిరంతరం సరఫరా చేసి ప్రజల దాహార్తిని తీర్చాలి అని డిమాండ్ చేశారు. శనివారం ఎల్కతుర్తి మండలం గోపాల్ పూర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్టు మిట్ట ప్రాంతానికి వరప్రసాదంలాగా రైతాంగానికి ఉపయోగపడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసి చివరి ఆయకట్టు రైతాంగానికి ఉపయోగపడాలని కోరారు. మిషన్ భగీరథ నీళ్ల ఈ మధ్యకాలంలో మిట్ట ప్రాంతంలో అడపా, దడపా రావడం సరిగా రాకపోవడం వల్ల దాహార్తిని తీర్చేందుకు ఇబ్బంది అవుతుందని, వేసవికాలం లో పెట్టుకుని నిరంతరం నీటిని విడుదల చేసి ప్రజలను ఆదుకోవాలని చాడ వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మధ్యకాలంలో రాజకీయ పార్టీల నాయకులు హుందాతనంతో సమస్యలపై స్పందించి చర్చ లేవదీయాలి కానీ, వ్యక్తిగత దూషణలకు పోయి ప్రజలు అసహ్యించుకునే విధంగా వ్యవహరించకూడదన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి,జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఊట్కూరి రాములు, ఏదునూరి వెంకటరాజు,కొట్టె పాక రవి, మాలోత్ శంకర్ నాయక్, ప్రణీత్ గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పని వేళలు

ఈ నెల 12 నుంచి
15 కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు
మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో భూముల ధరల సవరణ నిర్ణయంతో రిజిస్ట్రేషన్‌లకు విపరీతమైన డిమాండ్ పెరిగిన నేపథ్యంలో, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నెల 12వ తేదీ నుంచి ఎంపిక చేసిన 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పని వేళలను అమలు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూముల ధరల సవరణపై రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో రిజిస్ట్రేషన్‌లకు భారీగా డిమాండ్ పెరిగినందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో భూముల వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులు ఉన్నందున వాటిని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ నిర్ణయంతో రిజిస్ట్రేషన్‌ల కోసం ప్రజలు అధిక సంఖ్యలో కార్యాలయాలకు వస్తున్న నేపథ్యంలో తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. అధిక రద్దీ ఉన్న చంపాపేట్, సరూర్ నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్ నగర్, షాద్ నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్‌బి నగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్లగొండ ఆర్‌ఒ, పటాన్ చెరు, కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు పని వేళలను పొడిగిస్తున్నట్లు చెప్పారు. అవసరమైతే ఈ 15 కార్యాలయాల్లో పని వేళలను మరింత పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను కూడా పెంచాలన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా రిజిస్ట్రేషన్‌ల రద్దీ పెరిగిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను గుర్తించి అవసరానికి అనుగుణంగా అదనపు సమయాన్ని అమలు చేయాలని సూచించారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ జరిగే తహసీల్దార్ కార్యాలయాలతో కూడా సమన్వయం చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత, వేగం, ప్రజలకు సౌకర్యం ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రిజిస్ట్రేషన్‌ల ఐజి రాజీవ్ గాంధీ హనుమంతుకు మంత్రి సూచించారు.

## పంట మార్పిడికి అనువైన ప్రణాళికలను సిద్ధం చేయండి

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సూచన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పంట మార్పిడి అనివార్యమని, రానున్న మూడేళ్లలో కనీసం13 లక్షల ఎకరాల్లో ఉద్యాన,పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఆయిల్‌సీడ్స్ సాగుకు మళ్లించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పంట మార్పిడి అవశ్యకతపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కమిషన్ రూపొందించిన నివేదికను శనివారం సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకి రైతు కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి సభ్యులు అందచేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి సుమారు 1.30 కోట్ల ఎకరాల్లో వరి సాగు జరుగుతోందని, పంట మార్పిడిలో భాగంగా వచ్చే మూడేళ్లలో కనీసం13లక్షల ఎకరాల్లో ఉద్యాన పప్పుధాన్యాలు తదితర పంటలు, పండించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందులోను మార్కెట్ లో డిమాండ్ ఉండే పంటలు సూచిస్తే రైతులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంటుందని, అలాంటి పంటలను దేశ ప్రాంత అవసరాలు దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలను సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. అదేవిధంగా ఈ ఏడాది 45 వేల ఎకరాలలో కొత్తగా ఆయిల్ పామ్ సాగును తీసుకురాగా.. వచ్చే సంవత్సరంలో 1 లక్ష ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేసేలా ప్రణాళిక తయారుచేసి, దానిని సాధించాలని అన్నారు. కేంద్రం తయారుచేసిన విత్తన చట్టంలో కూడా మార్పులు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ చట్టంలో నకిలీ విత్తనాల వలన రైతులు నష్టపోతే, రైతులకు చెల్లించాల్సిన పరిహారం విషయంలో ఎలాంటి స్పష్టత లేదన్నారు. విత్తన నియంత్రణలో కేంద్రంతో పాటు రాష్ట్రాలకు కూడా సముచిత అధికారాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మీన్ బాషా, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మి బాయి, ఇతర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు

## రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కోసం..

# టిజిఎస్ ఆర్‌టిసి ఆధ్వర్యంలో 'ఆర్ట్ ఫర్ లైఫ్'




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన 99 రోజుల 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు హైదరాబాద్ రీజియన్ రీజినల్ మేనేజర్ సుధా పరిమళ ఆధ్వర్యంలో టిజిఎస్‌ఆర్‌టిసి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆర్‌టిసి కళాభవన్‌లో 'ఆర్ట్ ఫర్ లైఫ్' సందేశాత్మక కళా పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యం కల్పించారు. ప్రజల సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇస్తూ పెయింటింగ్, స్కెచింగ్, ఫోటోగ్రఫీ, శిల్పకళ విభాగాల్లో పోటీలు నిర్వహించగా రాష్ట్రవ్యాప్తంగా కళాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాల పాటింపు, హెల్మెట్ వినియోగం, మ ద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు వంటి అంశాలపై కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీల్లో పెయింటింగ్ విభాగంలో 35 మంది, స్కెచింగ్ విభాగంలో 21 మం ది, శిల్పకళ విభాగంలో ఇద్దరు కళాకారులు పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. టిజిఎస్ ఆర్‌టిసి అధికారులు, ఉద్యోగులు, కళాకారుల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు సుధా పరిమళ తెలిపా రు.

## ఐపిఎస్ మాజీ భార్య హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

నిందితురాలు కల్పన కోసం గాలింపు
రంగంలోకి పది పోలీసు బృందాలు
ఢిల్లీలో నిందితులు..?

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పనిమనిషిగా చేరి ఐపిఎస్ భార్య తనుజాను హత్య చేసి పారిపోయిన నేపాల్‌కు చెందిన కల్పన కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ మేరకు పది ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. కల్పనతో పాటు ఆమెకు సహకరించిన నిందితులు ఢిల్లీలో ఉన్నట్లు విశ్వసనీయసమాచారం. డబ్బు, నగల కోసమే ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ పనిమనిషి పక్కా ప్రణాళికతో ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. హత్య, దోపిడీ వ్యవహారం పోలీసులకు తెలిసేలోపే నిందితులు రాష్ట్రం దాటేయడంతో, వారిని పట్టుకునేందుకు పదికి పైగా ప్రత్యేక బృందాలతో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. అయితే, నాంపల్లి నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో పారిపోయినట్లు పోలీసుల సమాచారం. ముంబై, లక్నో, ఢిల్లీలో నిందితుల కోసం వేట కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే నిందితులు ఢిల్లీలో ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారని తెలిసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీ హిల్స్ ప్రశాసన్నగర్లో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య తనూజ (55) శుక్రవారం ్న తెల్లవారుజామున దారుణ హత్యకు గురయ్యారు. ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ పనిమనిషి 'కల్పన'.. మరో ఇద్దరు అనుచరులతో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడింది. నిద్రిస్తున్న తనూజ నోట్లో గుడ్డలు కుక్కి, ఊపిరాడకుండా చేసి దారుణంగా హతమార్చారు. అనంతరం ఇంట్లోని బంగారం, నగదు దోచుకుని ముగ్గురు నిందితులు పరారయ్యారు. నిందితులు రాష్ట్రం నుంచి ఎలా పారిపోయారు? ఏ వాహనంలో వెళ్లారు? అన్నదానిపై ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్లు, బస్టాండ్ల వద్ద ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గత వారం రోజులుగా జూబ్లీ హిల్స్ బస్తీలో కొత్తవారి కదలికలు ఉన్నట్లు సమాచారం అందడంతో, బస్తీ వాసులను పోలీసులు ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం పోలీసులు అన్ని కోణాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేపాలీ గ్యాంగ్ కోసం జల్లెడ పడుతున్నారు.

# తెలంగాణకు భారీగా రైల్వే వరాలు..

రూ.1,535 కోట్ల ప్రాజెక్టులను
నేడు జాతికి అంకితం చేయనున్న ప్రధాని

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రైల్వే రంగానికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్రంలో రైల్వే రవాణా సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో చేపట్టిన సుమారు రూ.1,535 కోట్ల విలువైన కీలక రైల్వే మౌలిక వసతుల ప్రాజెక్టులను ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం జాతికి అంకితం చేయనున్నారు. ఈ ప్రాజెక్టులతో తెలంగాణలో రైళ్ల రాకపోకలు వేగవంతం కావడంతో పాటు, రద్దీ తగ్గి సరుకు రవాణా వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. ఈ సందర్భంగా కాజీపేట్–విజయవాడ మధ్య చేపట్టిన 118 కిలోమీటర్ల మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టును దేశానికి అంకితం చేయనున్నారు. దేశంలోని అత్యంత రద్దీ రైల్వే మార్గాల్లో ఒకటైన గ్రాండ్ ట్రంక్ కారిడార్‌పై ఈ ప్రాజెక్టు కీలక మార్పులకు దారి తీస్తుందని అధికారులు చెబుతున్నారు. అదనపు ట్రాక్‌ల ఏర్పాటు వల్ల రైళ్ల వేగం పెరగడం, సమయపాలన మెరుగుపడడం, ట్రాఫిక్ రద్దీ తగ్గడం వంటి ప్రయోజనాలు లభించనున్నాయి. ముఖ్యంగా సరుకు రవాణా మరింత సులభతరం అవుతుందని రైల్వే శాఖ అంచనా వేస్తోంది.

అదే విధంగా కాజీపేట్ రైల్ అండర్ రైల్ బైపాస్ ప్రాజెక్టును కూడా ప్రధాని ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టుతో కాజీపేట్ జంక్షన్‌లో రైళ్ల రద్దీ తగ్గి, హైదరాబాద్, బల్హార్షా, విజయవాడ వైపు వెళ్లే రైళ్లు ఒకేసారి కదిలే అవకాశం ఏర్పడనుంది. దీంతో ఆపరేషనల్ సామర్థ్యం పెరగడంతో పా టు ఆలస్యాలు తగ్గనున్నాయి. తెలంగాణలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్రం ప్రాధాన్యత ఇస్తోందని అధికారులు పేర్కొంటున్నారు. తాజా ప్రాజెక్టులు పూర్తికావడంతో రాష్ట్ర పా రిశ్రామిక, వాణిజ్య రంగాలకు కూడా ఊతం లభించే అవకాశముందని భావిస్తున్నారు.

## బాలికపై లైంగిక దాడి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలి

ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు ఓ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు మీడియాలో వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపించాలని ఎఐఎస్‌ఎఫ్ రా ష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బాధిత కుటుంబం ఫిర్యాదు చేసినా ఇప్పటికీ కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి, అవసరమైతే పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి బాధితురాలికి న్యాయం చేయాలన్నారు. రాష్ట్రంలో చ ట్టాలు ఎవరికి వత్తాసు పలకుండా అందరికి ఒకేవిధంగా ఉండాలని తప్పు చేసిన ఎవరినైనా శిక్షించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కులగణనపై మోదీ సమాధానం చెప్పాలి

నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసన ర్యాలీలు

జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతి జనగణలో సమగ్ర కులగణన చేపడతామని కేంద్ర కేబినెట్‌లో నిర్ణయించి, ప్రస్తుతం జరుగుతున్న జనగణనలో కులగనన చేయనందుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన ర్యాలీలు చేపట్టాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తెలంగాణ పర్యటనకు రావడానికి ముందే బిసి డిమాండ్లపై ప్రధాని మోదీ బిసిలు సంధించిన పది ప్రశ్నలకు సమాధానం చెప్పాలని అఖిలపక్ష బిసి సంఘాలు విజ్ఞప్తి చేసినప్పటికీ నేటి వరకు సమాధానం చెప్పకుండా బిసిలపై కేంద్రం వివక్షత చూపిస్తున్నదని ఆరోపించారు. హైదరాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే బిజెపి బహిరంగ సభలో కేంద్ర క్యాబినెట్ నిర్ణయాన్ని అమ లు చేస్తామని, జనాభా లెక్కలు బిసి కులాలను లెక్కించి జనాభా దామాషా ప్రకారం బిసి రిజర్వేషన్లు పెంచుతామని ప్ర ధాన మంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు.

# కటిక చీకట్లో 'కారు' దీపం కాళేశ్వరం ప్రాజెక్టు

మేడిగడ్డ మరమ్మతులు చేతగాక
తుమ్మిడిహట్టి వద్ద కాంగ్రెస్ డ్రామాలు
మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ డిప్యూటి ఫ్లోర్ లీడర్
తన్నీరు హరీష్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** మేడిగడ్డ వద్ద కుంగిన రెండుపిల్లర్లను మరమ్మతులు చేయకుండ రాష్ట్ర ప్రయోజనాలను రేవంత్‌రెడ్డి సర్కార్ గాలికివదిలేసిందని..వచ్చే ఏడాది రాబోయే కరువును ఎదుర్కోవాలంటే మేడిగడ్డ రిపేర్లు వెంటనే పూర్తి చేయాలని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ డిప్యూటి ఫ్లోర లీడర్ హరీష్‌రావు అన్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని బిఆర్‌ఎస్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. తుమ్మిడిహట్టి వద్ద కాంగ్రెస్ మంత్రులు. హడావిడి చూస్తే పనితక్కువ..ప్రచారం ఎక్కువ సిఎం రేవంత్‌రెడ్డి మంత్రులకు వాగుడు తప్ప..చేతలు శూన్యం అని ఎద్దేవా చేశారు. శనివారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడారు. తుమ్మిడిహట్టివద్ద 150 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు నిర్మాణానికి ఒప్పందం కుదిరిందని మంత్రి వివేక్‌వెంకటస్వామి పచ్చి అబద్దాలు చెపుతున్నారన్నారు. నిజంగా ఒప్పందం కుదిరితే ఉమ్మడి రాష్ట్రంలో ఎడున్నర ఏండ్లు అధికారంలో ఉండి తట్టెడు మట్టి ఎందుకు తవ్వలేదన్నారు. ఈ రెండున్నర ఏండ్లు డ్రామాలు చేస్తూ పనులు ఎందుకు ప్రారంభించలేదన్నారు. 30 నెలలుగా కాంగ్రెస్‌ను ఎవ్వరు ఆపారని, ఆరోజు మహారాష్ట్ర సిఎం పృథ్వీరాజ్ చవాన్ అప్పటి సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాసారు. మాతో ఒప్పందం లేకుండ ఏకపక్షంగా పనులు ఏలా చేస్తారని ఇవన్ని నిర్వీర్యం అవుతాయని, మీరు ఏపనిచేసిన వృధా అవుతుందని స్పష్టంగా చెప్పారన్నారు. కాని కాంగ్రెస్ నేతలు అగ్రిమెంట్ అయిపోయిందని పచ్చి అబద్దాలు చెపుతున్నారన్నారు. కిరణ్‌కుమార్ రెడ్డి ఉన్నప్పుడు అగ్రిమెంట్ అయిపోయిఉంటే తుమ్మిడిహట్టి వద్ద పనులు ప్రారంభించకుండ చేవెళ్ల వద్ద ఎందుకు తవ్వారని ప్రశ్నించారు. ప్రాణహిత చేవేళ్ల పనులకు భూసేకరణకు ఖర్చుచేసింది 3780 కోట్లు కాని సిఎం రేవంత్‌రెడ్డి 11వేల కోట్లు పూర్తయ్యాయని చెప్పటం పచ్చి అబద్ధమన్నారు.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రాణహిత చేవేళ్లకు శంకుస్థాపన చేస్తే అది జలయజ్ఞం కాదని ధనయజ్ఞం అని విమర్శించారని, ఇప్పుడేమో ప్రాజెక్టు గురించి గొప్పగా మాట్లాడుతున్నారన్నారు. ఇప్పుడు మండుటెండల్లో సైతం నిమిషానికి మేడిగడ్డ వద్ద 6400 క్యూసెక్కులు నీళ్ల కిందకు వెళ్తున్నాయని, తుమ్మిడిహట్టి వద్ద కేవలం 2వేల క్యూసెక్కుల పోతున్నాయని 2వేలు ఎక్కడ 6400 క్యూసెక్కులు ఎక్కడ ఆన్నారు. మేడిగడ్డ వద్ద 500 బోర్లు వేయాల్సి ఉండగా 5బోర్లు కూడ వేయలేదన్నారు. వచ్చే సంవత్సరం ఎల్‌నిఒ వల్ల దేశమంతా కరువు వస్తుందని సైంటిస్టులు చెపుతున్నారని, కటిక చీకట్లో 'కారు' దీపం కాళేశ్వరం ప్రాజెక్టు అన్నారు. కాళేశ్వరం తక్కువ చేసి మాట్లాడితే కెసిఆర్‌ను తక్కువ చేసినట్లు కాదని తెలంగాణ రాష్ట్రానికి చేస్తున్న ద్రోహం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా తుమ్మిడిహట్టి వద్ద జలహారతుల డ్రామాలు ఆపి, మేడిగడ్డ వద్ద కుంగిన పిల్లర్లు మరమ్మతు చేసి రైతాంగానికి సాగు, తాగునీరు అం దించాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఫారుక్‌హుస్సేన్, రాధకిషన్‌శర్మ పాల్గొన్నారు.

## తెలంగాణ విభజన హామీలు ఏమయ్యాయ్?

ఎఐవైఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీతో పాటు తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలు ఏమయ్యాయో ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని ఎఐవైఎఫ్ డిమాండ్ చేసింది. తెలంగాణ ప్రజలకు, యువతకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇప్పుడు మళ్లీ కొత్త హామీలతో తెలంగాణ ప్రజలను మోసం చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఎఐవైఎఫ్ ఆరోపించింది. రాష్ట్రంలో ప్రధాని రాష్ట్ర పర్యటన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలిఉల్లాఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, కార్యనిర్వాహక అధ్యక్షులు ఎన్.శ్రీకాంత్, ఉపాధ్యక్షులు మర్రి శ్రీమాన్, టి.సత్యప్రసాద్, కౌన్సిల్ సభ్యులు సల్మాన్‌బేగ్ ప్రధాని మోదీకి బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ ఒక వైపు దేశ యువతకు 2014 ఎన్నికలల్లో ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ ఉన్న ఉద్యోగాలను తగ్గిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014 విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన ప్రధాన హామీలు బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐటి, ఐఐఎం, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదాలు ఏమయ్యాయ ని ప్రశ్నించారు. కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ తెలంగాణ ప్రజల భావోద్వేగాలను ఉపయోగించుకుని రాజకీయ లాభాలు పొందడం తప్ప కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. దేశ యువత భవిష్యత్తుతో, తెలంగాణ ప్రజల ఆశయాలతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడితే ఎఐవైఎఫ్ ఊరుకోబోదని, ప్రజావ్యతిరేక, యువత వ్యతిరేక విధానాలను ఉపసంహరించకపోతే ఆం దోళనలు, నిరసనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించా రు.

# తప్పు చేస్తే కేంద్ర మంత్రి కొడుకైనా శిక్ష పడాల్సిందే

రాష్ట్రంలో శాంతిభద్రతలు అస్తవ్యస్తం
బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకురాలు
సబితా ఇంద్రా రెడ్డి ధ్వజం

ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర మంత్రి కొడుకైనా, సామాన్యుడైనా తప్పు చేస్తే శిక్ష పడాల్సిందేనని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనాయకులు పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బిజెపి నేత బండి సంజయ్ కుమారుడు బండి బగీరథ్‌పై వచ్చిన ఆరోపణలపై సబితా ఇంద్రారెడ్డి ఘాటుగా స్పందించారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఎమ్మెల్సీ సురభి వాణి దేవి, మాజీ ఎంపి మాలోతు కవితలతో కలిసి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కేంద్రమంత్రి కొడుకైనా, సామాన్యుడైనా చట్టం ముందు అందరూ సమానమే అన్నారు. ఫిర్యాదు వచ్చినట్లయితే పోలీసులు స్వీకరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బాధితురాలు మైనర్ అయితే పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేయాల్సిందేనని అన్నారు. నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్షాలను వేధించడానికే సమయాన్ని కేటాయిస్తోంది తప్ప ప్రజల రక్షణను విస్మరించిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకంగా హోం మంత్రి లేకపోవడం వల్ల శాంతిభద్రతల పర్యవేక్షణ కరువైందని సబితా రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రే హోం మంత్రిగా ఉన్నప్పటికీ, ఆయన కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి ఎప్పుడూ హోం శాఖపై సమీక్షలు నిర్వహించిన దాఖలాలు లేవన్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ ప్రకారం 2023తో పోలిస్తే 2024లో క్రైమ్ రేట్ 18.4 శాతం పెరగడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. మాజీ ఐపిఎస్ అధికారి భార్యను పట్టపగలే హత్య చేయడం ఆందోళన కలిగిస్తోందని, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ స్వయంగా గస్తీకి వెళ్తే పోకిరీలు వేధించారంటే సామాన్య మహిళల పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి ఉన్న కరీంనగర్‌లోనే బంగారు షాపులో చోరీ జరగడం శాంతిభద్రతల వైఫల్యానికి పరాకాష్ట అన్నారు. ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న అభద్రతా భావం ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున హత్యలు జరుగుతుంటే పెట్టుబడులు ఎలా వస్తాయి? విద్యా రంగంలో తీవ్ర గందరగోళం నెలకొందన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో సిసి కెమెరాల నిఘాతో ప్రశాంతంగా ఉన్న తెలంగాణ, నేడు రేవంత్ రెడ్డి పాలనలో అల్లకల్లోలంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
ఆదివారం
10-05-2026
www.prajapaksham.in
మహానగరి
GREATER HYDERABAD



## కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

**ప్రజాపక్షం/చర్లపల్లి :** మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ కమిషనర్ సుమతి ఐపిఎస్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన శాంతి భద్రతపై ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందించే తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బండారి నీలంరెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాసం మహిపాల్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశం



**ప్రజాపక్షం/చర్లపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నాగారం డివిజన్ పరిధిలోని ఈస్ట్ గాంధీ నగర్ కాలనీలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు సునీత, నాగేంద్రలు నిర్మించుకున్న నూతన గృహ ప్రవేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, హరిబాబు, నాయకులు అశోక్‌గౌడ్, కొండల్‌రెడ్డి, సతీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మల్కాజిగిరి డివిజన్ సర్దార్‌పటేల్ నగర్ ప్రాంతంలో ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ఎయిర్‌టెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపి వేయాలంటూ స్థానికులు కోరారు. ఈ మేరకు మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, స్థానిక కాలనీవాసులు శ్రీకాంత్, నీలం సతీష్, నర్సింగరావు, ఇస్మాయిల్, నర్సింగ్, గఫూర శీను, సాయి, శేఖర్, చిన్న, నరేష్, సాయికుమార్, రాజశేఖర్, రమ్య, సయోమి, నాగమణి, కవిత, సావిత్రి, లక్ష్మి, స్వర్ణ, ప్రశాంతి, మౌనిక తదితరులు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డిని కల్సి వినతిపత్రం సమర్పించారు. వెంటనే ఎమ్మెల్యే స్థానిక పోలీస్ ఇనస్పెక్టర్‌ను ఈ విషయం వివరించి టవర్ నిర్మాణ పనులను చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## స్వామివారికి పట్టు వస్త్రాలు అందజేత



**ప్రజాపక్షం/చర్లపల్లి :** కీసర రాంపల్లి దాయరలో వైభవంగా హేమాద్రి శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. టిటిడి దేవస్థానం ప్రధాన అర్చకులు పూజ్యశ్రీ వేణుగోపాల దీక్షితులు చేతుల మీదుగా శ్రీవారి యంత్ర, విగ్రహ ప్రతిష్ట జరిగింది. సిఎం రేవంత్‌డ్డి తరపున సిఎం ముఖ్య సలహాదారులు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆయనతో పాటు దనసరి సీతక్క, ఎమ్మెల్యే మల్లారెడ్డిలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందు ధర్మ ప్రచారకులు స్వామి రాధా మనోహర్‌దాస్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, సుధీర్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్, ఎం పరమేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్‌రెడ్డి వారికి శ్రీవారి చిత్ర పటాలను అందజేశారు.

## కొనుగోలు ప్రక్రియ వేగవంతం



జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్ :** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను దృష్టి సారించాలని ,విద్యావారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారీ సంబంధిత అధికారులకు తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ కోరారు. హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్టేషన్‌ను పంచాయతీ కార్యదర్శిల సహకం తీసుకొని ప్రక్రియ వేగవంతం చేసేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తమన్నారు. విద్యా వారోత్సవాలు షెడ్యుల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈనెల 11నుండి 17వరకు విద్యావారోత్సవాలు నిర్వహించాలని లిస్ట్ ప్రకారం నిర్వహించాలన్నారు. జిల్లా నుండి హైదరాబాద్‌కు విద్యార్థులను తరలించాలని అన్నారు. అధికారులందరూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి రేణుఖదేవి, డిఆర్డిఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ అడ్వాన్స్‌డ్‌కు సర్వం సిద్ధం

జంట నగరాల్లో 113 పరీక్షా కేంద్రాలు
హాజరు కానున్న 69,599 మంది విద్యార్థులు
పకడ్బందీగా నిర్వహించాలి : డిఎసి కన్వీనర్ ఒడ్డెన్న
మే 13 నుంచి మే 21 వరకు పరీక్షలు

**ప్రజాపక్షం/సిటీబ్యూరో :** ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జంట నగరాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మే 13 నుంచి మే 21వ తేది వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఇంటర్ రెగ్యులర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన వారు, తక్కువ మార్కులు వచ్చి ఇంప్రూవ్‌మెంట్ కొరకు రాస్తున్న వారు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. వీరి కోసం హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో మొత్తం 113 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు మొత్తం 69,599మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వీరిలో మొదటి సంవత్సరం పరీక్షలు రాస్తున్నవారు 41,107మంది కాగా రెండవ సంవత్సరం పరీక్షలకు 28,492 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన చీఫ్ సూపరిండెంట్‌లు(సిఎస్), డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు(డిఓ), అసిస్టెంట్ చీఫ్ సూపరిండెంట్‌లు, ఇన్విజిలేటర్లను నియమించారు. సిఎస్, డిఓలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి 30 మంది కస్టోడియన్లను ఏర్పాటుచేశారు. ఒకేరోజు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటల పరీక్షలు ఉన్న విద్యార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వీరికి మొదటి పరీక్ష అయిన తర్వాత మధ్యాహ్నం భోజనం చేయడానికి, విశ్రాంతి, తదుపరి పరీక్షకు సిద్ధమవడానికి తగు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులు కూడా అవసరమైన ఆహారం, ఇతరత్రలు వెంట తెచ్చుకోవాలని డిఎసి కన్వీనర్ ఒడ్డెన్న తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పరీక్షలకు హాజరవుతున్న వారికి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఏర్‌కూలర్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారు.

**పకడ్బందీగా నిర్వహణ : డిఎసి కన్వీనర్ ఒడ్డెన్న**

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డిస్ట్రిక్ ఎగ్జామినేషన్ కమిటి కన్వీనర్, డిస్ట్రిక్ట్ ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డి.ఒడ్డెన్న తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణపై శనివారం నాంపల్లి



ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని వనితా మహా విద్యలయం ఆడిటోరియంలో చీఫ్ సూపరిండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, అసిస్టెంట్ చీఫ్ సూపరిండెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరీక్షల నిర్వహణకు సంబంధించి వారికి తగు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. పరీక్షలు ప్రతి రోజు రెండు పూటల ఉంటాయన్నారు. మొదటిది ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవది మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఒకే రోజు రెండు పరీక్షలున్నవారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ప్రణాళికలు రూపోందించుకోవాలని వారి సూచించారు.

# పశుపోషణ, పాడి పరిశ్రమ పట్ల వివక్ష



**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** కేంద్ర ప్రభుత్వం పశుపోషణ, పాడి పరిశ్రమను నిర్లక్ష్యమే చేయడమే కాకుండా వివక్ష కూడా చూపుతోందని పలువురు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ స్కీము అమలు తీరుపై నిర్వహించిన రౌండ్ టేండ్ సమావేశంలో యాదవ, కురుమ, గొర్రెలుమేకల పెంపకందారులు, గొర్రెల కాపరుల వృత్తి సంఘాల నాయకులు పాల్గొని తమ ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే.. గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరి యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ఎన్ఎల్ఎం పథకాన్ని పూర్తి సరళతరం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న కఠినమైన నిబంధనలు, షరతుల కారణంగా వృత్తి కులాలకు చెందిన గొర్రెల కాపరులకు ఈ పథకం ద్వారా ఒక్క శాతం కూడా ప్రయోజనం చేకూరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి యాదవులు, కురుమలు, గొర్రెల కాపరులకు ప్రత్యేక ప్రోత్సాహం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్‌యాదవ్, యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకానీ వెంకట్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి అయిలబోయిన రమేష్ యాదవ్, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ యాదవ్, గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ తదితరులు మాట్లాడుతూ.. ఈ విషయంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

## ఆకట్టుకుంటున్న రాంబో సర్కస్




**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** సర్కస్ రంగంలో తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్న రాంబో సర్కస్ క్యూర్ ప్రాంత వాసులను అలరించేందుకు వచ్చేసింది. ప్రపంచ స్థాయి కళాకారులు, అత్యాధునిక సాంకేతికత, ఉత్కంఠభరిత విన్యాసాలతో రూపొందించిన ఈ మెగా ఎంటర్‌టైన్‌మెంట్ షోను శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమం ఆడిటోరియంలో గ్రాండ్‌గా ప్రారంభించారు. రాంబో సర్కస్ ఆర్గనైజర్ కమ్ యజమాని సుజిత్ దిలీప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రత్యేక ఆకర్షణలుగా డాన్స్ షో, లేజర్ లైట్ ఎఫెక్ట్స్, రోబోటిక్ ఎలిఫెంట్, బబుల్ యాక్ట్, క్లౌన్ కామెడి షో, థ్రిల్లింగ్ బ్యాలెన్స్ విన్యాసాలు, స్కేటింగ్ యాకట్స్ ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తున్నాయి.

## మోదీ సభకు తరలిరండి



**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం జరగనున్న ప్రధాని నరేంద్రమోదీ భారీ బహిరంగ సభకు జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు, మహిళలు, వ్యాపారులు తరలిరావాలని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం, కృష్ణానగర్ డివిజన్, వెంకటగిరి, స్రవంతినగర్ కాలనీల్లో బీజేపీ వర్గాలు శనివారం ప్రతి ఇంటికి, షాప్‌కి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు కార్యక్రమంలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ బిజెపి సీనియర్ నాయకులు బరిగెల జ్ఞానేశ్వర్, పులి రామ్మోహన్, బడుగు సతీష్, సందీప్, నాగరాజ్, శ్రీనివాస్, వెంకట్రావు, రాణిబాయ్, కరుణశ్రీ, కృష్ణవేణి, భ్రమరాంభిక, రాధ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి తదుపరి టార్గెట్ తెలంగాణ

మోదీ మీటింగ్‌కు మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్
నుంచి లక్ష మంది హాజరుకావాలి
ఎంపి ఈటల రాజేందర్ పిలుపు



**ప్రజాపక్షం/సిటీబ్యూరో :** మూడవసారి ప్రధాని అయ్యాక మోదీ తొలి సారి మన రాష్ట్రానికి వస్తున్నారు.. భారతదేశాన్ని అస్థిరపరచాలని చూసిన శక్తులను తొక్కి పడేసి అఖండ భారతను సురక్షితంగా ఉంచుతామని మాట ఇచ్చి.. సాధించిన విజయంతో ఆయన తెలంగాణకు వస్తున్నారు.. బీజేపీ తదుపరి మజిలీ, టార్గెట్ తెలంగాణ అని ప్రజలు అనుకుంటున్నారు.. బిఆర్ఎస్ వద్దనుకొని కాంగ్రెస్‌కి ఓటు వేస్తే రెండేళ్లలోనే తేలిపోయింది.. తెలంగాణ అప్పుల ఊబిలో కోరుకుపోకుండా ఉండాలంటే, నియంతృత్వ పోకడలు పోవాలంటే, అభివృద్ధి చెందాలంటే బీజేపీనే అధికారంలోకి రావాలనే భావన ప్రజల్లో ఉందని ఎంపి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు సికింద్రాబాద్ గాయత్రి గార్డెన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడారు. నేడు మోదీ మీటింగ్‌కి ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారు. ఎన్నికల సమయంలో మోదీ ప్రచారానికి వచ్చినప్పుడు మల్కాజిగిరి ప్రజలు చూపిన ప్రేమను ఎక్కడా చూడలేదు అన్నారు. కంటెన్మెంట్‌లో 16 వేల ఓట్లతో ఎమ్మెల్యే ఓడిపోయినా మోదీ ప్రభావం వల్ల ఎంపీ ఎన్నికల్లో 25 వేల ఓట్ల మెజారిటీ వచ్చింది. ఆ ప్రేమను మళ్ళీ చూపించేందుకు మల్కాజిగిరి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. గత రెండేళ్లుగా మేము చేస్తున్న పనులు చూసి మీరు ఎక్కువ సంఖ్యలో హాజరైతే మాకు కూడా స్ఫూర్తిగా ఉంటుంది. మోడీకి అండగా నిలవాలని కోరుతున్నాను. దేశంలో 22 రాష్ట్రాల్లో బీజేపీ గెలిచింది. 23వ రాష్ట్రం తెలంగాణ గెలవబోతుంది. బల్దియా ఎన్నికల్లో కూడా విజయం సాధించబోతున్నాం. కార్యకర్తలు, నాయకులు ప్రజల వెంట ఉండి బహిరంగ సభకు రండి. మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంగ్ నుంచి లక్ష మంది హాజరుకానున్నారు. ఎండకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసాము. మేము వెయ్యి బస్సులు పంపిస్తున్నాం. వ్యక్తులుగా ఎవరు ఏం మాట్లాడినా.. మా బీజేపీ సంస్కారవంతమైన పార్టీజ.. దాడులు చేయడం తిట్టడం మా సంస్కృతి కాదని ఈటల స్పష్టం తేల్చిచెప్పారు.

## ఇంటర్ బోధనపై స్పష్టత ఇవ్వాలి

తెలంగాణ ప్రైవేట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్
రాష్ట్ర అధ్యక్షుడు గౌరీ సతీష్

**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై విద్యార్థుల భవిష్యత్తు నెలకొందని తెలంగాణ ప్రైవేట్ జూనియర్ లెక్చరర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరీ సతీష్ అన్నారు. తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 1,460 జూనియర్ కళాశాలలో ఉన్నాయని.. 9 లక్షల 50 వేల మంది విద్యార్థులు ఇంటర్ చదువుకుంటున్నారని తెలిపారు. 2026 27 గాను రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో మార్పు తెస్తున్నామని అధికారులు చెప్పారని.. కానీ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం ఎంతవరకు సమంజసం? అని ఆయన ప్రశ్నించారు. ఇక ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలకు, ప్రభుత్వ కాలేజీలకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఇంటర్ బోధనపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో తెలియక అయోమయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకొని అధికారికంగా తెలపాలని గౌరీ సతీష్ కోరారు.

# శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి



మెథడిస్ట్ చర్చ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ సూపరింటెండెంట్
రెవరెండ్ జిడి అనిల్ కుమార్

**ప్రజాపక్షం/అబిడ్స్:** హైదరాబాద్ నగరంలోని క్రైస్తవులకు శ్మశాన వాటిక కోసం మూడు ఎకరాల స్థలం కేటాయించాలని మెథడిస్ట్ చర్చ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ సూపరింటెండెంట్ రెవరెండ్ జిడి అనిల్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం గన్‌ఫౌండ్రీలోని మెథడిస్ట్ చర్చ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెయింట్ జార్జ్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ సాల్మన్‌రాజుతో కలిసి ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నగరంలోనే 16 లక్షల పైగా ఉన్న క్రైస్తవుల అంత్యక్రియలో భాగంగా నారాయణగూడలోని శ్మశాన వాటిక స్థలం సరిపోడం లేదని.. ఈ విషయమే ఇప్పటికే గత ప్రభుత్వం మంత్రులకు, కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రులకు వినతి పత్రాలు సమర్పించామని తెలిపారు. తమ సాంప్రదాయం ప్రకారం క్రైస్తవులకు సమాధి చేసేందుకు స్థలం దొరకకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందుల గురవుతున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను అభివృద్ధి చేస్తోందని, క్రైస్తవులకు సైతం మెహదీపట్నం ప్రాంతంలో మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి శ్మశాన వాటికకు స్థలం కేటాయిస్తే రేవంత్‌రెడ్డి మేలు మర్చిపోమన్నారు. సమావేశంలో మెథడిస్ట్ చర్చ్ సెక్రెటరీ ఏసుదాసు, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ బి.రాబర్ట్, మెర్సీ ప్రియాంక, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు నర్సింహులు గృహప్రవేశం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జవహర్‌నగర్‌లో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నర్సింలు నూతనంగా నిర్మించుకొన్న గృహప్రవేశం శనివారం అత్యంత వైభవంగా జరసిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్ బోస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జి.దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఉమామహేష్, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటపల్లి శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు వి.హరినాథ్‌రావు, కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, మూడుచింతలపల్లి మండలం కార్యదర్శి టి.రాములు గౌడ్, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప్, బికె ఎంయు నాయకులు నరేంద్రచారి, ఏఐటియుసి నాయకులు రాజేష్‌సింగ్ తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజెపి శ్రేణుల బైక్ ర్యాలీ

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని మల్లంపేట్, మహేశ్వరం, ఇందిరమ్మ కాలనీ, సింహపురి కాలనీ, బౌరంపేట్, సారెగూడెం, గండి మైసమ్మ తదితర ప్రాంతాలలో బిజెపి బహిరంగ సభ నేపథ్యంలో బిజెపి శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మే 10న తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికై సుమారు రూ.8 వేల కోట్ల నిధులతో ప్రారంభించి జాతికి చేయడం, యువత స్కిల్స్, చట్ట సభల్లో పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ సాధికారతను అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీ ఆగడాలను నిలువరించడానికి ప్రజలకు తెలియజేయడానికి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌కు విచ్చేస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోడీకి స్వాగతం పలుకుతూ, దుండిగల్ సర్కిల్ 295, బౌరంపేట్ డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గోనె మల్లారెడ్డి, ఎంబరి ఆంజనేయులు, సీనియర్ నాయకులు దమ్మగారి ప్రభాకర్ రెడ్డి, రాళ్ల బండ నరసింహ చారి, పి.మాధవరెడ్డి, అందె అశోక్, ఎస్.నర్సింగ్ రావు, ఎం.అతీష్ బాబు, సారా నవీన్, లక్ష్మారెడ్డి, పరికి ప్రమోద్ కుమార్, కిరణ్, మహేష్, రాహుల్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# ఎమ్మెల్యేపై బురదజల్లే రాజకీయాలు మానుకోండి

చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే అవినీతిని నిరూపించు
మీడియా సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్, నేతలు



**ప్రజాపక్షం/తాండూరు :** తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిపై బురదజల్లే రాజకీయాలు మానుకోవాలని, కక్షపూరిత రాజకీయ పోకడాలకు పోతే ఊరుకునేది లేదని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ నిరాజబాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాతుల నాగరాజు, మహిపాల్‌రెడ్డి, రాజుకుమార్, రాజవర్దన్‌రెడ్డి మాజీ అధ్యక్షుల హబీబ్‌లాల బిఆర్ఎస్ నాయకులపై తీవ్రంగా హెచ్చరించారు. శనివారం తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తాండూరు ఎంఎల్ఏ మనోహర్‌రెడ్డిపై, అనుచర నేతలపై కోర్టు ద్వారా ఎఫ్ఐఆర్ నమోదు చేయించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ప్రతి పక్ష బిఆర్ఎస్ నాయకులు ఎంఎల్ఏ మనోహర్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక కేసులు నమోదు చేయించడ సరైందకాదన్నారు. మున్సిపల్ ఎన్నికల కౌటింగ్ కేంద్రం వద్ద బిఆర్ఎస్ నేతలు చేసిన రచ్చ అందరికి తెలిసిందే అన్నారు. కౌటింగ్ ప్రక్రియ ముగిస్తున్న సమయంలోనే ఎంఎల్ఏ మనోహర్‌రెడ్డి కౌటింగ్ కేంద్రంలోకి వెళ్ళకుండా మీడియా పాయింట్ వద్దకు వచ్చి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడం పట్ల ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారని వారు గుర్తుచేశారు. ప్రజలలో ఎంఎల్ఏ వస్తున్న ఆదరణ, అభ్యర్థుల గెలుపును జీర్ణించుకోలేక మాజీ ఎంఎల్ఏ పైలెట్ రోహిత్ రెడ్డి, వారి అనుచర నేతలు పోలీసులపై ధౌర్జన్యానికి పాల్పడిన తీరు గుండాయిజాన్ని తలపించిందని అన్నారు. తాండూరు ప్రజలకు మంచి చేస్తున్న మనసున్న మహారాజు మనోహర్‌రెడ్డి అని ఆయనతో కలసి రావాల్సింది పోయి బురదజల్లే రాజకీయాలు మానుకోవాలని సూచించారు. కేసు నమోదు చేయించకునేంత తప్పు ఎంఎల్ఏ మనోహర్‌రెడ్డి ఏనాడు చేయబోరని అన్నారు. బిఆర్స్ నేతలు చేసిన దురాగాతాలకు ఆదారాలు ఉన్నాయని....? దమ్ముంటే ఎంఎల్ఏ మనోహర్‌రెడ్డి చేస్తున్న అవినీతిని ఆధారాలతో నిరూపించాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ నాయకులు ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలను ఎవ్వరు నమ్మరని, ఇలాంటి మోసగాళ్ళను తగిన బుద్ది ప్రజలే చెబుతారని అన్నారు.ఈ మీడియా సమావేశంలో కౌన్సిలర్లు జుంటుపల్లి వెంకటర్, బంటు వేణుగోపాల్, దివిటి ఎల్లప్ప, పోలీస్ బాలకృష్ణారెడ్డి తదితర నాయకులు నారా శ్రీకాంత్‌లు ఉన్నారు.

## నల్లమట్టిని రైతులు వినియోగించుకోవాలి



ఎంసిపల్లి చైర్మన్ జాం రవి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రైతులు చెరువుల్లో లభించే నల్లమట్టిని నేరుగా తీసుకుని పొలాల్లో చల్లుకోవాలని దీంతో భూసారం పెరుగుతుందని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి అన్నారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి లక్ష్మాపూర్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో లక్ష్మాపూర్ పెద్ద చెరువులో నల్లమట్టి పూడికతీత కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనలో ఎంసిపల్లి మండలంలోని జగ్గంగూడ, కొల్తూర్, లక్ష్మాపూర్ తదితర చెరువులు, కుంటల్లో ముళ్ల కంచెలు, పిచ్చి మొక్కలను తీసేసి శుభ్రం చేస్తున్నామని చెప్పారు. చెరువుల నుంచి తీస్తున్న నల్లమట్టిని రైతులు తమ పొలాల్లో వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిఇఇ జయరాములు, ఎఇఇ ప్రశాంత్‌కుమార్, వర్క్ ఇన్స్‌పెక్టర్ వాసు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌ను టార్గెట్ చేస్తున్న నేపాలి ముఠాలు..!

- దొంగతనాలు.. దోపిడీలు.. హత్యలతో ఆందోళన
- విలాసవంతమైన కాలనీలే లక్ష్యం..
- ఇంటి పనిమనుషులు, వాచ్‌మెన్‌ల రూపంలో రెక్కీ..!



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో గత పదేళ్లుగా నేపాలి ముఠాలకు సంబంధించిన నేరాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. మొదట చిన్నచిన్న దొంగతనాలతో ప్రారంభమైన ఈ ముఠాల కార్యకలాపాలు ఇప్పుడు భారీ దోపిడీలు, హత్యల దాకా వెళ్లినట్లు పోలీసు దర్యాప్తుల్లో బయటపడుతోంది. ముఖ్యంగా నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, గచ్చిబౌలి, నర్సింగి, సికింద్రాబాద్, మల్కాజిగిరి వంటి ధనిక ప్రాంతాలనే ఈ ముఠాలు లక్ష్యంగా చేసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. ఇంటి పనిమనుషులు, వాచ్‌మెన్‌లు, కేర్‌టేకర్లు, చిన్న హోటళ్ల కార్మికుల రూపంలో నగరంలోకి ప్రవేశిస్తున్న కొందరు నేపాలి ముఠా సభ్యులు ముందుగా లక్ష్యంగా పెట్టుకున్న ఇళ్లపై రెక్కీ నిర్వహిస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. యజమానుల రాకపోకలు, ఇంట్లో ఉన్న నగదు, బంగారం, సిసి కెమెరాల స్థితి వంటి వివరాలను సేకరించి తరువాత ముఠా సభ్యులకు సమాచారం అందిస్తున్నట్లు విచారణల్లో బయటపడింది. జూబ్లీహిల్స్లో సంచలనం సృష్టించిన మాజీ ఐపిఎస్ అధికారి భార్య హత్య కేసు తాజాగా వెలుగు చూసింది. 2021లో మల్కాజిగిరి, నాచారం ప్రాంతాల్లో వరుస చోరీల కేసుల్లో ఆరుగురు నేపాలి పౌరులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి భారీగా బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లోనే ఈ ముఠా హైదరాబాద్‌లో అద్దె గదులు తీసుకుని ముఠాగా పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. 2023లో పిజి రోడ్‌లో ఓ వ్యాపారవేత్త ఇంట్లో జరిగిన రూ.5 కోట్ల భారీ చోరీ నగరంలో సంచలనం సృష్టించింది. ఇంట్లో పనిచేసే వాచ్‌మెన్, అతని భార్య సహకారంతో నేపాలి ముఠా సభ్యులు ఇంట్లోకి ప్రవేశించి బంగారం, వజ్రాలు, నగదు అపహరించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసు తర్వాత నగర వ్యాప్తంగా గృహ సహాయకుల పోలీస్ వెరిఫికేషన్ అంశం మళ్లీ చర్చకు వచ్చింది. 2025లో సికింద్రాబాద్ గన్‌రాక్ ఎన్‌క్లేవ్‌లో రిటైర్డ్ ఆర్మీ అధికారి ఇంట్లో జరిగిన దోపిడీ మరింత కలకలం రేపింది. బాధితుడిని కట్టేసి, మత్తుమందు ఇచ్చే ప్రయత్నం చేసి దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో 13 మంది సభ్యులతో కూడిన నేపాలి గ్యాంగ్ వెలుగులోకి రావడం పోలీసులను సైతం అప్రమత్తం చేసింది. తర్వాత నర్సింగి ప్రాంతంలో అదే ముఠాకు చెందిన సభ్యులను పోలీసులు అరెస్ట్ చేసి దోపిడీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ముఠా సభ్యులు నగరంలోని పలు గేటెడ్ కమ్యూనిటీల్లో వాచ్‌మెన్‌లు, టిఫిన్ సెంటర్ కార్మికులుగా పని చేస్తూ సమాచారం సేకరిస్తున్నట్లు తేలింది. ఇటీవల జూబ్లీహిల్స్‌లో రిటైర్డ్ ఐపిఎస్ అధికారి భార్య హత్య కేసు కూడా నగరంలో తీవ్ర చర్చకు దారితీసింది. ఇంట్లో పని చేసే నేపాలి మహిళ సహకారంతో హత్య జరిగి ఉండొచ్చన్న అనుమానాలతో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటన తర్వాత నగర ప్రజల్లో భయాందోళనలు మరింత పెరిగాయి. పోలీసుల ప్రకారం, ఈ ముఠాలు ముందుగా ఒంటరిగా నివసించే వృద్ధులు, ఉద్యోగాల కోసం తరచూ బయటకు వెళ్లే కుటుంబాలు, భారీ నగదు లావాదేవీలు చేసే వ్యాపారవేత్తల ఇళ్లను లక్ష్యంగా ఎంచుకుంటున్నాయి. కొందరు ముఠా సభ్యులు ఒకసారి నేరానికి పాల్పడిన తర్వాత వెంటనే నగరం విడిచి వెళ్లిపోతుండటంతో దర్యాప్తు క్లిష్టంగా మారుతోందని అధికారులు చెబుతున్నారు. ఇక నగరంలో గృహ సహాయకులు, వాచ్‌మెన్‌లు, డ్రైవర్ల నియామకంలో తప్పనిసరిగా పోలీస్ వెరిఫికేషన్ చేయాలని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లు పునరుద్ఘాటిస్తున్నాయి. అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, గేటెడ్ కమ్యూనిటీల నిర్వాహకులు బయటి రాష్ట్రాలకు చెందిన సిబ్బంది వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్లలో నమోదు చేయాలని సూచిస్తున్నారు.

మరోవైపు, నగరంలో పెరుగుతున్న అంతర్రాష్ట్ర ముఠాల కదలికలపై టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ నిఘా పెంచినట్లు సమాచారం. సీసీ కెమెరాల ఆధారంగా నేరస్తులను ట్రాక్ చేయడం, పాత నేరస్తుల డేటాబేస్‌ను అప్డేట్ చేయడం, అనుమానాస్పద కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు. హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా గృహ సహాయకుల నియామకంలో నిర్లక్ష్యం ప్రాణాంతక పరిస్థితులకు దారితీస్తోందని హెచ్చరిస్తున్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రజాపాలన లక్ష్యం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ మధుసూదన్ రెడ్డి



**ప్రజాపక్షం/షాబాద్:** ప్రజల సంక్షేమమే ప్రజాపాలన లక్ష్యం అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని కుమ్మరిగూడ, పెద్దవేడు గ్రామాల్లో రూ. 80 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. రాష్ట ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామిలను దశల వారిగా అమలు చేస్తు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కుమ్మరిగూడ గ్రామంలో రూ.20లక్షల నిధులతో నూతన గ్రామ పంచాయతీ భవనం, రూ.20లక్షలతో సీసీ రోడ్డు పనులు, రూ.5 లక్షలతో వీధి లైట్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన్నట్లు వివరించారు. పెద్దవేడు గ్రామంలో రూ.10 లక్షలతో నూతన డ్వాక్రా భవనం, రూ.20 లక్షలతో సీసి రోడ్లు, రూ.5లక్షలతో వీధి లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. షాబాద్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు రాకుండ తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ వైజ్ చైర్మన్ చంద్రశేఖర్, సర్దార్‌నగర్ మార్కెట్ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు ప్రభాకర్ రెడ్డి, గుండాల అశోక్, రాజసులోచన, శ్రీశైలం , లావణ్య చెన్నయ్య, స్వరూప మహేందర్ గౌడ్, సబితా గోవర్ధన్ రెడ్డి, సవిత, శాంతమ్మ, నవనీత నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, సుభాష్ రెడ్డి, వీరేందర్ రెడ్డి, సందీప్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ పేదల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** గ్రామీణ పేద ప్రజల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని వెల్‌జర్ల సర్పంచ్ రాత్లావత్ బాబునాయక్ వివరించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్‌జర్ల గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న చింతకొండపల్లి అనంతతో కలిసి ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశం చేయించారు. ఇందిరమ్మ లబ్దిదారుకు నూతన వస్త్రాలను అందించి అభినంధించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాబునాయక్ మాట్లాడుతూ గ్రామీణ నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నదే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు కల నేరవేర్చాలన్నదే లక్ష్యంగా పని చేస్తుందని, ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని ఆకాంక్షించారు. పేదల నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలను, కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకువస్తుందని వివరించారు. లబ్దిదారు చింతకొండపల్లి ఆనంత మాట్లాడుతూ తనకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. 99రోజు ప్రణాళిలో వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాన్ని స్థానిక సర్పంచ్ బాబునాయక్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదయ్య, ఉప సర్పంచ్ దొడల వెంకటేష్ యాదవ్, ఇందిరమ్మ కమిటి సభ్యులు జాంగారి రవి, కటికెల మంగమ్మ తిరుపతి యాదవ్, సుజాత రఘునాయక్, కాంగ్రెస్ నేతలు జాంగారి జంగయ్య, అనిమి గణేష్ గౌడ్, వార్డు సభ్యులు కావలి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/కొందుర్గు:** పేద ప్రజల శ్రేయస్సు కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని లాలాపేట సర్పంచ్ శారద నర్సింహులు సూచించారు. శనివారం కొందుర్గు మండల పరిధిలోని లాలాపేట గ్రామంలో పట్నం మహేందర్‌రెడ్డి వైద్యశాల ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ శారద నర్సింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శారద నర్సింహులు మాట్లాడుతూ గ్రామాల్లో ఉండే పేత ప్రజలకు దీర్ఘకాలిక సంబంధించిన బీపి, షుగర్ లాంటి పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందించడం ఎంతో అభినంధనీయమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఆరోగ్యమే మహభాగ్యం అన్న పద్దతిలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. ఆర్యోగాన్ని కాపాడుకుంటేనే కొంతమేరకు మనుగడ ఉంటుందనే విషయాన్ని గ్రహించాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో 300మందికి పరీక్షలు నిర్వహించగా 80మందికి చికిత్స నిమిత్తం బస్సులో ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినందుకు ఆసుపత్రి యాజమాన్యానికి గ్రామస్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చంద్రారెడ్డి, వార్డు సభ్యులు మధుసూదన్‌రెడ్డి, భాగ్య బాలరాజ్, మమత లక్ష్మారెడ్డి, శ్రీశైలం గ్రామస్తులు పాల్గొన్నారు.

## హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్న దానం



**ప్రజాపక్షం/మియాపూర్ :** హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ సేవలు అభినందనీయమని, సమాజాన్ని తనవంతుగా కొంత సేవ చేయాలనే మానవత దృక్పథంతో అన్న దానంతో పాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వారికి ఈ సంర్భంగా అభిమానులు అభినందనలు తెలిపారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరవహిస్తున్న అన్న దాన కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన 183వ వారం అన్న ప్రసాదం హోప్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ ప్రజలకు వడ్డించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ... ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి భోజనాలు చే యడం చేయాలా అరుదుగా జరుగుతుంది అన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా హోప్ సభ్యులు అన్ని జాగ్రత్తలు తీసుకొని వారికి ఏలోటు లేకుండా చూసుకుంటున్నారని తెలిపారు. అనేక సేవకార్యక్రమలు చేస్తున్న హోప్ ఫౌండేషన్ చర్మన్ తో పాటు సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిత్య జీవితంలో లింగ వివక్ష వీడాలి

మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో 'స్టాండ్ విత్ హర్' ప్యానెల్ చర్చ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాజంలో మహిళల పట్ల ప్రదర్శిస్తున్న చిన్నచూపు, నిత్యం ఎదురయ్యే లింగ వివక్ష వారి మానసిక భద్రతపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రతా విభాగం డిజి చారు సిన్హా అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఉన్న 'వీహబ్' వేదికగా స్టాండ్ విత్ హర్ ప్రచారంలో భాగంగా 'ఎవ్రీడే సెక్సిజం ఎమోషనల్ సేఫ్టీ' అనే అంశంపై శనివారం ప్యానెల్ చర్చ నిర్వహించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో మహిళల పట్ల సమాజం ప్రదర్శిస్తున్న వివక్షా పూరిత ధోరణులపై లోతైన చర్చ జరిగింది.ఈ సందర్భంగా చారు సిన్హా మాట్లాడుతూ.. నిత్యం మహిళలపై జరిగే చిన్నపాటి ఎగతాళి, అసభ్యకరమైన జోకులు నేరాల్లా అనిపించకపోవడమే అసలైన ప్రమాదమని హెచ్చరించారు. ఇవి సమాజంలో ఒక అలవాటుగా మారిపోవడం వల్ల ఎవరూ ప్రశ్నించడం లేదని, ఫలితంగా మహిళలు తమకు రక్షణ ఉండాల్సిన చోట కూడా అభద్రతా భావానికి లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పురుషులు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకున్నప్పుడే మహిళలకు గౌరవప్రదమైన వాతావరణం లభిస్తుందని ఆమె స్పష్టం చేశారు.

కార్పొరేట్ రం గం నుంచి హాజరైన శైలజ జోశ్యుల మాట్లాడు తూ.. మహిళల ఎంపికలను గౌరవించడం నేర్చుకోవాలని, పాతకాలపు మూసధోరణులకు స్వస్తి పలికినప్పుడే మార్పు సాధ్యమవుతుందన్నారు. అనంతరం సినీ దర్శకుడు శైలేష్ కొలను మాట్లాడుతూ.. మహిళా పాత్రలను సృజించేటప్పుడు తాను ఇప్పటికీ ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తానని, మనమంతా నేర్చుకునే దశలో ఉన్నామని గుర్తించినప్పుడే సమాజంలో మెరుగైన మార్పు ను చూడగలమని పేర్కొన్నారు. మహిళలు తమకున్న అంతర్గత శక్తిని గుర్తించాలని చాయ్ బిస్క ట్ వ్యవస్థాపకుడు శరత్ చంద్ర కోరారు. ఆర్థిక స్వావలంబన సాధించిన మహిళలు జీవితంలో మెరుగైన నిర్ణయాలు తీసుకోగలరని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మసూద్ హుస్సేనీ వివరించారు.

## ఎంఎంసి ఆధ్వర్యంలో మెగా ఈ-వేస్ట్ కలెక్షన్ డ్రైవ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) ఆధ్వర్యంలో 99 రోజుల కార్యాచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం మెగా ఈవేస్ట్ కలెక్షన్ డ్రైవ్‌ను విజయవంతంగా నిర్వహించారు. నగరవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 38 కలెక్షన్ పాయింట్‌ల ద్వారా సుమారు 3.53 మెట్రిక్ టన్నుల ఈవేస్ట్ను అధికారులు సేకరించారు. ఈ డ్రైవ్‌లో మొత్తం 71 ఎలక్ట్రానిక్ పరికరాలను వివిధ కేటగిరీల వారీగా సేకరించినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో మౌలాలి సర్కిల్లోనే అత్యధికంగా 1 మెట్రిక్ టన్ను ఈవేస్ట్ సేకరణ జరిగినట్లు తెలిపారు. పాత ఎలక్ట్రానిక్ పరికరాలను బాధ్యతాయుతంగా అందజేస్తూ ప్రజలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, ఎలక్ట్రానిక్ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, స్వచ్ఛ నగర నిర్మాణమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

## గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు రూ.4 లక్షల చెక్కును అందించిన హీరో కృష్ణసాయి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** టాలీవుడ్ హీరో కృష్ణసాయి తన సేవా కార్యక్రమాలతో మరోసారి ప్రశంసలు అందుకున్నారు. తన ఆధ్వర్యంలో నడుస్తున్న 'కృష్ణసాయి ఇంటర్నేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్' ద్వారా సమాజ సేవలో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ క్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలకు మద్దతుగా తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు రూ.4 లక్షల చెక్కును విరాళంగా అందించారు. హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో యువతకు ఆదర్శంగా నిలుస్తూ సేవాభావంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న కృష్ణసాయిని గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పలు అంశాలపై వీరిద్దరు చర్చించుకున్నారు.

## స్వీయ గణన, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పౌరులు భాగస్వాములు కావాలి : వినయ్ కృష్ణా రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతి నగర పౌరుడు స్వీయ గణన ప్రక్రియలో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి విజ్ఞప్తి చేశారు. నగరవ్యాప్తంగా స్వీయ గణన, స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రజల్లో స్వీయ గణన ప్రాధాన్యతను వివరించేందుకు ఎల్.బి. నగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో నేతృత్వంలో వీఎమ్ హోమ్స్ నుంచి కొత్తపేట జంక్షన్ వరకు భారీ 2కె రన్ నిర్వహించారు. నాచారం, కాప్రా సర్కిళ్లలో కాప్రా కార్యాలయం నుంచి రాధికా థియేటర్ వరకు నిర్వహించిన పరుగులో యువత, పౌరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అవగాహన కార్యక్రమాల అనంతరం అధికారులు చైతన్యపురి, రాఘవేంద్ర కాలనీల్లో పర్యటించి, నాలా డీసిల్టింగ్ పనులను స్వయంగా పరిశీలించారు. పారిశుద్ధ్యం మెరుగుపరచడం, పారదర్శక పాలన అందించడం, ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. క్రాంతినగర్, జనప్రియ కాలనీ, శృంగేరి కాలనీ నివాస సంఘాలు (ఆర్‌డబ్ల్యూఎ), స్వయం సహాయక మహిళా సంఘాలతో కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీయ గణన పూర్తి చేయడం, స్వచ్ఛ సర్వేక్షణ్లో భాగంగా సిటిజన్ ఫీడ్‌బ్యాక్ ఇవ్వడం ప్రతి పౌరుని బాధ్యత అన్నారు. మెరుగైన సౌకర్యాల కల్పనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. నాగారం, ఘట్‌కేసర్ డివిజన్‌లలో డిప్యూటీ కమిషనర్ వాణి ఆర్‌డబ్ల్యూఎలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు.


## ఎంజెపి విద్యార్థులకు జాతీయ స్థాయిలో గుర్తింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బిసి సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీకి చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి సెయిలింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ముంబై సమీపంలోని మార్వేలో మే 2 నుంచి 8 వరకు నిర్వహించిన ఇండియా యూత్2026 నేషనల్స్ సెయిలింగ్ పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి ఎంజెపి పాఠశాలకు చెందిన విద్యార్థిని పి. ఝాన్సీ గ్రీన్ ఫ్లీట్ సింగిల్స్ విభాగంలో స్వర్ణ పతకం సాధించగా, నిజామాబాద్ జిల్లా ఇందూర్ ఎంజెపి పాఠశాలకు చెందిన ఏ. అరవింద్ డబుల్స్ విభాగంలో రజత పతకం గెలుచుకున్నాడు. మొత్తం ఏడుగురు ఎంజెపి విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుకున్నారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడలు, సాహసక్రీడల్లోనూ రాణించడం గర్వకారణమని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. విజేతలను సంస్థ కార్యదర్శి సైదులు అభినందించారు.

## బిసిలకు 60 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకోండి


షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** బిసిలకు 60శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. శనివారం కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హన్మంత్‌రావు నివాసంలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మద్దతు తెలిపారు. అదే విధంగా కొత్తూరు మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, రాయికల్ శ్రీనివాస్‌లు సైతం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ బీసిలను ప్రధాన మంత్రి చేస్తానని చెప్పి ఓబీసిలను జనాభా గణనలో ఎందుకు విస్మరిస్తున్నారని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే జనాభా గణనలో బీసిలకు చేర్చాలనే డిమాండ్‌తో వి.హన్మంత్‌రావు దీక్ష చేపట్టడం విశేషమని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే జనాభా గణనలో బీసి, ఇతర వెనుకబడిన తరగతులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు మొదటి దశ నుండే లెక్కించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో ఒబిసిలను చేర్చకపోతే దీక్షను విరమించే ప్రసక్తి లేదని హెచ్చరించారు. రాహుల్‌గాంధీ తీసుకున్న కులగణన అంశాన్ని దేశవ్యాప్తంగా పెద్ద సామాజిక సంస్కరణగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రూ. 150కోట్ల బడ్జెట్‌తో కుల గణన నిర్వహించి లెక్కలను వెల్లడించడం ఒక చారిత్రాత్మకమైన నిర్ణయమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య బిసిల హక్కుల సాధనలో ముందడుగని ప్రశంసించారు. గతంలో రాజ్యసభ సభ్యుడిగా వి.హన్మంత్‌రావు ఉన్న సమయంలో 80మంది ఎంపిల మద్దతు కూడగట్టి సోనియాగాంధీని ఒప్పించి ఐఐటి, ఐఐఎం వంటి ఉన్న విద్యాసంస్థల్లో బీసాలకు 27శాతం రిజర్వేషన్లు సాధించడంలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. బిసిల హక్కుల కోసం తాను ఎల్లప్పుడు పోటారం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. వెనుకబడిన బిసిలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

## బిజెపి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుంది

బిజెపి జిల్లా కార్యదర్శి కొండామధుకర్‌రెడ్డి...




**ప్రజాపక్షం/యాచారం :** నేడు హైద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కొండామధుకర్‌రెడ్డి కొరారు. శనివారం యాచారం మండల కేంద్రంలో అయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో హ్యాట్రిక్ విజయాలతో మూడవ సారి ప్రధానమంత్రిగా పదవి భాధ్యలను స్వీకరించి దేశంలోని 21 రాష్ట్రాల్లో బిజెపి ఎన్‌డిఎ ప్రభుత్వాలను అధికారంలోకి తెచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావాలన్నా సంకల్పంతో హైద్రాబాద్‌కు వస్తున సందర్భంగా అయనకు ప్రత్యేమైన స్వాగతం పలుకుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం వేలాదికోట్ల రూపాలయల అభివృద్ధి పనులకు శంఖుస్థాపనకు శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. హైద్రాబాద్ నగరంలో మోదీ బహిరంగ సభను నిర్వహిస్తుండడంతో ప్రతి పక్షాలకు ఏ మాత్రం మింగుడు పడడం లేదన్నారు. బహిరంగ సభలో మోదీ ఎం మాట్లాడుతారోనని భయపడుతున్నారని తెలిపారు. మోదీ హైద్రాబాద్‌కు రావడం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందన్నారు. తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మోదీ పథకాలను తమ పథకాలుగా చెప్పుకుంటు పబ్బ గడుపుకోవాలని చూస్తుందన్నారు. నగరంలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దెతున తరలి రావాలన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు పురుషోత్తం, నందివనపర్తి

## కల్వకుర్తిలో రోడ్డు ప్రమాదం

### వైద్యుడు విజయ్ కుమార్ దుర్మరణం

**ప్రజాపక్షం/కల్వకుర్తి:** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని సిబిఎం కళాశాల సమీపంలో శ్రీశైలం హైదరాబాద్ హైవే రోడ్డుపై శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు విజయ్‌కుమార్ దుర్మరణం చెందారు. కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో డా.విజయ్ కుమార్ కుటుంబ సభ్యులను అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో పాటు పలువురు పరామర్శించారు. కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నాగర్‌కర్నూల్ వెళ్లారు వరకు డా.విజయ్‌కుమార్ మృతదేహాన్ని శవ యాత్ర నిర్వహించి కన్నీటి వీడ్కోలు పలికారు. డా.విజయ్ కుమార్ ను రోడ్డు ప్రమాదం రూపంలో కోల్పోవడం బాధాకరమన్నారు. కల్వకుర్తి ప్రాంతంలో వైద్య వృత్తిపరంగా డా.విజయ్‌కుమార్ ఎంతో నిరుపేద ప్రజలకు వైద్య సేవలు చేశారని పట్టణవాసులు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో పాటు ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు డా.విజయ్‌కుమార్ స్నేహితులు తదితరులు ఉన్నారు.

## హామీలు బొంద పెట్టి తెలంగాణలో పర్యటన సిగ్గుచేటు

### ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్



**ప్రజాపక్షం/ అమరచింత :** తెలంగాణ ను అవమానించి, ఇచ్చిన హామీలను బొందపెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ రాష్ట్ర పర్యటనకు పూనుకోవడం సిగ్గుచేటని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి. కుతుబ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అమరచింత మండల కేంద్రంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర కమిటీ ప్రధాన రాసిన బహిరంగ లేఖలు విడుదల చేస్తూ కుతుబ్ మాట్లాడారు. నరేంద్ర మోదీ గో బ్యాక్ నినాదాలు, హామీలు అమలు చేయాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసి నిరసన తెలిపారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, రైతుల ఖాతాల్లో రూ. 15 లక్షల జమ ఏమైందని కేంద్ర ప్రభుత్వానికి ఆయన ప్రశ్నించారు. రాష్ట్రవిభజన హామీలు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐటి, ఐఐఎం, గిరిజన విశ్వవిద్యాలయం హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ' మ్యాన్ పవర్ రివైజేషన్ 202627 ' పేరుతో 29,608 రైల్వే లో ఉద్యోగాలను తగ్గించే నిర్ణయం తీసుకోవడం దారుణమని ఎఐవైఎఫ్ ఖండిస్తుందన్నారు. తెలంగాణ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వడం లేదని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఆయన ఆందోళన చెందారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని కించపరుస్తూ సాక్షాత్తు పార్లమెంటులో తల్లిని చంపి పిల్లని బతికించారని వ్యాఖ్యానించిన నరేంద్ర మోదీ తెలంగాణ ప్రజలను మళ్ళీ పెట్టి రాష్ట్రంలో అధికారంలోకి రావాలన్న యావ తప్ప ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్న కనీస ధ్యాస లేదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు, యువజన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక యువత వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోకపోతే వివిధ రూపాల్లో నిరసనలు, ఆఫీసుల ముట్టడులు, రాస్తారోకోలు తదితర ఆందోళన రూపాలతో పోరాటాలను తీవ్రతరం చేస్తామని ఆయన కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉదమ్ కిరణ్, నరేష్, మహబూబ్, మంజుల, శ్రీకాంత్, నవదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల దాడి

### రెండు ట్రాక్టర్లు స్వాధీనం, డ్రైవర్లపై కేసులు నమోదు



**ప్రజాపక్షం/ఉట్కూర్:** ఉట్కూర్ మండల పరిధిలోని పగిడిమర్రి సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పెట్టుకుని కేసులు నమోదు చేసినట్లు ఉట్కూర్ ఎస్ఐ రమేష్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం పగిడిమర్రి శివారులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ట్రాక్టర్ నెంబర్లు ఎపి22టిఏ 0625, టిఎస్06 యుసి 6283 లను ఆపి తనిఖీ చేయగా, అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి, డ్రైవర్లు పెద్ద హరికృష్ణ (పగిడిమర్రి), కావలి సరూల్‌పై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉట్కూరు ఎస్ఐ రమేష్ హెచ్చరించారు.

## దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు

### ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కల్వకుర్తి:** దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు, సమాజంలో ఐక్యత, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఒఒ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి మండలం, వేపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దేవాలయాల అభివృద్ధి మనందరి బాధ్యత, ఇలాంటి పవిత్ర కార్యక్రమాల్లో భాగస్వా మ్యం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి గతం లో ఇచ్చిన హామీ మేరకు దేవాలయ ధ్వజస్తంభం ప్రతిష్టాపన కోసం రూ.1,50,000 చెక్కును గ్రామస్తుల సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, ఆలయ కమిటీ సభ్యులు పెద్ద బాలయ్య, గానుగట్ల సత్యం, వెంకటయ్య, చిన్నబాలయ్య, పెద్ద లక్ష్మయ్య, కురుమయ్య, చిన్న వెంకటయ్య, గద్ద సాయిలు, చిన్న లక్ష్మయ్య, లతో పాటు గ్రామస్తులు , భక్తులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ పోలీసింగ్‌పై ప్రజలకు అవగాహన

**ప్రజాపక్షం/ పెబ్బేరు :** పెబ్బేరు సంతలో ఇటీవల కాలంలో బైక్, మొబైల్ ఫోన్, పిక్ ప్యాకెటింగ్ లాంటి మోసాలు పెరిగిపోవడంతో స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్ వెంకటేశ్వర్ గౌడ్ సంతలోని ప్రజలతో కమ్యూనిటీ పోలీసులో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అపరచిత వ్యక్తులతో పరిచయం పెంచుకోరాదని, కొత్త వ్యక్తులకు లిఫ్ట్ ఇవ్వకూడదని, సైబర్ మోసాలకు గురి కాకుండా ఉండాలని, ద్విచక్ర వాహనాలకు సెంటర్ లాక్ వేసుకొని జాగ్రత్తపడాలని సంతలోని ప్రజలకు అవగాహన కల్పించారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో..

# సొంత ఇంటి కల సాకారం

### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**ప్రజాపక్షం/ వనపర్తి న్యూ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు సొంత ఇంటి కల సాకారం అవుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే.. దంపతులకు నూతన వస్త్రాలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. పెద్ద మందడి మండలం చిన్న మందడి గ్రామానికి చెందిన కురుమయ్య మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రేకుల ఇళ్లు, మట్టి మిద్దెల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుపేదలకు రూ.5 లక్షల విలువగల ఇందిరమ్మ ఇళ్లతో తమ సొంత ఇంటి కల నెరవేరిందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటిని నిర్మించుకోవాలని కలలు గన్న నిరుపేద కుటుంబాల ఆ కల సాకాకారం కాకపోవడంతో సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం ద్వారా ప్రతి ఒక్క నిరుపేద సొంత ఇంటి కల నెరవేరిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యకరమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు మాజీ సర్పంచ్ ల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 11న కలెక్టరేట్ ముందు ధర్నా

### సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు గోవింద్ రాజ్



**ప్రజాపక్షం/మక్తల్:** మక్తల్ మండల పరిధిలో దాసర్ దొడ్డి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని సిపిఐ(ఎం) బృందం శనివారం సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించడం జరిగింది. ధాన్యం కొనుగోలులో తీవ్రంగా అలసత్వం జరుగుతుందని, బస్తకు అదనంగా కిలో ధాన్యాన్ని తీసుకుంటున్నారని రైతులు, మా దృష్టికి తీసుకురావడం జరిగింది తెలిపారు. సంబంధిత అధికారులతో సంప్రదించి అవకతవకలను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి అందుబాటులో లారీలని ఉంచి ధాన్యాన్ని తరలించాల్సిందిగా అధికారులు ను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు సిఆర్ గోవింద్ రాజ్, పి.రాము, ఏం మంజప్పా, వెంకటేష్, చంద్రప్ప తదితరలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు వసతులు ఏర్పాటు

### అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను



**ప్రజాపక్షం/నారాయణపేట్:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని వసతులు ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను అధికారులను ఆదేశించారు. శనివారం ధన్వాడ మండలంలోని మందిపల్లి, అప్పంపల్లి మరికల్ మండలంలోని తీలేరు, మద్దూరు మండలంలోని పల్లె గడ్డ తాండ గుండుమాల్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సేకరించిన వరి ధాన్యాన్ని సకాలంలో రైస్ మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను నిల్వ చేసేందుకు షెడ్డు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాలలో రైతులకు త్రాగునీరు సౌకర్యాలను చూశారు. ఆయా కేంద్రాల నిర్వహణ, టార్పాలిన్ల లభ్యత, అవసరమైన హమాలీలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గన్నీ బస్తాలుచ,, ఇతర ఏమైనా తక్కువ అయితే వాటిని తెప్పించుకోవాలని కొనుగోలు కేంద్రాల ఇన్ ఛార్జ్‌లను ఆదేశించారు.

## నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం



**ప్రజాపక్షం/అలంపూర్:** జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో ఉండవెల్లి మండల పరిధిలోని శేరిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు గ్రామ సర్పంచ్ ఇ.అశ్విని ఎల్లగౌడ్ ఘనంగా ప్రారంభించారు. అలాగే పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి కార్యాలయంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు ఈ నూతన భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. గ్రామ పంచాయితీ భవనం అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు, ఉపసర్పంచు, వార్డు సభ్యులతో పాటు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు సింగిల్ విండో చైర్మన్ గజేందర్ రెడ్డి, పుల్లూరు రఘురెడ్డి, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.


### రాజోలి మండల టాపర్‌కు సన్మానం

రాజోలి మండలం మాన్‌దొడ్డి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) లో చదువుతున్న స్నేహ ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో 563 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు విద్యార్థిని ఇంటికి వెళ్లి, ఆమెకు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇలాంటి గొప్ప ఫలితాలు సాధించడం ఎంతో సంతోషకరం. స్నేహ పట్టుదల అందరికి ఆదర్శం. ఉన్నత చదువుల్లో కూడా ఆమె మరిన్ని విజయాలు సాధించి, తల్లిదండ్రులకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోళ్లలో భారీ నిర్లక్ష్యం..!

### రైతుల ఫిర్యాదులతో కార్యదర్శి పై వేటు
### జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తాత్కాలిక సస్పెన్షన్
### మార్కెట్ లో కొత్త ఇన్‌చార్జి నియామకం

**ప్రజాపక్షం/జడ్చర్ల :** మహబూబ్ నగర్ జిల్లాలో రబీ 2025 26 మొక్కజొన్న సేకరణ వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది. జడ్చర్ల మార్కెట్ లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కొనుగోళ్లలో జరిగిన అవకతవకలు, నిర్లక్ష్యంపై వచ్చిన ఫిర్యాదులను జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకుంది. ఈ నేపథ్యంలో పిఎసిఎస్ బాదేపల్లి లిమిటెడ్ కార్యదర్శి యాదగిరి పై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకున్నారు. మొక్కజొన్న సేకరణ విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం జరిగినట్లు ఆరోపణలు రావడంతో, ఆయనను తాత్కాలికంగా విధుల నుండి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సంయుక్త రిజిస్ట్రార్ / జిల్లా సహకార అధికారి డి. కృష్ణ మెమోరాండం విడుదల చేశారు. ఆర్‌సి.నెం. 1259/ 2025సి1, శనివారం ప్రకారం ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఇక పై జడ్చర్ల మార్కెట్ లో పిఎసిఎస్ బాదేపల్లి లిమిటెడ్ తరపున మొక్కజొన్న సేకరణ బాధ్యతలను పిఎసిఎస్ భూత్‌పూర్ లిమిటెడ్ స్టాఫ్ అసిస్టెంట్ ఆర్. వెంకటేష్ కు అప్పగించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయనే ఇంచార్జీ గా వ్యవహరించనున్నారు.



రైతులు మార్కెట్ లో రోజుల తరబడి వేచి ఉండాల్సి రావడం, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, తూకాల్లో గందరగోళం, సరైన స్పందన లేకపోవడం వంటి అంశాల పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సహకార శాఖ ఒక్కసారిగా అప్రమత్తమై, కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితులను సమీక్షిస్తున్నట్లు తెలుస్తోంది. రైతులకు ఇబ్బందులు కలిగిస్తే ఎంతటి అధికారిపైనా చర్యలు తప్పవని ఈ ఘటనతో స్పష్టమైన సంకేతాలు వెళ్లాయి.

## ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

### రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కె.వి.ఎస్. రెడ్డి



**ప్రజాపక్షం/వంగూరు:** రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తూ గిట్టుబాటు ధర కల్పిస్తామని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కెవిఎస్ రెడ్డి అన్నారు. శనివారం, నిజాంబాద్, తిప్పారెడ్డిపల్లి గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అన్నదాతలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్రంలోని రైతాంగాన్ని ఆదుకుంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ పండిత్‌రావు, మహిళా సమైక్య అద్యక్షురాలు నర్మద జనార్ధన్, ఏవో ప్రియదర్శిని, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిమ్ముల రాజశేఖర్ రెడ్డి, సింగల్ విండో డైరెక్టర్లు శంకర్ యాదవ్, సర్పంచ్‌లు యాసాని వెంకట్‌రెడ్డి, పుల్జాల కృష్ణారెడ్డి, రంగారావు, దొడ్డు విష్ణు, వెంకటయ్య, మహిళా సంఘం సభ్యులు నిర్మలమ్మ, కలమ్మ, వెంకటమ్మ, ఏవో జైపాల్, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేసింది

### కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

**ప్రజాపక్షం/ పానుగల్ :** రైతుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం పానుగల్ మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వరి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్న రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేయడమేనా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనా అని ఆయన విమర్శించారు. వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకుంటే బిఆర్ఎస్ పార్టీ పక్షాన రైతులకు మద్దతుగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. తక్షణమే అధికారులు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెబ్బేటి వీరసాగర్, మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమనాథ్ నాయక్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు దశరథ్ నాయుడు, రంగాపురం శివారెడ్డి, మాజీ ఎంపీటీసీలు మిద్దె కృష్ణ, రామచందర్ యాదవ్, అడివన్న, వెంకట్రాములు, నవీన్ రెడ్డి, ఖాదర్, రామకృష్ణ, గురువయ్య, అశోక్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

### కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/గద్వాల రూరల్:** ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ధాన్యం, కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై శనివారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ అన్ని జిల్లాలలో వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు ఒక్క రోజే మిగిలి ఉండడంతో ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో పది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వీరంతా స్వీయ గణన చేసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా 11 నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సిఎస్ కోరారు. గద్వాల ఐడిఒసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ 66 శాతం పూర్తయిందని, పంచాయతీ కార్యదర్శులు సహకారం కూడా తీసుకొని, ప్రక్రియ వేగవంతం చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యా వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. సెన్సస్ పై సూపర్వైజర్లు, ఎన్యుమరే టర్లకు సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి స్వామి కుమార్, వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, మార్కెటింగ్ శాఖ అధికారి పుష్పమ్మ, డిఆర్డిఓ ముషాహిదా బేగం, డిఐఇఒ హృదయ రాజ్, డిఇఒ విజయలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

## పిఎసిఎస్ పాలకమండలి ప్రమాణస్వీకారం

### రైతుల అంశంపై మాజీ ఎమ్మెల్యే చిల్లర రాజకీయాలు
### జడ్చర్లలో మాజీ ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలన్నీ బయటపెడతాం
### ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** జడ్చర్ల మండల ప్రాథమిక వ్యవాయ సహకార సంఘం (పిఎసిఎస్) నూతన పాలకమండలి ప్రమాణస్వీకార కార్యక్రమంలో శనివారం జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పాలకమండలి చైర్మన్ సుదర్శన్ గౌడ్, వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, డైరెక్టర్లు ఎమ్మెల్యే హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం, సహకా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. అయితే కొంతమంది నాయకులు స్వార్థ రాజకీయాల కోసం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. జడ్చర్ల మార్కెట్ లో మక్కల కొనుగోలు విషయంలో మాజీ ఎమ్మెల్యేకు చెందిన వ్యక్తి రాజకీయాలు చేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రైతుల వద్ద నుంచి మక్కలు కొనుగోలు చేయకుండా అడ్డంకులు సృష్టించి, రైతులను అవమానసకరంగా మాట్లాడటం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీని పై ఆగ్రహించిన రైతులు రోడ్డు బైఠాయించి ధర్నా నిర్వహించారని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉన్న మాజీ ఎమ్మెల్యే, ఆ ధర్నాలో కూర్చోవడం సిగ్గుచేటు విషయమని వ్యాఖ్యానించారు. అందుకుగాను వెంటనే మార్కెట్లో విధులు నిర్వహిస్తున్న వ్యక్తిని వెంటనే సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారు. జడ్చర్ల ప్రజలు అభివృద్ధి, ప్రజాసేవ కోసం కాంగ్రెస్ పార్టీకి ఆశీర్వాదం అందించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పనిచేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గతంలో జరిగిన అవినీతి, అక్రమాలు, కుంభకోణాల పై పూర్తి వివరాలతో త్వరలోనే ప్రజల ముందుకు వస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పిఎసిఎస్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైతులను వేధించొద్దు


### రోడ్డుపై ధాన్యానికి నిప్పంటించి, రైతుల నిరసన
### గోవర్ధనగిరిలో రాస్తారోకో



**ప్రజాపక్షం/ వీపనగండ్ల :** రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని విక్రయించుకునే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తాళ్లు, తరుగు పేరుతో రైస్ మిల్లర్లు ధాన్యాన్ని తిరస్కరిస్తూ రైతులను వేధిస్తున్నారని ఆరోపిస్తూ శనివారం వీపనగండ్ల మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో రైతులు ఆందోళనకు దిగారు. కొల్లాపూర్ పెబ్బేరు ప్రధాన రహదారి పై వరి ధాన్యాన్ని పోసి నిప్పంటిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రాస్తారోకో నిర్వహించి తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసి రైస్ మిల్లులకు తరలించిన తర్వాత, మిల్లర్లు తాలు ఎక్కువగా ఉన్నాయని, తరుగు అధికంగా ఉందని వివిధ కారణాలు చూపిస్తూ ధాన్యాన్ని తిరస్కరిస్తున్నారని ఆరోపించారు. దీంతో తిరిగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను చేరుతుండటంతో రైతులు అదనపు రవాణా ఖర్చులు భరించాల్సి వస్తోందని వాపోయారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. రైతుల రాస్తారోకో కారణంగా కొల్లాపూర్ పెబ్బేర్ ప్రధాన రహదారి పై కొంత సేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ నరేష్ సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లామని హామీ ఇవ్వంతో రైతులు ఆందోళన విరమించారు.

## నిరుద్యోగ యువత పట్ల బిజెపి లాఠీలు ఝులిపిస్తోంది..

### దేశంలో నిరుద్యోగం అతిపెద్ద వ్యాధిగా మారింది : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** భారతదేశంలో నిరుద్యోగం అతిపెద్ద వ్యాధిగా మారిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. నిరుద్యోగ యువత పట్ల బిజెపి లాఠీలు ఝులిపిస్తున్నదని ఆయన ఆరోపించారు. ఉద్యోగ హక్కుల కోసం వీధుల్లోకి వచ్చిన బీహార్, ఉత్తరప్రదేశ్ యువతపై నిరుద్యోగం ప్రభావం చూపుతోందని, వారిని దారుణంగా కొడుతున్నారని ఆయన ఆరోపించారు. శుక్రవారం పాట్నాలో, ఉద్యోగ హక్కు కోసం శాంతియుతంగా నిరసన చేస్తున్న ఉపాధ్యాయ అభ్యర్థులను బీహార్ పోలీసులు మరోసారి దారుణంగా కొట్టారని, నిరుద్యోగ యువత పట్ల బిజెపి లాఠీలు ఝులిపిస్తుందని రాహుల్‌గాంధీ శనివారం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. పాట్నాలో ఉద్యోగాల కోసం నిరసన చేస్తున్న యువతను పోలీసులు కొడుతున్న వీడియోను లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు పంచుకున్నారు. 'నేడు భారతదేశంలో నిరుద్యోగం అతిపెద్ద వ్యాధి. దీని అత్యంత దారుణమైన ప్రభావం బీహార్, ఉత్తర ప్రదేశ్ యువతపై పడుతోంది. డిగ్రీలు, నైపుణ్యాలు చేతుల్లో ఉన్నప్పటికీ లక్షలాది మంది యువత ఇంటింటికీ తిరుగుతున్నారు. కానీ బిజెపి ప్రభుత్వం వారిని గానీ, మిమ్మల్ని గానీ పట్టించుకోదు. యువత తమ హక్కుల కోసం వీధుల్లోకి వచ్చినప్పుడు, వారికి ఉద్యోగాలు ఇవ్వరు; బదులుగా, వారి వీపులపై లాఠీల వర్షం కురిపిస్తారు' అని రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'భారత యువత బిజెపి అబద్ధాలతో విసిగిపోయారు, వారు ఇకపై మౌనంగా ఉండరు. ప్రతి మలుపులోనూ కాంగ్రెస్ వారికి అండగా నిలుస్తుంది' అని ఆ కాంగ్రెస్ నాయకుడు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పిబిఎస్‌సి టిఆర్ఇ 4.0 పరీక్ష తేదీని ప్రకటించడంలో జాప్యానికి నిరసనగా, ఉపాధ్యాయ ఉద్యోగార్థులు పెద్ద సంఖ్యలో శుక్రవారం పాట్నాలో ప్రదర్శన నిర్వహించారు. నిరసన చేస్తున్న అభ్యర్థులు పాట్నా కళాశాల నుంచి తమ యాత్రను ప్రారంభించి, డాక్ బంగ్లా చౌరాహే వైపు వెళ్తుండగా, గాంధీ మైదాన్ సమీపంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. పోలీసులు తమపై విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేశారని పలువురు నిరసనకారులు ఆరోపించారు. 46,000కు పైగా పోస్టులను భర్తీ చేసేందుకు నిర్వహించే బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ టీచర్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామ్ (టిఆర్ఇ) 4.0 తేదీని 2026 ఏప్రిల్‌లో ప్రకటించాల్సి ఉందని నిరసనకారులు తెలిపారు.

# మళ్లీ రోడ్డెక్కిన కశ్మీరీ పండిట్లు

### పునరావాస విధానం, కొత్త ఉపాధి ప్యాకేజీని ప్రకటించాలని డిమాండ్

**జమ్ము :** జమ్ముకశ్మీర్‌లో కశ్మీరీ పండితులు మరోమారు రోడ్డెక్కారు. నిర్వాసితులైన కశ్మీరీ పండితులు శనివారం జమ్ములో నిరసన ప్రదర్శన నిర్వహించారు. లోయలో తమ సామాజికవర్గానికి చెందిన వారి కోసం సమగ్ర పునరావాస విధానాన్ని రూపొందించి, అమలు చేయాలని, ప్రధానమంత్రి ప్రత్యేక ప్యాకేజీ కింద 15,000 మంది విద్యావంతులైన నిర్వాసిత యువతకు కొత్త ఉపాధి ప్యాకేజీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. తాము తిరిగి రావడం, పునరావాసం, ఉపాధి అవకాశాలు, సరైన రాజకీయ ప్రాతినిధ్యం వంటి తమ డిమాండ్లకు మద్దతుగా ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేస్తూ, యూత్ ఆల్ ఇండియా కశ్మీరీ సమాజ్ (వైఎఐకెఎస్) ఆధ్వర్యంలో నిరసనకారులు జమ్ములోని ప్రెస్ క్లబ్ వెలుపల సమావేశమయ్యారు. ఈ నిరసనకు వైఎఐకెఎస్ అధ్యక్షుడు ఆర్.కె. భట్ నాయకత్వం వహించారు. తమ చిరకాల డిమాండ్ల సాధన కోసం తమ సామాజికవర్గం మరోసారి వీధుల్లోకి వచ్చిందని ఆయన అన్నారు. దాదాపు 37 ఏళ్ల నిర్వాసిత జీవితం తర్వాత కశ్మీరీ పండితులు తమ 'మాతృభూమి'కి తిరిగి వచ్చేందుకు వీలు కల్పించాలని భట్ మోదీ నేతృత్వంలోని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికత కశ్మీరీ పండితులకు న్యాయం, సముచిత పునరావాసం కల్పించాలని మేము విశ్వసిస్తున్నాము. లోయలోని మొత్తం సామాజిక వర్గం కోసం ఒక సమగ్ర పునరాగమన, పునరావాస ప్యాకేజీని రూపొందించాలని ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాము' అని ఆయన విలేకరులతో అన్నారు. ప్రధానమంత్రి, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్రపాలిత ప్రాంత పరిపాలనపై తమకు విశ్వాసం ఉందన్నారు. కశ్మీరీ పండిట్ సామాజికవర్గం నేడు వీధుల్లోకి వచ్చిందని, 2010లో కశ్మీరీ పండిట్ యువతను కశ్మీర్ లోయకు తిరిగి రావడానికి ప్రేరేపించిన సంస్థ ఇదేనని, ఇప్పుడు కూడా ఆ ఉద్యమం మరో రూపంలో కొనసాగుతోందని భట్ చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు, వయోపరిమితి దాటిన ఆశావహులు, సహాయం పొందుతున్న వారికి నిబంధనలు, స్థానభ్రంశం సమయంలో కోల్పోయిన హక్కులు, జీవనోపాధుల పునరుద్ధరణతో కూడిన ఒక పక్కా పునరావాస ప్రతిపాదనను సమాజం ముందు ఉంచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. స్థానభ్రంశం చెందిన కుటుంబాలు గౌరవప్రదంగా, సామూహికంగా తిరిగి రావాలని పిలుపునిస్తూ, లోయలో కశ్మీరీ పండితులకు పునరావాసం కల్పించాలనే ఉద్దేశాన్ని ప్రతిబింబించేలా బలమైన తీర్మానాలను ఆమోదించాలని ఆయన అన్నారు. సరైన పరిహారం, మౌలిక సదుపాయాలు, ఉపాధి మద్దతు కల్పిస్తే సుమారు 15,000 మంది కశ్మీరీ పండిట్ యువకులు లోయకు తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్నారని భట్ అన్నారు. వివిధ కేసులలో స్థానభ్రంశం చెందిన పండిట్లకు అనుకూలంగా ఇచ్చిన కోర్టు తీర్పులను అమలు చేయాలని, తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్న బాధిత కుటుంబాలకు ఉపాధి కల్పించాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. తమ ఆందోళనలను తెలియజేయడానికి ఈ శాంతియుత నిరసన అని, రాబోయే రోజుల్లో ఇది ఒక పెద్ద ఉద్యమంగా మారవచ్చని హెచ్చరించారు. అయినప్పటికీ శాంతియుతంగానే కొనసాగుతుందని, స్థానభ్రంశం చెందిన ప్రతి ఒక్కరికీ కశ్మీర్‌లో పునరావాసం కల్పించాలన్నారు. ప్రధానమంత్రి ఉపాధి ప్యాకేజీ నిర్వాసిత, లోయలో ఉద్యోగాలు చేస్తున్న సుమారు 6,000 మంది కశ్మీరీ పండితులకు మాత్రమే పునరావాసం కల్పించారు, మిగిలిన స్థానభ్రంశం చెందిన జనాభా భవిష్యత్తుపై ప్రభుత్వాన్ని భట్ ప్రశ్నించారు. ఎస్‌ఎపిఎస్‌ఎ విషయంలో ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, స్థానభ్రంశం చెందిన సమాజం తమను తాము ఒకే సమూహంగా భావిస్తుందని, కశ్మీరీ పండితుల మధ్య ప్రత్యేక వర్గీకరణలు సృష్టించే ఏ ప్రయత్నాన్నైనా వ్యతిరేకిస్తామని భట్ అన్నారు. 'ప్రభుత్వం మమ్మల్ని వలసదారులుగా పేర్కొన్నప్పటికీ, మేము స్థానభ్రంశం చెందిన సమాజమే. కశ్మీరీ పండితులు గౌరవంగా తమ మాతృభూమికి తిరిగి వచ్చేవరకు, మా హోదాను పునర్నిర్వచించే హక్కు ఎవరికీ లేదు' అని ఆయన అన్నారు.




## 'ఎంజి నరేగా' రద్దుతో పని హక్కును లాగేసుకుంది!

### మోదీ సర్కార్‌పై ఖర్గే మండిపాటు



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎంజి నరేగా పథకాన్ని రద్దు చేయడం ద్వారా పని హక్కును పూర్తిగా నిర్మూలించిందని ఆరోపించారు. పేదల హక్కులను తుడిచి పెట్టేస్తోందని, పేదల పని హక్కును తొలగించే ప్రక్రియను బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక ప్రకారమే చేపట్టిందని ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంజి నరేగా పథకాన్ని పూర్తిగా అంతం చేయడానికి ముందే, మోదీ ప్రభుత్వం 'పని హక్కు'ను గొంతుకొసి చంపేసిందని, తద్వారా కోట్లాది మంది పేద ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని ఖర్గే ఎక్స్ పోస్టులో ఆరోపించారు. తాజా నివేదిక ప్రకారం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజి నరేగా) కింద పని పొందిన కుటుంబాల సంఖ్య 2025–26లో 44 లక్షలు తగ్గిందని, అలాగే ఉపాధి పొందిన కూలీల సంఖ్య 67 లక్షలు తగ్గిందని ఖర్గే పేర్కొన్నారు. పూర్తి 100 రోజుల ఉపాధిని పొందిన కుటుంబాల సంఖ్య 40.5 శాతం తగ్గిందని, అలాగే 'వ్యక్తిగత దినాల' సంఖ్యలో 21.5 శాతం తగ్గుదల నమోదైందని కూడా కాంగ్రెస్ అధినేత తెలిపారు. ఎంజి నరేగా పరిధిలోని ప్రతి కుటుంబం సగటున రూ. 1,221 ఆదాయ నష్టాన్ని చవిచూసిందని ఆయన అన్నారు. 'వీబీ – జి రామ్ జీ' పథకం ఇంకా పూర్తిగా అమలులోకి రాలేదు, దీంతో కూలీలు దిక్కుతోచని స్థితిలో ఇంటింటికీ తిరుగుతూ నిస్సహాయంగా మిగిలిపోయారని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు, బిజెపి ప్రభుత్వం రాష్ట్రాలకు చెల్లించాల్సిన కోట్లాది రూపాయల నిధులను నిలిపివేస్తోందని, మరోవైపు, వనరుల కొరతతో ఇప్పటికే సతమతమవుతున్న రాష్ట్రాలపై, కొత్త విధానం పేరుతో 40 శాతం అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోందని, అని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడైన ఖర్గే వ్యాఖ్యానించారు. ఎంపిక చేసిన కొద్దిమంది పెట్టుబడిదారులకు మిత్రురాలిగా వ్యవహరించే బిజెపి ప్రభుత్వం, పేదల హక్కులను తుడిచిపెట్టేయడానికి కుట్రలు చేస్తోందని, పేదల పట్ల ఆ ప్రభుత్వానికి ఉన్న అసలైన విధానాన్ని, ఉద్దేశాన్ని ఈ చర్యలే స్పష్టంగా బయటపెడుతున్నాయని ఖర్గే ఆరోపించారు.

## కేరళ సిఎంపై 24 గంటల్లో నిర్ణయం

### కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె. మురళీధరన్

**తిరువనంతపురం/న్యూఢిల్లీ :** కేరళలో యుడిఎఫ్ విజయం సాధించినా, ఇంకా సిఎం అభ్యర్థి ఎవరూ అనే దానిపై సందిగ్ధత కొనసాగుతోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి పదవి కోసం పోటీపడుతున్న ముగ్గురు ప్రధాన అభ్యర్థుల మద్దతుదారులు లాబీయింగ్, బహిరంగ ప్రచారాలను ముమ్మరం చేశారు. అయితే ఈ విషయంపై పార్టీ అధిష్టానం 24 గంటల్లోగా తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె. మురళీధరన్ శనివారం తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ సాధించిన ఘన విజయం పార్టీలో తీవ్రమైన లాబీయింగ్‌కు తెరలేపింది. సీనియర్ నాయకులు వి.డి. సతీశన్, రమేష్ చెన్నితాల, కె.సి. వేణుగోపాల్‌లకు మద్దతుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీ బోర్డుల ప్రచారాలు, పోస్టర్ల యుద్ధాలు, నిరసన ప్రదర్శనలు వెల్లువెత్తాయి. 'ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపికపై చర్చలు 24 గంటల్లోగా పూర్తవుతాయని ఢిల్లీ నుండి సమాచారం అందింది' అని మురళీధరన్ తిరువనంతపురంలో విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. అయితే, కేవలం ఫ్లెక్సీ బోర్డులు, బహిరంగ నిరసన ప్రదర్శనలు మాత్రమే నాయకత్వ సమస్యను నిర్ణయించలేవని ఈ సీనియర్ నాయకుడు స్పష్టం చేశారు. 'అధిష్టాన ప్రతినిధులతో నేను ఏం చెప్పానో బహిరంగంగా వెల్లడించను. నా నియోజకవర్గ ప్రజల మనోభావాలను నేను వారికి తెలియజేశాను. ప్రజలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను వారికి స్పష్టంగా తెలియజేశాను' అని ఆయన అన్నారు. సరైన సమయంలో నిర్ణయం వెలువడుతుందని, ముఖ్యమంత్రిని ఎంపిక చేసేటప్పుడు సీనియారిటీ ఒక్కటే ఏకైక ప్రమాణం కాదని, పార్టీ ఎప్పుడూ ఆ ప్రమాణాన్ని మాత్రమే అనుసరించలేదని మురళీధరన్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకత్వం వీలైనంత త్వరగా తుది నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని కెపిసిసి అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. అయితే ముఖ్యమంత్రి అభ్యర్థిత్వం విషయంలో బహిరంగ నిరసన ప్రదర్శనలు, ఫ్లెక్సీ బోర్డుల ప్రచారాలకు దూరంగా ఉండాలని ఆయన పార్టీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పి.జె. కురియన్, కల్పేట ఎమ్మెల్యే టి. సిద్ధిక్ కూడా కొనసాగుతున్న నిరసనలు, ఫ్లెక్సీ బోర్డుల ప్రచారాలు, వివిధ నాయకుల మద్దతుదారుల మధ్య బహిరంగ వాగ్వాదాలపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో, ముఖ్యమంత్రి పదవికి వివిధ అభ్యర్థులకు మద్దతుగా కేరళ వ్యాప్తంగా ప్రజా ప్రచారాలు కొనసాగుతున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.



## ఆప్ నేతలను బిజెపి భయపెడుతోంది

### ఇడిని దుర్వినియోగం చేస్తోంది : మోదీపై కేజ్రీవాల్ ఫైర్



**న్యూఢిల్లీ :** పంజాబ్ పరిశ్రమల శాఖ మంత్రి సంజీవ్ అరోరాపై ఇడి దాడులు జరపడంతో ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విమర్శలు గుప్పించారు. తమ పార్టీ నాయకులను భయపెట్టి బిజెపిలో చేర్చుకునేందుకు ఇడిని దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. కొత్తగా నమోదైన ఒక మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా, అరోరా, ఆయనతో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మరికొందరి ఇళ్లలో శనివారం ఉదయం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తాజా సోదాలు నిర్వహించిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కేజ్రీవాల్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఇడి, సిబిఐలు మనీలాండరింగ్, అవినీతి కేసులపై పనిచేయాల్సి ఉన్నప్పటికీ, 'మోదీ పాలనలో ఇవి ప్రతిపక్ష నాయకులను బెదిరించి, భయపెట్టి, పార్టీ నుండి విడగొట్టి, బిజెపిలో చేరేలా బలవంతం చేయడానికి పనిచేస్తున్నాయి. అరోరాపై జరిగిన దాడి కూడా అదే దిశలో ఒక చర్య' అని అన్నారు. ఒక నెలలోనే అరోరాపై ఇడి దాడులు జరపడం ఇది రెండోసారి అని, అసలు ఇడి దేని కోసం వెతుకుతోందోనని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'బెంగాల్ ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీజీ పంజాబ్‌లో ఇడి రోజువారీ దాడులను ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా మోదీజీ పంజాబ్‌ను బలవంతం చేసి, పంజాబీలను వివిధ మార్గాల ద్వారా వేధించారు' అని కేజ్రీవాల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. మోదీని మొఘల్ చక్రవర్తి ఔరంగజేబుతో పోల్చారు. ఔరంగజేబులాగే, 'మోదీజీ దేశంలోని వివిధ ప్రాంతాలను అక్రమంగా ఆక్రమించుకుని, ఇప్పుడు పంజాబ్‌కు చేరుకున్నారు... సిక్కు గురువుల త్యాగాల నుండి స్ఫూర్తి పొందిన పంజాబ్, మోదీజీ హింసను ఎదుర్కొని యావత్ దేశాన్ని దాని నుండి కాపాడుతుంది' అని కేజ్రీవాల్ అన్నారు.పంజాబ్ నీటి హక్కులను నీరుగార్చడానికి, పంజాబ్ విశ్వవిద్యాలయాన్ని లాక్కోవడానికి ప్రయత్నాలు జరిగాయని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి ఆరోపించారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధికి కేటాయించిన నిధులను కూడా నిలిపివేశారని ఆయన ఆరోపించారు. తన నివాసంలో ఇడి దాడులు జరిపిన తర్వాత ఆప్ రాజ్యసభ ఎంపి అశోక్ మిట్టల్ బిజెపిలో చేరారని కేజ్రీవాల్ అన్నారు. అరోరా నివాసంలో కూడా దాడులు జరిగాయి, కానీ ఆయన బిజెపిలో చేరలేదు; అందుకే మరో దాడి నిర్వహించామని ఆయన ఆరోపించారు. కొన్ని సంవత్సరాల క్రితం ప్రధానమంత్రి పంజాబ్ రైతులకు సవాలు విసిరి, తలవంచాల్సి వచ్చిందని కేజ్రీవాల్ అన్నారు. ఆయన ఇప్పుడు పంజాబ్ మొత్తానికే సవాలు విసిరారు అని ఆయన జోడించారు.

## పంజాబ్ మంత్రి అరోరా అరెస్టు



**చండీగఢ్:** వంద కోట్ల రూపాయల విలువైన మనీలాండరింగ్ ఆరోపణల కేసులో పంజాబ్ మంత్రి సంజీవ్ అరోరాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం అరెస్టు చేసింది. చండీగఢ్‌లోని సెక్టార్ 2లో ముఖ్యమంత్రి నివాసం సమీపంలో ఉన్న ఆయన అధికారిక నివాసంలో కొనసాగుతున్న సోదాల సందర్భంగా ఆయనను అరెస్టు చేశారు. అరోరా, ఆయన కంపెనీకి సంబంధించిన ఢిల్లీ, గురుగ్రామ్, చండీగఢ్‌లోని ఐదు ప్రాంగణాలలో ఈడీ సోదాలు నిర్వహించింది. అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి చెందిన నాయకులు, వ్యక్తులపై కేంద్ర దర్యాప్తు సంస్థ పంజాబ్‌లో వరుసగా సోదాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో తాజాగా ఈ చర్య చోటుచేసుకుంది. నకిలీ జీఎస్టీ లావాదేవీలు, ఎగుమతులకు సంబంధించిన మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా హాంప్టన్ స్కై రియల్టీ లిమిటెడ్ కార్యాలయ ప్రాంగణంలో, అరోరా నివాసంలో సోదాలు నిర్వహించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. కాగా విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం కింద అరోరాపై ఈడీ నమోదు చేసిన కేసు నుంచే ఈ మనీలాండరింగ్ కేసు కూడా మొదలైందని, ఈ కేసుకు సంబంధించి గత నెలలో లుధియానాలోని అరోరా నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించిందని దర్యాప్తు సంస్థ వర్గాలు తెలిపాయి. గత నెలలో స్వాధీనం చేసుకున్న పత్రాల ప్రకారం, అరోరా తన కంపెనీ ద్వారా రూ.100 కోట్లకు పైగా విలువైన నకిలీ మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసినట్లు తేలిందని తెలిపాయి. అక్రమ నిధులను లాండరింగ్ చేసేందుకు, అరోరా ఎగుమతుల ముసుగులో దుబాయ్ నుంచి భారతదేశానికి రౌండ్‌ట్రిప్పింగ్ పద్ధతిలో నిధులను తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 'గత నెల దాడుల సందర్భంగా అనేక నకిలీ జీఎస్‌టీ కొనుగోలు బిల్లుల వంటి నేరారోపణ వివరాలు లభించాయి. నకిలీ ఐటీసీ, జీఎస్టీ ఎగుమతి రుణాలపై రీఫండ్‌లు, డ్యూటీ డ్రాబ్యాక్‌లను క్లెయిమ్ చేసుకోవడానికి ఢిల్లీలో ఉనికి లేని సంస్థల నుంచి ఈ బిల్లులను పొందారు' అని ఈడీ అధికారి ఒకరు తెలిపారు.

## బిజెపికి వ్యతిరేకంగా ఏకమవుదాం

### ప్రతిపక్ష పార్టీలకు మమతా బెనర్జీ పిలుపు



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా అధికారంలోకి వచ్చిన బిజెపిని ఎదుర్కోవడానికి, రాష్ట్రంలోని అన్ని ప్రతిపక్ష పార్టీలు ఏకమై ఒక 'ఉమ్మడి వేదిక'ను ఏర్పాటు చేయాలని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. బిజెపిని వ్యతిరేకించే వివిధ అనుబంధ విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు (ఎన్‌జిఒలు) కూడా కాషాయ కూటమికి వ్యతిరేకంగా ఏకం కావాలని మాజీ ముఖ్యమంత్రి కోరారు. 'వామపక్షాలుసహా అన్ని ప్రతిపక్ష పార్టీలు బిజెపికి వ్యతిరేకంగా ఒక ఉమ్మడి వేదికను ఏర్పాటు చేయడానికి ఏకం కావాలని పిలుపునిస్తున్నాను' అని బెనర్జీ అన్నారు. జాతీయ పార్టీలు కూడా ఇందులో చేరాలని ఆమె కోరారు. ఈ విషయంలో ఏ రాజకీయ పార్టీ అయినా తనతో చర్చలు జరపాలనుకుంటే, తాను వారితో మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నానని టిఎంసి అధినేత్రి తెలిపారు. రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా తన కాళీఘాట్ నివాసం ఎదుట జరిగిన ఒక చిన్న సభను ఉద్దేశించి మాట్లాడుతూ 'శత్రువు శత్రువు మిత్రుడు అని ఆలోచించే సమయం ఇది కాదు; మనకు మొదటి శత్రువు బిజెపినే' అని ఆమె వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత, రాష్ట్రవ్యాప్తంగా టిఎంసి కార్యకర్తలు, మద్దతుదారులపై దారుణాలు జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. 'కొన్ని చోట్ల గూండాయిజం చెలరేగుతోంది; వారి (బిజెపి) శ్రేణుల్లోకి దుష్ట శక్తులు చొరబడ్డాయి' అని బెనర్జీ అన్నారు. 2011లో తాను అధికారంలోకి వచ్చిన తర్వాత, ఎవరిపైనా దారుణాలు జరగకుండా చూసుకున్నానని మాజీ ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని 294 స్థానాల అసెంబ్లీలో 207 స్థానాలను గెలుచుకోవడం ద్వారా బిజెపి ఘన విజయం సాధించి, రాష్ట్రంలో తన మొదటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది; అదే సమయంలో టిఎంసి 80 స్థానాలను దక్కించుకుంది.

# 'ఉపాధి'కి విబి జి రాంజి దెబ్బ

### చట్టం అమలు తర్వాత తగ్గిన పని దినాలు

### మోదీ సర్కార్ సృష్టించిన సంక్షోభం

**న్యూఢిల్లీ:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేదల బతుకుల్లో దుమ్ముకొట్టింది. ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసింది. కేంద్రం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏను రద్దు చేసి... దాని స్థానంలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) (వీబీజీ రామ్ జీ) చట్టాన్ని తీసుకువచ్చింది. దీనివల్ల ఉపాధి కల్పన తీవ్రంగా క్షీణించింది. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి 100 రోజుల వరకు నైపుణ్యం లేని పని అందిస్తుంది. ప్రైవేట్ పరిశోధనా సంస్థ లిబ్‌టెక్ ఇండియా '2025–26 ఆర్థిక సంవత్సరం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కింద తగ్గుతున్న ఉపాధి, ఆదాయాలు' అనే అంశంపై నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కింద సృష్టించబడిన పని దినాలు 2023–24లో 312 కోట్ల నుంచి 2024–25లో 268 కోట్లకు, 2026–27లో 211 కోట్లకు తగ్గాయి. ప్రతి కుటుంబానికి సగటు పని దినాల సంఖ్య 2024–25లో 50.18 నుంచి 2025–26 నాటికి 42.92కు గణనీయంగా తగ్గింది. 2024–25లో 0.37 కోట్ల కుటుంబాలు 100 రోజుల పనిని పూర్తి చేయగా, 2025–26 నాటికి అటువంటి కుటుంబాల సంఖ్య 0.22 కోట్లకు పడిపోయింది. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కుటుంబాల సంఖ్య 2024–25లో 14.98 కోట్ల నుంచి 2025–26 నాటికి 15.46 కోట్లకు పెరిగింది. ఈ పథకంపై ఎక్కువ కుటుంబాలు ఆసక్తి చూపినప్పటికీ ఉపాధి అవకాశాలు తగ్గాయి. 2024–25తో పోలిస్తే 2025–26లో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కింద దాదాపు 44 లక్షల తక్కువ కుటుంబాలు, 67 లక్షల తక్కువ కార్మికులు ఉపాధి పొందారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కింద ఉపాధి కల్పన విషయంలో 2025–26 అత్యంత కష్టతరమైన సంవత్సరాలలో ఒకటిగా నిలిచే అవకాశం ఉందని లిబ్‌టెక్ ఇండియా పరిశోధకుడు ముక్కెర రాహుల్ అన్నారు. 'ప్రభుత్వం సంస్కరణలు, అవినీతి నిర్మూలన పేరిట అనేక చర్యలు చేపట్టినప్పటికీ, ఇటీవలి సంవత్సరాలలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కింద కేటాయింపులు స్తంభించిపోవడాన్ని మనం చూస్తున్నాం. ఆన్‌లైన్ హాజరు వ్యవస్థ, ఈకేవైసీ రిజిస్ట్రేషన్, ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ (ఏబీపీఎస్) వంటివి కార్మికులకు సవాళ్లు సృష్టించాయి. నిధుల కొరత, సాంకేతిక జోక్యాలు అనే ఈ రెండు అంశాలు ఉపాధి పథకం కింద ఉపాధి కల్పనలో తీవ్ర క్షీణతకు దోహదపడి ఉండవచ్చు' అని రాహుల్ అన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఏ మొబైల్ పర్యవేక్షణ వ్యవస్థ (ఎన్‌ఎంఎంఎస్) కింద, పంచాయతీ స్థాయి అధికారులు కార్మికుల ఫోటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. గతంలో గ్రామ పంచాయతీలు హాజరును కాగితంపై నమోదు చేసేవి. కానీ జనవరి 2023 నుంచి దీనిని నిలిపివేశారు. ఫిబ్రవరి 2023 నుంచి వేతన చెల్లింపుల కోసం ఏబీపీఎస్‌ను ఉపయోగించాలని గ్రామీణాభివద్ధి మంత్రిత్వ శాఖ రాష్ట్రాలను ఆదేశించింది. ఏబీపీఎస్ కోసం ఒక కార్మికుడి ఆధార్‌ను అతని జాబ్ కార్డ్, బ్యాంక్ ఖాతా, బ్యాంకు సంస్థాగత గుర్తింపు సంఖ్యతో నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సృష్టించిన డేటాబేస్‌లో అనుసంధానించాల్సి ఉంటుంది. నవంబరు 2025 నుంచి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కార్మికులు పని పొందడానికి వీలుగా ప్రభుత్వం ఈకేవైసీ తప్పనిసరి చేసింది. ఈకేవైసీ అనేది ముఖం, కనుపాప గుర్తింపు ద్వారా జరుగుతుంది. ఇది ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో ఒక భాగంగా ఉంది. మే 2026 నాటికి 25 కోట్ల మంది కార్మికులలో 45.4 శాతం మంది దాదాపు 10 కోట్ల మంది క్రియాశీలక కార్మికులలో 9.5 శాతం మంది ఈకేవైసీ పూర్తి చేయలేదని నివేదిక కనుగొంది. సాంకేతిక చర్యలను పాటించడం కార్మికులకు కష్టంగా ఉందని రాహుల్ అన్నారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కింద ఉన్న మొత్తం కార్మికులలో 45.4 శాతం మంది క్రియాశీలక కార్మికులలో 9.5 శాతం మంది ఈకేవైసీ పూర్తి చేయలేదని లిబ్‌టెక్ నివేదిక కనుగొంది.



## వారు బాధితుడి ఆస్తిని వారసత్వంగా పొందలేడు

### మరొక వ్యక్తి హత్యకు పాల్పడిన లేదా హత్యకు ప్రేరేపించిన వ్యక్తి



**న్యూఢిల్లీ :** మరొక వ్యక్తి హత్యకు పాల్పడిన లేదా హత్యకు ప్రేరేపించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి బాధితుని ఆస్తిని వారసత్వంగా పొందలేరని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. జస్టిస్‌లు జె.బి.పార్దీవాలా, ఆర్.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ సందర్భంగా స్పందిస్తూ ఈ ఆస్తి అనర్హత వీలునామాలేని, వీలునామా ద్వారా సంక్రమించే వారసత్వం రెండింటికీ వర్తిస్తుందని పేర్కొంది. విచారణ ఇంకా కొనసాగుతున్నప్పటికీ ఈ నిబంధన వర్తిస్తుందని తెలిపింది. వారసత్వానికి సంబంధించిన వ్యక్తిగత చట్ట నియమాల ప్రకారం..వీలునామా లేని వారసత్వం జరుగుతుంది, అయితే వీలునామా ద్వారా ఆస్తిని బహుకరించినప్పుడు వీలునామా వారసత్వం వర్తిస్తుంది. 'వారసత్వంగా హక్కులు కోరుతున్న వ్యక్తి హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి, హిందూ వారసత్వ చట్టంలోని సెక్షన్ 25 ప్రకారం మాత్రమే కాకుండా న్యాయం, నిష్పక్షపాతం సమానత్వం వంటి సూత్రాలు, నేరం జరిగినట్లు అధిక సంభావ్యతలు సూచిస్తున్నట్లయితే తన హక్కులను వినియోగించుకోవడానికి అతడు అనర్హుడు' అని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. హిందూ వారసత్వ చట్టంలోని సెక్షన్ 25ను ప్రస్తావిస్తూ, హత్య చేసిన లేదా ఆ హత్య జరగడానికి ప్రేరేపించిన వ్యక్తి మృతుడి ఆస్తిని వారసత్వంగా పొందకుండా ఈ నిబంధన అతడిని అనర్హుడిగా చేస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆస్తి వారసత్వానికి సంబంధించి బెంగళూరు సివిల్ కోర్టు ఇచ్చిన తీర్పును రద్దుచేసిన కర్ణాటక హైకోర్టు ఉత్తర్వును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది.

# ఇది కృత్రిమ సంక్షోభం

### తమిళనాడు ప్రభుత్వ ఏర్పాటులో గవర్నరు తీరు సరికాదు

### భారత మాజీ అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గి

**న్యూఢిల్లీ:** తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై గవర్నరు తీరును న్యాయనిపుణులు తప్పుపట్టారు. గవర్నరు వైఖరిని సీనియర్ అడ్వకేట్, భారత మాజీ అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గి, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, ఇతర న్యాయకోవిదులు ఎండగట్టారు. ప్రభుత్వం ఏర్పాటు విషయంలో తమిళనాడులో కొనసాగుతున్న ప్రతిష్టంభనను 'కృత్రిమ సంక్షోభం'గా ముకుల్ రోహత్గి అభివర్ణించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా టీవీకే అధినేత విజయ్‌ను గవర్నర్ ఆహ్వానించి ఉండాల్సిందని అన్నారు. తమిళనాడులోని రాజకీయ పరిస్థితిపై ఆయన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... ఇది రాజ్యాంగ సంక్షోభం పరిస్థితి కాదని, కృత్రిమ సంక్షోభమని చెప్పారు. మెజారిటీ మార్క్‌ను టీవీకే సాధించనప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా ఫలితాలు వెలువడిన మొదటిరోజునే విజయ్‌ను గవర్నర్ కోరాల్సిందని రోహత్గి అభిప్రాయం వ్యక్తం చేశారు. 'మ్యాజిక్ నంబర్‌ను ఆయన సాధించి ఉండకపోవచ్చు. అదేమంత విషయం కాదు. రాజ్యాంగ సంప్రదాయాల ప్రకారం అతిపెద్ద పార్టీ నేతను ఆహ్వానించవచ్చు. ఒకటి, రెండు వారాల్లో మద్దతు కూడగట్టుకుని స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించవచ్చు. సభలో మెజారిటీ నిరూపించుకునే అవకాశం కల్పించవచ్చు. సంఖ్యాబలం తక్కువగా ఉన్నా తగినంత బలం కూడగట్టుకుని ప్రభుత్వం కొనసాగించిన దాఖలాలు గతంలో కూడా ఉన్నాయి' అని రోహత్గీ చెప్పారు. విశ్వాస పరీక్ష సమయంలో ఇతర పార్టీలు గైర్హాజరైతే మైనారిటీ ప్రభుత్వం మనుగడ సాగిస్తుందని మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గతంలో చెప్పిన విషయాన్ని రోహత్గి ప్రస్తావించారు. 'మెజారిటీ మార్క్ 118 కావచ్చు, మరొకటి కావచ్చు. సంఖ్యాబలం చూపించమని పట్టుబట్టడం ద్వారా గవర్నర్ రాజ్యాంగ సంక్షోభాన్ని సృష్టిస్తుండటమే ఇప్పుడున్న అసలు సమస్య. ఇది పూర్తిగా తప్పు. బల నిరూపణ అసెంబ్లీలోనే కానీ, లోక్‌భవన్‌లో కాదు' అని రోహత్గి స్పష్టం చేశారు. అతి పెద్ద ఎన్నికల ప్రక్రియ అనంతరం కూడా మళ్లీ ఎన్నికలు జరపడం, రాష్ట్రపతి పాలన విధించడం ఎంతమాత్రం సరికాదని రోహత్గి అన్నారు. ఎన్నికల కోసం వేలాది కోట్ల రూపాయలు ఖర్చయ్యాయని, ఎంతో సిబ్బంది, ఎన్నో గంటలు వెచ్చించారని చెప్పారు. ఒక వ్యక్తికి 108 లేదా 110 సీట్లు వచ్చాయంటూ ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వకపోవడం ఎప్పుడూ జరగలేదని అన్నారు.



# మా యుద్ధ లక్ష్యాలు న్యాయమైనవే



నాటో మద్దతిచ్చే దురాక్రమణ దళంతో పోరాడుతున్నాం

'విక్టరీ డే' వేడుకల్లో పుతిన్ సాదాసీదాగా సాగిన పరేడ్

తొలిసారి ప్రదర్శనలో లేని క్షిపణులు, సాయుధ వాహనాలు

**మాస్కో:** ఉక్రెయిన్‌లో నాటో మద్దతున్న దురాక్రమణ దళంతో తమ సైన్యం పోరాడుతోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. తాను నిర్దేశించుకున్న యుద్ధ లక్ష్యాలు న్యాయమైనవని సమర్థించుకున్నారు. పుతిన్ శనివారం రెడ్ స్క్వేర్‌లో విక్టరీ డే పరేడ్‌నుద్దేశించి ప్రసంగించారు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని సమర్థించుకుంటూ, నాటోను దుయ్యబట్టారు. వేడుకలకు అతిథులుగా హాజరైన ప్రపంచ దేశాల నాయకులు కొందరితో పాటు వందల మంది సైన్యాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నాజీ జర్మనీపై సోవియట్ యూనియన్ విజయానికి చిహ్నంగా ఏటా విక్టరీ డేను రష్యా జరుపుకుంటోంది. యుద్ధం క్రమంలో ఈసారి వేడుకలు కాస్తంత సాదాసీదాగా సాగాయి. విక్టరీ డే నేపథ్యంలో మూడు రోజుల పాటు కాల్పుల విరమణకు రష్యా, ఉక్రెయిన్ అంగీకరించాయి. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. ఈసారి విక్టరీ డే పరేడ్‌లో బాలిస్టిక్ క్షిపణులు/ సాయుధ వాహనాలు పాల్గొనలేదు. ఇలా చాలా ఏళ్ల తర్వాత మొదటిసారి జరిగింది. కట్టుదిట్టమైన భద్రత నడుమ రెడ్‌స్క్వేర్ వద్ద పరేడ్ జరిగింది. రెండవ ప్రపంచ యుద్ధంలో అమరులైన సోవియట్ సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ పుతిన్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. నాటి తరం సాధించిన గొప్ప విజయాలే స్ఫూర్తిగా నేటి ప్రత్యేక సైనిక చర్యల లక్ష్యాల సాధన దిశగా సైనికులు ముందుకెళుతున్నారని ఉక్రెయిన్ యుద్ధాన్ని ఉద్దేశించి అన్నారు. నాటో మద్దతున్న సాయుధ దళాన్ని తమ సైన్యం ఎదుర్కొంటోందని, తమ సైన్యం విరోచితంగా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. యుద్ధం వేళ కార్మికుల తోడ్పాటు, శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు, సైనిక కర్మాగారాలు, వైద్యులు, టీచర్ల సేవలను కొనియాడారు. సైనిక వ్యూహాలు ఏ విధంగా మారినాగానీ దేశ భవిష్యత్ ప్రజల చేత, ప్రజల కొరకు అందించబడుతోందని పుతిన్ వక్కాణించారు. విక్టరీ డే ప్రసంగం ముగిసిన వెంటనే ఫిరంగుల పేలుళ్లు.... ఆపై మిలటరీ బ్రాస్ బాండ్ దేశభక్తి గీతాలాపన సాగించింది. వేడుకల్లో లావోస్ అధ్యక్షుడు తోంగ్లూన్ సిసౌలిత్, మలేసియా సుల్తాన్ ఇబ్రహీం, కజకిస్తాన్ అధ్యక్షుడు ఖాసీం జోమర్ట్ తొకాయేవ్, ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షావ్‌కత్ మిర్జియోయేవ్, స్లోవేకియా ప్రధాని రాబర్ట్ ఫికో, బెలారసియన్ నాయకులు అలెగ్జాండర్ లుకాషెన్కో తదితరులు పాల్గొన్నారు. గతేడాది 80వ వార్షికోత్సవం సందర్భంగా చైనా, బ్రెజిల్ అధ్యక్షులు జిన్‌పింగ్, లులా డ సిల్వా సహా 27 మంది అతిథులు పాల్గొన్నారు. పరేడ్‌లో ఉత్తర కొరియా సైనికులు కూడా భాగస్వాములయ్యారు.

**ఉక్రెయిన్ రష్యా మధ్య మూడు రోజుల కాల్పుల విరమణ: ట్రంప్:** రష్యా ఉక్రెయిన్ మధ్య మూడు రోజుల కాల్పుల విరమణ, ఖైదీల మార్పిడికి అంగీకారం కుదిరింది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. 9,10,11 తేదీల్లో కాల్పుల విరమణ అమల్లో ఉంటుందని వెల్లడించారు. యుద్ధం ముగింపునకు ఇది ఆరంభ సూచికగా పేర్కొన్నారు. తన అభ్యర్థన మేరకు రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.వెయ్యి మంది చొప్పున ఖైదీలను ఈ దేశాలు పరస్పరం బదిలీ చేసుకుంటాయని తెలిపారు. 'రెండో ప్రపంచయుద్ధంలో నాజీలపై విజయానికి ప్రతీకగా రష్యా ఈ విక్టరీడే నిర్వహిస్తోంది. ఉక్రెయిన్‌కు కూడా ఇది విక్టరీ డేనే. రెండు దేశాల మధ్య యుద్ధం ముగింపునకు చర్చలు సాగుతున్నాయి. త్వరలోనే సత్ఫలితం రావొచ్చు' అని ట్రూత్ సోషల్‌లో ట్రంప్ వెల్లడించారు. రష్యా విక్టరీడే సందర్భంగా ఈ నిర్ణయం తీసుకోవడం శాంతి దిశగా ఓ తొలి అడుగు కావాలని ఆకాంక్షించారు. శని,ఆది, సోమవారాల్లో అన్ని సైనిక చర్యలను నిలిపివేయాలని ఒప్పందం జరిగినట్లు వెల్లడించారు.

# ఇరాన్ – అమెరికా మధ్య కాల్పుల్లో చిక్కుకున్న నౌక

భారతీయ నావికుడు మృతి

మరో 17 మంది సిబ్బంది సురక్షితం



**దుబాయ్:** పశ్చిమాసియాలో యుద్ధం ఓ భారతీయ నావికుడి ప్రాణాలు తీసింది. దుబాయ్ నుంచి యెమెన్‌కు సరుకుతో వెళుతున్న కార్గో నౌక ఒకటి హోర్ముజ్ జలసంధి వద్ద ఇరాన్, అమెరికా నౌకాదళాల మధ్య కాల్పుల్లో చిక్కుకుంది. ఈ ఘటనలో ఇంజిన్ రూమ్‌లో ఉన్న భారతీయ సిబ్బంది ఒకరు మరణించారు. గుజరాత్‌లోని దేవభూమి ద్వారకా జిల్లా జామ్ సలాయా పట్టణానికి చెందిన అల్తాఫ్ తలాబ్ కేర్ అనే నావికుడు 'అల్ ఫైజ్ నూర్ సులేమాని' అనే నౌకలో ఇంజిన్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఈనెల 7న దుబాయ్ పోర్ట్ నుంచి యెమెన్‌లోని ముకల్లా రేవుకు బయలుదేరిన నౌకలో మొత్తం 18 మంది సిబ్బంది ఉన్నారు. 8వ తేదీ అర్ధరాత్రి ఒంటి గంటప్పుడు హోర్ముజ్ జలసంధిని దాటే సమయంలో అమెరికా, ఇరాన్ దళాల మధ్య భీకర కాల్పులు మొదలయ్యాయి. తూటాలు నేరుగా ఇంజిన్ రూమ్ వైపు దూసుకురావడంతో అక్కడ పని చేస్తున్న అల్తాఫ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కాల్పుల ధాటికి నౌక తీవ్రంగా దెబ్బతిన్నది. మునిగిపోసాగింది. అయితే వెళుతున్న 'ప్రేమ్ సాగర్1' అనే మరో నౌక సిబ్బంది దీనిని గుర్తించి, సహాయక చర్యలు చేపట్టారు. అల్తాఫ్ మినహా 17 మంది భారతీయ సిబ్బందిని కాపాడారు. 8వ తేదీ సాయంత్రానికి వీరంతా దుబాయ్ పోర్టుకు సురక్షితంగా చేరుకున్నారు. ఈ ఘటనపై దుబాయ్‌లోని భారత కాన్సులేట్ జనరల్ విచారం వ్యక్తం చేసింది. భారతీయ సిబ్బంది మరణానికి దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. నౌక యజమానితో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. మృతుడి కుటుంబానికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించింది. గుజరాత్ సెయిలింగ్ వెసెల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆదమ్ భాయ్ ఈ ఘటనపై స్పందిస్తూ నావికుడి మరణం బాధాకరమని, ఆయన మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలని కోరారు. అల్తాఫ్ మృతి వార్తతో ఆయన స్వగ్రామమైన సలాయా గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

# వేల్స్‌లో లేబర్ పార్టీ ఓటమి

27 ఏళ్లలో మొదటిసారి అధికారానికి దూరం



**లండన్:** వేల్స్‌లో బ్రిటన్ లేబర్ పార్టీ అధికారాన్ని కోల్పోయింది. 1999లో అధికారం చేపట్టిన తర్వాత వేల్స్‌లో ఈ పార్టీ ఓటమిని చవిచూడటం ఇదే మొదటిసారి. స్థానిక ఎన్నికల్లో నేషనలిస్ట్ పార్టీ ప్లయిడ్ సైమ్రూ అధిక సీట్లు గెలుచుకుంది. 93కుగాను 43 స్థానాలు కైవసం చేసుకున్నది. యాంటీ ఇమిగ్రేషన్ పార్టీ రిఫార్మ్ యూకే 34 స్థానాలతో రెండవ స్థానంలో నిలిచింది. కేవలం తొమ్మిది స్థానాలతో లేబర్ పార్టీ వెనుకబడింది. ప్లయిడ్ సైమ్రూ నాయకుడు రూన్ ఆప్ లోర్వెత్ మాట్లాడుతూ నాయకత్వం మార్పును వేల్స్ ప్రజలు కోరుకున్నారని, అందుకే తమ పార్టీకి పట్టం కట్టారని అన్నారు.

**ఓటర్ల మాట వింటాం: కీర్ స్టార్మర్**

స్థానిక ఎన్నికల్లో లేబర్ పార్టీ చారిత్రక ఓటమి అనంతరం ఓటర్ల మాట వింటామంటూ బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ శనివారం హామీనిచ్చారు. ఓటర్ల మాట వినడమే నిజమైన పాఠమని అన్నారు. అలాగని రైట్ లేదా లెఫ్ట్ వైపు మొగ్గు చూపుతామని అర్థం కాదని చెప్పారు. ప్రాంతీయ ఎన్నికల్లో ఓటమి క్రమంలో స్టార్మర్ రాజీనామాకు డిమాండ్ వినిపించింది. కాగా, ఇంగ్లాండ్, స్కాట్లాండ్, వేల్స్‌లో రిఫార్మ్ యూకే పార్టీ పుంజుకుంది. ఈ ఎన్నికల్లో స్కాటిష్, వెల్ష్ పార్టీలు అధిక స్థానాలు దక్కించుకున్నాయి. 27 ఏళ్ల కిందట కార్డిఫ్‌లో పార్లమెంటు ఏర్పాటు అయినప్పటి నుంచి వేల్స్‌లో అధికారన్ని లేబర్ పార్టీ కోల్పోలేదు. తొలి సారి అక్కడ ఓటమిని చవిచూసింది.

# విపత్కర పరిస్థితులు తప్పవు: ఇరాన్



**టెహ్రాన్/వాషింగ్టన్:** కీలక సముద్ర రవాణా మార్గం హోర్ముజ్ జలసంధిపై పట్టు కోసం ఇరాన్‌ను అమెరికా ఎదిరిస్తోంది. సైనిక చర్యలకు దిగుతోంది. ఇదే క్రమంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించిందని ఇరాన్ ఆరోపించింది. పర్షియన్ గల్ఫ్, హోర్ముజ్‌లో అమెరికా తన సైనిక కార్యకలాపాలు కొనసాగిస్తే విపత్కర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. యుద్ధం ముగించేందుకు తమ ప్రతిపాదనలపై ఇరాన్ స్పందన త్వరలో వస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆకాంక్షించారు. ఇరాన్ ఉద్దేశపూర్వకంగానే ఈ విషయాన్ని సాగదీస్తుందా లేదా అన్నది తేలిపోనున్నట్లు చెప్పారు. 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను పునరుద్ధరించడంపై పరిశీలిస్తున్నట్లు తెలిపారు. త్వరగా ఒప్పందం జరగకపోతే, 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్ ప్లస్'గా దీనిని చేపట్టే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. నౌకలను సురక్షితంగా బయటకు తేవడంతో పాటు మరికొన్ని చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఇదిలావుంటే, పాకిస్తాన్‌లోని ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్, అమెరికా ప్రతినిధులు వచ్చేవారం భేటీ కాబోతున్నట్లు తెలుస్తోంది. శాంతి ప్రక్రియలో మరో ముందడుగుగా ఈ సమావేశాన్ని భావిస్తున్నారు. 14 పాయింట్ల అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసే అవకాశం ఉన్నట్లు కథనాలు పేర్కొన్నాయి. అయితే తమ దేశంపై ఆంక్షలు ఎత్తివేస్తేనే చర్చల్లో పురోగతి సాధ్యమని ఇరాన్ చెబుతోంది. చర్చలు సానుకూలంగా సాగితే కాల్పుల విరమణ మరికొంత కాలం పొడిగించే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అమెరికా దూడుకుకు కళ్లెం వేసే విషయంలో ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్‌కు ఐరాసలోని ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమీర్ సయ్యాద్ ఇరవానీ ఓ లేఖ రాశారు.

# ఎప్‌స్టీన్ ఫైళ్ల కోసం సీక్రెట్ రీడింగ్ రూమ్




**న్యూయార్క్:** ప్రపంచవ్యాప్తంగా సంచలనం సష్టించిన ఎప్‌స్టీన్ ఫైళ్లన్నీ ఓ లైబ్రరీ ద్వారా ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. అమెరికాలోని న్యూయార్క్‌లో ఒక రీడింగ్ రూమ్ ఏర్పాటుచేశారు. ఆ నగరం సమీపంలోని ట్రైబెకా ప్రాంతంలో ఈ ఫైళ్లను ప్రదర్శనకు ఉంచారు. ఈనెల 8 నుంచి 21వ తేదీ వరకు ప్రజలు వీటిని చదవడానికి వీలు ఉందని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. మొత్తం 3.5 మిలియన్ల ఫైళ్లను దశలవారీగా అమెరికా న్యాయశాఖ విడుదల చేసింది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రైమరీ ఫ్యాక్ట్స్ అనే ఎన్జీఓ ఈ ప్రదర్శన ఏర్పాటు చేసింది. 3,700 వాల్యూమ్స్‌లో 'డొనాల్డ్ జె.ట్రంప్ అండ్ జెఫ్రీ ఎప్‌స్టీన్ మెమోరియల్ రీడింగ్ రూమ్' పేరిట వాటిని ఉంచింది. అపాయింట్‌మెంట్ తీసుకున్నవారే ఈ రీడింగ్ రూమ్‌కు వెళ్లడానికి వీలు ఉంటుంది. భద్రతా కారణాలతో నిర్వాహకులు ఈ గ్యాలరీ అడ్రెస్‌ను రహస్యంగా ఉంచారు. ట్రంప్, ఎప్‌స్టీన్ మధ్య సంబంధాలు ఎప్పుడు మొదలై, ఎప్పటివరకు కొనసాగాయో కూడా ఇక్కడ పొందుపర్చారు. ఎప్‌స్టీన్ వర్గ నేరాలు, వాటిని కప్పిపుచ్చడానికి ట్రంప్ ప్రయత్నాలపై నుంచి ప్రజల దష్టి మళ్లకుండా ఈ ఏర్పాట్లు జరిగినట్లు ఎన్జీఓ వెబ్‌సైట్ పేర్కొంది. న్యాయం కోసం పోరాడుతున్న బాధితులకు మద్దతుగా నిలిచే ప్రయత్నం అని కూడా వెల్లడించింది.

# టిజిఎస్ఆర్‌టిసిలో ఖాళీలు భర్తీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ట్రాఫిక్ సూపర్వైజర్ ట్రైనీ, మెకానికల్ సూపర్వైజర్ ట్రైనీ పోస్టుల భర్తీ ప్రక్రియను తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పూర్తి చేసింది. మొత్తం 198 పోస్టులకు నిర్వహించిన నియామకాల్లో 196 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు బోర్డు ప్రకటించింది. అర్హత గల అభ్యర్థులు అందుబాటులో లేకపోవడంతో రెండు పోస్టులు ఖాళీగా మిగిలిపోయాయి. ఎంపికైన అభ్యర్థుల వివరాలను టిఎస్ఎల్‌పిఆర్‌బి అధికారిక వెబ్‌సైట్‌లోని వ్యక్తిగత లాగిన్‌లలో అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. అలాగే సెలక్షన్ లిస్టులు, కట్‌ఆఫ్ మార్కులు, చివరి ఎంపికైన అభ్యర్థుల జనన తేదీల వివరాలు కూడా వెబ్‌సైట్‌లో ప్రచురించారు.

## కార్మికుల జాతీయ సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చాయి. మే 15న జరుగనున్న ఎంజిఎన్ఇర్ఇజిఏ కార్మికుల సమ్మెకు తమ పూర్తి సంఘీభావాన్ని, మద్దతును తెలియజేస్తున్నామని కేంద్ర కార్మిక సంఘాల వేదిక విడుదల చేసిన ప్రకటన తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు ఉపాధి హామీ కార్మికుల సమ్మెకు మద్దతుగా , సంఘీభావంగా చేరతారని పేర్కొన్నారు. సమ్మె డిమాండ్లు ఇలా ఉన్నాయి...విబి జిరామ్ (జి) చట్టాన్ని వెంటనే రద్దుచేసి, పటిష్ఠమైన సరికొత్త రూపంలో ఎంజిఎన్ఆర్ఇజిఏను పున: స్థాపించాలని, బలోపేతం చేయబడిన ఎంజిఎన్ఆర్ఇజిఏలో కనీసం 200 రోజుల పనిని రూ.700 కనీస వేతనంతో అందించాలని, దీనిని మార్కెట్ ద్రవ్యోల్బణానికి అనువుగా ఏటా రెండుసార్లు సవరించాలని, భారీ స్థాయిలో బహిష్కరణకు దారితీసిన, హాజరు కోసం ముఖ గుర్తింపును తాజా చేర్పుగా కలిగిన వివక్షాపూరిత సాంకేతికత ఆధారిత చెల్లింపు, హాజరు వ్యవస్థలను వెనక్కి తీసుకోవాలని, గ్రామాల అంతటా ఎంజిఎన్ఆర్ఇజిఏ పనులు, వాటి అమలులో గ్రామ సభలను ప్రధాన భాగస్వాములుగా మారేలా శక్తివంతం చేయాలన్న డిమాండ్లపై ఈ ఒక రోజు జాతీయ సమ్మెకు రోజ్‌గార్ వ్యవసాయ, గ్రామీణ కార్మికుల సంయుక్త వేదిక, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం సంఘర్ష్ మోర్చా సంయుక్తంగా పిలుపునిచ్చాయి. దేశంలో చట్టబద్ధంగా ఉపాధి హక్కుకు హామీ ఇచ్చే ఏకైక పథకమైన హక్కుల ఆధారిత ఎంజిఎన్ఇజిఏను రద్దుచేయడాన్ని నిరసిస్తూ 2026 మే 15న వ్యవసాయ, గ్రామీణ కార్మికులతో చేరడానికి సాధారణ కార్మికులను ప్రత్యేకించి కేంద్ర కార్మిక సంఘాల అనుబంధ సంఘాల సభ్యులను వీధుల్లోకి తీసుకురావాలని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిస్తున్నాయి.

# ఐకెపి కేంద్రాల ద్వారా భారీగా ధాన్యం కొనుగోలు

మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ధాన్యం సేకరణను మరింత వేగవంతం చేయాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. 3,563 లక్ష్యం 3,400 కాగా, అదనంగా మరో 100 పైగా కేంద్రాలు ప్రారంభమైనట్లు చెప్పారు. ఇప్పటివరకు సుమారు 11 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చిందన్నారు. 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి చేసి మిల్లులకు తరలింపు చేస్తామన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో, జిల్లా డిఆర్‌డిఓల పర్యవేక్షణలో కొనుగోళ్లు జరుపుతున్నామన్నారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మహిళా సంఘాలు కీలక భూమిక పోషిస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని మొత్తం కేంద్రాల్లో సుమారు 40 శాతం కేంద్రాలను మహిళలే నిర్వహిస్తుండటం విశేషమని తెలిపారు. ధాన్యం తూకం వేయడం నుండి, రికార్డుల నిర్వహణ, మిల్లులకు తరలింపు, ఆన్‌లైన్ ఎంట్రీ వరకు ప్రతి దశలోనూ మహిళా సంఘాలు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాయన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, మహిళా సంఘాల భాగస్వామ్యంతో కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పెరిగిందని మంత్రి సీతక్క తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఎక్కువ సమయం గడపకుండా త్వరితగతిన తూకం పూర్తి చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. వరి కోతల ఉధృతిని బట్టి అవసరమైన చోట మరిన్ని కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు, మహిళా సంఘాలు సమన్వయంతో పని చేస్తూ రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ, రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యల పట్ల సానుకూల స్పందన వ్యక్తమవుతోందన్నారు.

# సంగీత సుమధురం మహత్తరం

మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు

**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** సంగీతానికి ఎల్లలు లేవని, అది సుమధురం, రసవత్తరం, మహత్తరమని పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అభివర్ణించారు. 150 మంది వయోలిన్ల సంగీత కలయిక కనువిందు వీనుల విందు చేసిందన్నారు. శనివారం హైదరాబాద్ శిల్పకళావేదికలో ఆరభి ది సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ 28వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. కళారత్న డాక్టర్ అశోక్ గుర్జాలే సంగీత దర్శకత్వంలో గంటన్నరపాటు సాగిన సంగీత మహోత్సవం కళాప్రియులను ఓలలాడించింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ఈ విలక్షణ వైవిధ్య సంగీత కచేరి మహాద్భుతమన్నారు. భారతీయ సంగీత తపస్సు, భారతీయ గొప్పతనం, సంగీత వారసత్వ వైభవమని అభివర్ణించారు. అశోక్ గుర్జాలే సంగీత కృషి మహాద్భుతమని అభినందించారు. పద్మశ్రీ యెల్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆరభి సంస్థ వ్యవస్థాపకులు అశోక్ గుర్జాలే ఐదు దశాబ్దాలుగా అందిస్తున్న వయోలిన్ సేవలు అపూర్వమని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రముఖ మృదంగ విద్వాంసులు పాలకుర్తి రామచంద్ర శర్మను మృదంగ నాద విభూషణ బిరుదుతో ఘనంగా సత్కరించారు. అనంతరం సంగీత విద్యార్థులు అశోక్ గుర్జాలేను ఘనంగా శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పద్మ శ్రీ దీపికా రెడ్డి, కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత డాక్టర్ దారూరి రాఘవాచారి, త్రిచూర్ బ్రదర్స్ రాంకుమార్ మోహన్, జి.కిషన్‌రావు, సెంట్రల్ వర్సిటీ ఇన్‌చార్జి విసి డా.జొన్నలగడ్డ అనురాధ, కలెక్టర్ స్నేహ శబరీష్, సినీ నటులు తనికెళ్ల భరణి, టిటిడి ధర్మప్రచార పరిషత్తు అదనపు కార్యదర్శి ద్విభాష్యం కల్యాణి, వారణాసి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## పోక్సో కేసు

(మొదటి పేజీ తరువాయి)

తనను ఆహ్వానించిందని భగీరథ్ కరీంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ బాలిక కుటుంబాన్ని నమ్మదగినదిగా భావించి, స్నేహితుల బృందంతో కలిసి తాను వారి వెంట కొన్ని పుణ్యక్షేత్రాలను సందర్శించినట్లు భగీరథ్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ తర్వాత, ఆ బాలిక, ఆమె తల్లిదండ్రులు తనను పెళ్లి చేసుకోవాలని బెదిరించారని, అయితే తాను ఆ ప్రతిపాదనను తిరస్కరించానని భగీరథ్ తెలిపాడు. దీంతో ఆ బాలిక తల్లిదండ్రులు డబ్బు డిమాండ్ చేశారని, ఒకవేళ డబ్బు ఇవ్వకపోతే తమపై తప్పుడు ఫిర్యాదులు చేస్తామని బెదిరించారని ఆయన ఆరోపించాడు. భయంతో తాను ఆ బాలిక తండ్రికి రూ. 50,000 ఇచ్చానని, కానీ వారు ఏకంగా రూ. 5 కోట్లు డిమాండ్ చేశారని భగీరథ్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఒకవేళ ఆ డబ్బు ఇవ్వకపోతే, ఆ బాలిక తల్లి ఆత్మహత్య చేసుకుంటుందని వారు బెదిరించినట్లు ఆయన ఆరోపించాడు.

## కొత్త సవాళ్లు

(మొదటి పేజీ తరువాయి)

కోసం 'తెలంగాణ రైజింగ్–2047' మాస్టర్ ప్లాన్‌ను ఇప్పటికే ఆవిష్కరించుకున్నాం. లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలు చేపడుతున్నాం. కాలుష్య కోరల నుంచి హైదరాబాద్‌ను కాపాడటానికి మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు నగర సంస్కృతికి అనుసంధానించనున్నాం. నగరంలో కాలుష్య నియంత్రణకు అనేక చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగానే ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. హైదరాబాద్‌లో ఆర్‌టిసిలో ఈవీ బస్సులను ప్రవేశపెడుతున్నాం. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఈవీ వాహనాలుగా మార్చాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం' అని ముఖ్యమంత్రి చెప్పారు. హైదరాబాద్ నగర తాగునీటి సరఫరా, పట్టణాభివృద్ధి, మూసీ పునరుజ్జీవనం తదితర అంశాలపై ప్రభుత్వ ప్రణాళికలను సమావేశంలో ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్టాండింగ్ కమిటీకి వివరించారు. నగర అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం సహకరించేలా చొరవ చూపాలని ఈ సందర్భంగా స్టాండింగ్ కమిటీకి ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

**మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు చేపట్టడం విప్లవాత్మకం**

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు చేపట్టడం ఒక విప్లవాత్మక నిర్ణయమని స్టాండింగ్ కమిటీ చైర్ పర్సన్‌తో పాటు ఇతర సభ్యులు తెలిపారు. హైదరాబాద్ నగర జీవన స్థితిగతులను మెరుగుపరిచే మూసీ పునరుజ్జీవ తరహా ప్రాజెక్టు దేశంలోనే మొదటిదని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ నగర ప్రజలకు ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టును చేపట్టడంపై ఈ సందర్భంగా కమిటీ ముఖ్యమంత్రి అభినందించింది. దీంతో పాటు రాష్ట్రంలో మహిళాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను కమిటీ ప్రశంసించింది. తెలంగాణ రాష్ట్రాన్ని 2034 నాటికి ఒక ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక శక్తిగా ఎదగడానికి అనుగుణంగా సమగ్ర ప్రణాళికలతో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్'ను స్టాండింగ్ కమిటీ సభ్యులకు సిఎం అందజేశారు.

## ప్రత్యేకంగా లెక్కించాలి

(మొదటి పేజీ తరువాయి)

బిసి సంఘాల నాయకులు జాజుల శ్రీనివాస్ గౌడ్, గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్, తాటికొండ విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వి.హనుమంతరావు మాట్లాడుతూ బిసిల జనాభా పెరుగుతున్నప్పటికీ వారికి తగిన న్యాయం జరగడంలేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ బిసిల సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. జనగణనలో బిసిల వివరాలు నమోదు చేయడం ద్వారా మాత్రమే వారికి రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో సముచిత హక్కులు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ అంశంపై ఇప్పటికే ప్రధాని మోదీకి రెండు లేఖలు రాసినప్పటికీ స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిసిలపై స్పష్టమైన నిర్ణయం తీసుకున్న తరువాతే మోదీ తెలంగాణకు రావాలన్నారు. మహిళా రిజర్వేషన్లలో కూడా బిసిలకు కోటా కల్పించలేదని, దీనిపై కాంగ్రెస్ ఎంపిలు పార్లమెంట్‌లో పోరాడారని తెలిపారు. బిసిలకు న్యాయం చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. దేశవ్యాప్తంగా బిసిల హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హనుమంతరావు హెచ్చరించారు. బిసి వర్గాలకు చెందిన బిజెపి ప్రజాప్రతినిధులు కూడా ఈ అంశంపై స్పందించాలని కోరారు. ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ బిసిల స్థితిగతులను అంచనా వేసిన తర్వాత రిజర్వేషన్లను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసి చట్టం తీసుకొచ్చిందని, ఆ చట్టం ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. ఆ చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చి, జనాభా దామాషా ప్రకారం అన్ని వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రధాని మోదీ బిసిలకు మొండి చేయి చూపిస్తున్నారని విమర్శించారు. బిజెపి ఎంపిలకు ధైర్యం లేదని, మోదీ ఏమి గణకార్యం చేశారని హైదరాబాద్‌లో సభ పెడుతున్నారని ప్రశ్నించారు. బిసిలకు న్యాయం చేయకుంటే మోదీ పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. విహెచ్ దీక్షకు సంఘీభావంగా పలు బిసి సంఘాల నేతలు ర్యాలీ నిర్వహించారు.

## 4 లేబర్ కోడ్‌లు

(మొదటి పేజీ తరువాయి)

కింద ఉన్న నిబంధనలు ప్రభుత్వ అధికారిక గెజెట్‌లో నోటిఫై చేయబడ్డాయని, దీంతో కార్మిక చట్టాల పూర్తి అమలు ప్రక్రియ పూర్తి అయిందని ఒక అధికారి 'పిటిఐ'కి చెప్పారు. 2025 నవంబరు 21న కార్మిక చట్టాలు దేశ చట్టంగా మారినప్పటికీ నిబంధనలు లేకపోవడం వల్ల కొన్ని వివరణలు ఇవ్వలేదని ఆయన వివరించారు. భాగస్వాముల నుంచి అభిప్రాయాల సేకరణ కోసం ముసాయిదా నియమాలను 2025 డిసెంబరు 30న ప్రచురించారు. చట్టపరమైన పరిశీలనల తర్వాత నాలుగు లేబర్ కోడ్‌లను నోటిఫై చేశారు. కొత్త చట్టాలను పూర్తిగా అమలులోకి తీసుకురావడానికి నాలుగు నియమాళిల కింద నిబంధనలను ప్రచురించడం అవసరమైంది. దీర్ఘకాలంగా ఉన్న సవాళ్లను పరిష్కరించడానికి, వ్యవస్థను మరింత సమర్థవంతంగా, సమకాలీనంగా మార్చడానికి, ప్రస్తుతం ఉన్న 29 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక నియమావళిలుగా క్రోడీకరించారు. ఈ క్రోడీకరణ వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపర్చడం, ఉపాధి కల్పనను ప్రోత్సహించడం, ప్రతీకార్మికుడికీ భద్రత, ఆరోగ్యం సామాజిక, కార్మిక భద్రతను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుంది. కార్మిక అంశం ఉమ్మడి పరిధిలోకి వచ్చే అంశం అయినందున, దేశ వ్యాప్తంగా నాలుగు కోడ్‌ల కింద నిబంధనలను పూర్తిగా అమలు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని నోటిఫై చేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనల అమలు తదుపరి పరివర్తనాత్మక దశకు నాంది పలుకుతుంది. ఇది కార్మికుల రక్షణను విస్తృతం చేయడం, వ్యాపార కార్యకలాపాలను సులభతరం చేయడం, కార్మికులకు అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడం వంటివి చేస్తుంది. కార్మిక చట్టాల నిబంధనలలో తప్పనిసరి నియామక పత్రం, 40ఏళ్లు పైబడిన కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, వేర్వేరు షిఫ్ట్‌లలో పనిచేసే మహిళలకు సమాన పని, వేతనం, అవకాశం కల్పించడం వంటివి ఉన్నాయి. నూతన చట్టపరమైన నిబంధనలు, 'జాతీయ నైపుణ్య పునరుద్ధరణ నిధి'ని ఏర్పాటు చేయాలని కూడా నిర్దేశిస్తున్నాయి. దీనిని ఉద్యోగాలు కోల్పోయిన వారికి నైపుణ్య పునరుద్ధరణ కోసం వినియోగిస్తారు. ఈ నిబంధనలు వారం పనిగంటలను 48గంటలకు పరిమితం చేశాయి. నిబంధనల ప్రకారం...రోజువారీ ప్రాతిపదికన కాకుండా ఇతర వయోపరిమితి గల ఉద్యోగికి సాధారణ పనిదినంగా పరిగణించబడే పనిగంట ల సంఖ్యను వారం మొత్తం పనిగంటలు 48గంటలకు మించకుండా ఉండేలా నిర్ధారించాల్సి ఉంటుంది. ఈ నిబంధల ప్రకారం కార్మికులకు కనీసం ఒక వారంతపు సెలవు ఇవ్వడంతోపాటు పనివేళలు దాటి పనిచేసినందుకు ఓవర్‌టైమ్ (ఓ.టి) చెల్లింపు కూడా ఉంటుంది.

## నేడు హైదరాబాద్‌కు ప్రధానమంత్రి

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొంటారు. తర్వాత మధ్యాహ్నం 3:35 గంటలకు హెచ్ఐసిసి నుంచి బయలుదేరి, మధ్యాహ్నం 3:40 గంటలకు హైటెక్ సిటీలోని సింధు ఆస్పత్రికి చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం 3:45 గంటల నుంచి సాయంత్రం 4:15 గంటల వరకు సింధు ఆస్పత్రిని ప్రారంభిస్తారు. సాయంత్రం 4:20 గంటలకు సింధు ఆస్పత్రి నుంచి బయలుదేరి, సాయంత్రం 4:45 గంటలకు మళ్లీ బేగంపేట్ విమానాశ్రయానికి చేరుకుంటారు. సాయంత్రం 4:45 గంటల నుంచి 6:15 గంటల వరకు రిజర్వ్ సమయం కేటాయించారు. అనంతరం సాయంత్రం 6:20 గంటలకు బేగంపేట్ విమానాశ్రయం నుంచి బయలుదేరి, సాయంత్రం 6:25 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌కు చేరుకుంటారు. అక్కడ సాయంత్రం 6:30 గంటల నుంచి 7:10 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. రాత్రి 7:10 గంటలకు సభా వేదిక నుంచి బయలుదేరి, రాత్రి 7:15 గంటలకు బేగంపేట్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం రాత్రి 7:20 గంటలకు ప్రత్యేక విమానంలో గుజరాత్‌లోని జామ్‌నగర్ ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరి, రాత్రి 9:20 గంటలకు అక్కడికి చేరుకోనున్నారు.

# రెజ్లర్ వినేశ్ పోగట్‌కు షోకాజ్ నోటీసులు జారీ



**న్యూఢిల్లీ:** రెజ్లర్ వినేశ్ పోగట్‌కు భారతీయ రెజ్లిం గ్ సమాఖ్య షోకాజ్ నోటీసు జారీ చేసింది. క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడిందని, యాంటీ డోపింగ్ రూల్స్‌ను అతిక్రమించినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఈ ఏడాది జూన్ వరకు వినేశ్ ఎటువంటి టోర్నీల్లో పాల్గొనడానికి అర్హురాలు కాదని రెజ్లింగ్ సమాఖ్య పేర్కొన్నది. డబ్ల్యూఎఫ్ఐ 15 పేజీల నోటీసును జారీ చేసింది. వినేశ్ ప్రవర్తన వల్ల దేశానికి చెడ్డ పేరు వచ్చినట్లు ఆ నోటీసులో తెలిపారు. భారతీయ రెజ్లింగ్ వ్యవస్థ ఇమేజ్‌ను డ్యామేజ్ చేసిందని, డబ్ల్యూఎఫ్ఐ నిబంధనలను ఆమె ఉల్లంఘించినట్లు పేర్కొన్నారు. నాలుగు తీవ్రమైన ఆరోపణలు చేసిన ఫెడరేషన్.. వాటిపై వినేశ్‌ను వివరణ కోరింది. 2024 ఒలింపిక్స్‌లో బరువు వల్ల అనర్హత, యాంటీ డోపింగ్ రూల్స్‌ను విస్మరించడం, 2024 మార్చి సెలక్షన్ ట్రయల్స్ లో రెండు కేటగిరీల్లో పాల్గొనడం వంటి అంశాల పై వినేశ్ పోగట్ వివరణ ఇవ్వాలని రెజ్లింగ్ సమాఖ్య కోరింది. అయితే జూన్ వరకు వినేశ్ ఎటువంటి దేశీయ టోర్నీల్లో పాల్గొనడానికి అర్హురాలు కాదని సమాఖ్య చెప్పింది. మే 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు గోండాలో జరిగే నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో కూడా పాల్గొనేందుకు అనుమతి లేదని రెజ్లింగ్ సమాఖ్య చెప్పింది. షోకాజ్ నోటీసులపై పోగట్ 14 రోజుల్లోగా స్పందించాల్సి ఉంటుంది.

# గుజరాత్ టైటాన్స్ విజయం



హ్యాట్రిక్ విజయాలతో జోరుమీదున్న గుజరాత్ టైటాన్స్ ప్లే ఆఫ్స్ అవకాశాల్ని మెరుగుపరచుకుంది. శనివారం జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై భారీ విజయంతో చెక్ పెట్టింది. ఓపెనర్లు గిల్ (84), సుదర్శన్(55) విధ్వంసంతో 229 రన్స్ కొట్టిన గుజరాత్ ఆపై రషీద్ ఖాన్(4–33)ల విజృంభణతో ఆతిథ్య జట్టును హడలెత్తించింది. రబడ(2–33) టాపార్డర్‌ను పడగొట్టగా.. మిస్టరీ స్పిన్నర్ రషీద్ మిడిల్ బ్యాటర్లను మడతపెట్టేశాడు. క్రీజులో నిలబడి ఆడేవారు కరువవ్వగా రాజస్థాన్ 152కే ఆలౌటైంది. ఏడో విజయంతో గుజరాత్ రెండో స్థానానికి దూసుకెళ్లింది. పంతొమ్మిదో సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ దూకుడు కొనసాగుతోంది. లీగ్ దశ ఆఖర్లో పుంజుకున్న గుజరాత్ ఈసారి రాజస్థాన్ రాయల్స్‌ను భారీ తేడాతో ఓడించింది. భారీ లక్ష్యాన్ని ముందుంచి ప్రత్యర్థిని భయపెట్టిన గుజరాత్ బౌలర్ల కృషితో పెద్ద విజయాన్ని అందుకుంది. ఈ సీజన్‌లో రాజస్థాన్‌కు మెరుపు ఆరంభాలిస్తున్న ఓపెనర్ సూర్యవంశీ(36) దూకుడుగానే ఆడినా సిరాజ్ అతడి ఆట కట్టించాడు. ఆ తర్వాతి ఓవర్లో డేంజరస్ యశస్వీ జైస్వాల్(3)ని రబడ ఔట్ చేసి రాజస్థాన్‌కు షాకిచ్చాడు. కాసేపటికే హిట్‌మైర్(6)ను సైతం వెనక్కి పంపిన రబడ రెండో వికెట్ సాధించాడు. ఆ తర్వాత జురెల్(24) జతగా రవీంద్ర జడేజా(38) బౌండరీలతో గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. కానీ, రషీద్ ఖాన్ (4–33) ఒకే ఓవర్లో జురెల్, ఫెరీరా(4)లను వెనక్కి పంపి రాజస్థాన్‌ను కష్టాల్లోకి నెట్టాడు. అంతేనా.. ఆ తర్వాతి ఓవర్లో జడేజాను పెవిలియన్ పంపి రాజస్థాన్ ఆశలపై నీళ్లు చల్లాడు. హోల్డర్ సైతం వికెట్ల వేటతో గుజరాత్ గెలుపు మరింత తేలికైంది. చివరి బ్యాటర్‌ను వెనక్కి పంపిన హోల్డర్ ప్రత్యర్థిని 152కే పరిమితం చేయగా.. గుజరాత్ 87 పరుగుల భారీ విజయాన్నందుకుంది. జైపూర్‌లో గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు శతక భాగస్వామ్యంతో రెచ్చిపోయారు. ఆతిథ్య రాజస్థాన్ రాయల్స్ బౌలర్లను ఉతికేసిన శుభ్‌మన్ గిల్(84), సాయి సుదర్శన్(55)లు అర్ధ శతకాలతో భారీ స్కోర్‌కు పునాది వేశారు. వీరిద్దరూ ఔటయ్యాక.. జోస్ బట్లర్(13), హోల్డర్(7) క్రీజులో నిలవలేదు. దాంతో, 118తో పటిష్టంగా కనిపించిన గుజరాత్ ఒక్కసారిగా 185/3కి చేరింది. అయినా.. సుందర్(37 నాటౌట్), తెవాటియా(14 నాటౌట్)లు ధనాధన్ ఆడారు. డెత్ ఓవర్లలో ఈ ద్వయం దంచేయగా గుజరాత్ నిర్ణీత ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది.

# నాకు ఇవ్వాల్సిన ప్రైజ్‌మనీ ఎగ్గొట్టారు..

**అభిజిత్ గుప్తా**

భారత గ్రాండ్‌మాస్టర్, అర్జున అవార్డు గ్రహీత అభిజిత్ గుప్తా తనకు న్యాయం చేయాలంటూ క్రీడామంత్రిత్వ శాఖను ఆశ్రయించాడు. ఒడిశా ఓపెన్ నిర్వాహకుల నుంచి తనకు రావాల్సిన ప్రైజ్‌మనీని ఇప్పించాలని అభిజిత్ కోరాడు. ఐదు నెలలు కావొస్తున్నా నిర్వాహకులు స్పందించడం లేదని వాపోయిన అభిజిత్.. ఈ విషయంలో చొరవ తీసుకోవాలని క్రీడా మంత్రిత్వ శాఖకు విన్నవించుకున్నాడు. ఒడిశా ఓపెన్2026(పదహారో అంతర్జాతీయ గ్రాండ్ మాస్టర్ చెస్ ఫెస్టివల్) జనవరి 16 24 మధ్య జరిగింది. ఈ టోర్నీలో అదరగొట్టిన అభిజిత్ గుప్తా విజేతగా అవతరించాడు. ఛాంపియన్‌గా నిలిచినందుకు అతడికి రూ.5.5 లక్షల నగదు బహుమతి దక్కాలి. కానీ, నిర్వాహకులు మాత్రం ఈ టోర్నీ ముగిసి ఐదు నెలలు కావొస్తున్నా ప్రైజ్‌మనీ ఇవ్వలేదు. తనకు రావాల్సిన డబ్బుల గురించి అఖిల భారత చెస్ సమాఖ్యకు, ఒడిశా ఓపెన్ నిర్వాహకులకు అభిజిత్ పలు మార్లు లేఖలు రాసినప్పటికీ న్యాయం జరుగలేదు. దాంతో.. విసుగొచ్చిన అతడు క్రీడా మంత్రిత్వ శాఖను సంప్రదించాడు.'ఒక క్రీడాకారుడిగా విజయాల కంటే ఓటములను అంగీకరించడం నేర్చుకుంటాం. ఇదంతా క్రీడలో భాగం. కానీ, టోర్నీలో గెలిచిన తర్వాత ప్రైజ్‌మనీ అందుకోకపోవడం మరింతగా బాధిస్తుంది. ఈ ఏడాది జనవరిలో నేను ఒడిశా ఓపెన్ గెలుపొందాను. ప్రైజ్‌మనీని నెల రోజుల్లో ఇస్తామని నిర్వాహకులు హామీ ఇచ్చారు. నెల గడిచినా నాకు నగదు బహుమతి ఇవ్వలేదు. ఇదేంటీ? అని అడుగబోతే నిర్వాహకులు స్పందించడం లేదు. అఖిల భారత చెస్ సమాఖ్య ఆధ్వర్యంలో టోర్నీ జరిగినందున ఏఐసీఎఫ్ అధ్యక్షుడు, సెక్రటరీలను సంప్రదించాను. కానీ, దురదృష్టవశాత్తూ వారు కూడా ఈ సమస్యను పరిష్కరించలేకపోయారు. నాకు చెల్లించని డబ్బుల గురించే కాదు.. భారత్‌లోని ప్రతి చెస్ క్రీడాకారుల గౌరవం, నమ్మకాన్ని కాపాడం గురించి అని నేను మీకు తెలియజేస్తున్నా' అని అభిజిత్ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నాడు.

# అబ్బాయిల కోసం పోస్టాఫీస్ పథకాలు అదుర్స్




**న్యూఢిల్లీ :** ఏ తల్లిదండ్రులైనా పిల్లలు తమ కన్నా మంచి స్థానంలో ఉండాలని కోరుకుంటారు. చదువుల దగ్గర నుంచి వాళ్లు ఆర్థికంగా స్థిరపడేవరకు అండగా నిలిచేందుకు ప్రయత్నిస్తారు. అందుకే పిల్లల చిన్నతనం నుంచే వారి పేరు మీద సేవింగ్స్ ప్రారంభిస్తుంటారు. ఈ క్రమంలోనే రిస్క్ లేని, ఆకర్షణీయమైన వడ్డీలు అందించే పోస్టాఫీసులో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. అయితే పోస్టాఫీస్‌లో కేవలం అమ్మాయిలకు మాత్రమే పథకాలు ఉన్నాయని భావిస్తుంటారు. కానీ మగపిల్లల కోసం కూడా ఎన్నో పథకాలు ఉన్నాయి.

### కిసాన్ వికాస్ పత్ర పథకం

1988లో కిసాన్ వికాస్ పత్ర స్కీమ్‌ను ఇండియన్ పోస్టాఫీస్ ప్రారంభించింది. ఇది మగ పిల్లల కోసం ఒక స్వల్పకాలిక పొదుపు పథకం. ఇది తక్కువ ఆదాయంతో పాటు మధ్యతరగతి కుటుంబాలకు సరిపోతుంది.

**మరిన్ని వివరాలు :** 18 సంవత్సరాలు నిండిన ఎవరైనా ఈ పథకానికి అర్హులు. మైనర్ అయితే వారి కుటుంబ సభ్యులు స్టార్ట్ చేయవచ్చు.

- కనీస పెట్టుబడి రూ.1000 ఉండగా, గరిష్ఠంగా ఎంతైనా పెట్టుబడి పెట్టుకోవచ్చు.
- మే 2026 నాటికి ఈ పథకంలో వడ్డీ రేటు సంవత్సరానికి 7.9 శాతంగా ఉంది.
- ఈ స్కీమ్‌లో పెట్టిన నిధులను ముందుగానే విత్‌డ్రా చేసుకోవచ్చు.
- ఈ స్కీమ్‌ను ఒక పోస్టాఫీసు నుంచి మరో పోస్టాఫీసుకు బదిలీ చేసుకోవచ్చు.
- ఈ పథకం మెచ్యూరిటీ పీరియడ్ 10 సంవత్సరాల 4 నెలలు. లోన్ తీసుకునే వెసులుబాటు ఉంది.

### నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్

ఇది తక్కువ రిస్క్ కలిగి ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఉన్న పథకం. పన్ను ప్రయోజనాలతోపాటు చిన్న, మధ్య తరగతి ప్రజలను పొదుపు చేసేలా ప్రోత్సహించడం ఈ పథకం లక్ష్యం.

### మరిన్ని వివరాలు

- 18 సంవత్సరాలు ఉన్న వారు అర్హులు. అంతకంటే తక్కువ వయసు ఉంటే తల్లిదండ్రులు లేదా సంరక్షకులు అప్లై చేసుకోవచ్చు.
- ఈ పథకంలో మినిమమ్ రూ.1000 పెట్టుబడి పెట్టొచ్చు. గరిష్ఠ పెట్టుబడిపై పరిమితి లేదు.
- ఈ పథకంలో వడ్డీరేటు సంవత్సరానికి 7.7 శాతంగా ఉంది.
- ఎన్ఎస్‌సీ మెచ్యూరిటీ కాలం 5 సంవత్సరాలు. లాక్ ఇన్ టెన్యూర్ 5 సంవత్సరాలు.
- ఈ పథకం ద్వారా లక్షన్నర రూపాయల వరకు పన్ను ప్రయోజనాలను క్లెయిమ్ చేయవచ్చు.

### పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్

మగపిల్లల కోసం పోస్టాఫీస్ అందిస్తున్న మరో పొదుపు స్కీమ్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్. ఇందులో పెట్టుబడి పెడితే స్థిరమైన ఆదాయం పొందొచ్చు. తక్కువ రిస్క్ ఉండటంతో పాటు నెలనెలా డబ్బులు పొందవచ్చు.

### మరిన్ని వివరాలు:

- ఈ పథకంలో కనిష్ఠంగా రూ.1000, గరిష్ఠంగా రూ.9లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. జాయింట్‌గా అయితే 15 లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టొచ్చు.



- ఈ పథకంలో వడ్డీ రేటు మే 2026 నాటికి 7.4 శాతంగా ఉంది. నెలవారీగా ఇందులో వడ్డీ చెల్లింపులు ఉంటాయి.
- మెచ్యూరిటీ కాలం 5 సంవత్సరాలు.

### పోస్టాఫీసు రికరింగ్ డిపాజిట్ పథకం

మగపిల్లల కోసం పోస్టాఫీస్ అందిస్తున్న మరొక మంచి పథకం రికరింగ్ డిపాజిట్. బ్యాంక్‌లోని సేవింగ్స్ ఖాతాతో పోలిస్తే ఇది అధిక వడ్డీ రేటును అందించే రికరింగ్ డిపాజిట్ ప్లాన్. ఈ పథకం కింద తల్లిదండ్రులు 5 సంవత్సరాల పాటు ప్రతి నెలా నిర్దిష్ట మొత్తాన్ని ఖాతాలో ఆదా చేసుకోవచ్చు.

### మరిన్ని వివరాలు

- ఈ పథకం కాలవ్యవధి 5 సంవత్సరాలు. లాక్ ఇన్ పీరియడ్ 3 నెలలు.
- కనిష్ఠ పెట్టుబడి రూ.100, గరిష్ఠ పెట్టుబడిపై పరిమితి లేదు.
- ఈ స్కీమ్‌లో ప్రస్తుత వడ్డీ రేటు సంవత్సరానికి 6.7శాతంగా ఉంది.

### పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ స్కీమ్

ఈ స్కీం పన్నులను ఆదా చేయడానికి బెస్ట్. తక్కువ రిస్క్‌తో ఎక్కువ లాభం పొందవచ్చు. ఇందులోనూ నామినేషన్ సదుపాయం ఉంటుంది. పిపిఎఫ్ అనేది ఆకర్షణీయమైన వడ్డీ రేటుతో లభించే పెట్టుబడిపై మంచి రాబడిని అందిస్తుంది.

### మరిన్ని వివరాలు

- ఈ స్కీమ్‌లో కనిష్ఠంగా రూ.500, గరిష్ఠంగా రూ.1.5లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు.
- పిపిఎఫ్ 15 సంవత్సరాల లాక్ ఇన్ పదవీ కాలంతో వస్తుంది.
- సమయం ముగిసిన తర్వాత కాల వ్యవధిని మరో 5 ఏళ్లు పొడిగించవచ్చు.
- ఈ పథకంలో మైనర్ పేరుతో ఖాతా తెరవవచ్చు.
- మూడు సంవత్సరాల తర్వాత లోన్ తీసుకోవచ్చు.
- ఈ స్కీమ్‌లో మే 2026 నాటికి వడ్డీ రేటు 7.1%గా ఉంది.

ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80సి ప్రకారం లక్షన్నర రూపాయల వరకు పన్ను ప్రయోజనాలు లభిస్తాయి.

## పేదలకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు కట్టించే వరకు
# భూ పోరాటాలు నిర్వహిస్తాం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి**



**ప్రజాపక్షం/ వరంగల్ :** ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు కట్టించే వరకు భూ పోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట శివారు సర్వే నెంబర్ 476, 484, 506, లక్ష్మీ పురం సర్వేనెంబర్ 241 ప్రభుత్వ భూమిలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వేసిన గుడిసెలను మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి సందర్శించారు. అనంతరం లక్ష్మీ పురంలో డి. సాంబమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, భూమి, పేద వర్గాలకు కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇస్తానని చెప్పి ఇప్పటివరకు ఏ ఒక్కరికి న్యాయం చేయకుండా విఫలం అయ్యాడని, పేద ప్రజలకు నివాస స్థలాలు వచ్చేంతవరకు, డబుల్ బెడ్రూం ఇళ్లు సాదించేవరకు పోరాడుతామన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, ఎంపిలు, రియల్ ఎస్టేట్ దారుల చేతుల్లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందన్నారు. బొల్లికుంట శివా రు సర్వే నెంబర్ 476, 484, 506,లక్ష్మీ పురం సర్వేనెంబర్ 241 ప్రభుత్వ భూమిలో సిపిఐ ఆధ్వర్యంలో ఎర్రజెండాలు పాతిన తరువాతనే అది ప్రభుత్వ భూమి అని అధికారులు బోర్డు పెట్టారని గుర్తు చేసారు. ఈ భూమిలో గుడిసెలు వేసుకున్న వాసులందరికీ పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూ పోరాటాలు నిర్వహిస్తున్న నాయకులపై అక్రమ కేసులు పెట్టి భూ పోరాటాలు ఆపలేరని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వరంగల్ జిల్లాలో ఇతర ప్రాంతాలలోనూ ఇలాంటి భూములు ఉన్నాయని, ఎలాగైతే తెలంగాణ సాయుధ పోరాటంలో దున్నేవాడికే భూమి అని పోరాడామో అలాగే నేడు పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు సాధించే వరకు భూపోరాటాలు చేస్తామని, ఎన్ని కేసులు పెట్టినా ఈ భూ పోరాటం ఆగదని తక్షణమే ప్రభుత్వం ప్రభుత్వభూములను గుర్తించి పేద వర్గాలకు పంచాలని లేకుంటే ఈ భూమిని సిపిఐ పార్టీగా పేద వర్గాలకు పంపిణీ చేస్తామనిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు దండు లక్ష్మ ణ్, పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, గుండె బద్రి, ఖిలా వరంగల్ మండల సహాయ కార్యదర్శిలు ఓర్స రాజు, జాన్ పాల్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దామెర కృష్ణ, అంబేద్కర్ నగర్ శాఖ కార్యదర్శి చిట్యాల సువర్ణ, గజవెల్లి చిరంజీవి, జన్ను రాజు, ఖాజా మైనోద్దీన్, శంశోద్దీన్, ఉమా, దివ్య, శ్రీను, రాజేందర్, లక్క రమేష్, తోట మల్లయ్య, తోట రాజు, బందుల కృష్ణ, మంజుల, నలగంటి రజిని తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం సహించం

- రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఆందోళనలు తప్పవు : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
- లారీల కొరత,తరుగు కోతలు, మిల్లర్ల ఆంక్షలపై సిపిఐ నేతల ఆగ్రహం



**ప్రజాపక్షం/దేవరకొండ :** రైతులు రాత్రింబవళ్లు శ్రమించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి నిల్వ ఉంచడం రైతాంగంపై జరుగుతున్న అన్యాయమని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మండిపడ్డారు. రైతుల ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం కొనసాగితే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు తప్పవని ఆయన హెచ్చరించారు. శనివారం దేవరకొండ మండలంలోని ముదిగొండ (కమలాపురం) గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వల్లా నర్సింహారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాసుల మధ్య రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లపై పెద్దఎత్తున ప్రకటనలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద లారీల కొరత, మిల్లర్ల నిర్లక్ష్యం, తూకాలలో అవకతవకలు, తరుగు పేరుతో ధాన్యంలో కోతలు వంటి సమస్యలు రైతులను నష్టాల్లోకి నెడుతున్నాయని అన్నారు.లారీల కొరత లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ధాన్యం రవాణాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తరుగు పేరుతో రైతుల ధాన్యంలో అక్రమంగా కోతలు విధిస్తే సహించబోమని హెచ్చరించారు. మిల్లర్లు ధాన్యం దిగుబడిలో అనవసర ఆంక్షలు విధించడం తగదని, లారీల్లో వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్న వారు, రైతుల ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వల్ల వర్షాలు వస్తే భారీ నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, చలివేంద్రాలు, నీడ పందిళ్లు, కూర్చునే సౌకర్యాలు వంటి కనీస వసతులు కల్పించాలని అధికారులను కోరారు.

రైతులు ఇబ్బంది లు పడకుండా ప్రతి కొనుగోలు కేంద్రంలో ప్ర త్యేక అధికారిని నియమించి సమస్యలను వెం టనే పరిష్కరించాలని సూచించారు.ధాన్యం కొను గోళ్లలో మధ్యవర్తుల జోక్యం తగ్గించి పారదర్శక విధానంతో ప్రభుత్వం వ్యవహరించాలని వారు డిమాండ్ చేశారు. రైతుల చెమటకు తగిన గౌరవం ఇవ్వాలని, రైతాంగాన్ని ఇబ్బందులకు గురి చేసే విధానాలను వెంటనే నిలిపివేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు దేపా సుదర్శన్‌రెడ్డి,రైతులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వార్ల వెంకటయ్య డిమాండ్**



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వార్ల వెంకటయ్య డిమాండు చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును శనివారం రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వార్ల వెంకటయ్య సందర్శించి మొక్కజొన్న పండించిన రైతులతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వార్ల వెంకటయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ.2400ల మద్దతు ధర ప్రకటించినప్పటికీ సరైన విధంగా కొనుగోలు జరపకపోవడంతో రైతులు రోజులు తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా సాగైన మొక్కజొన్న సగానికి పైన పంట ప్రైవేటు వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. కొంతమంది దళారులు కమిషన్ ఏజెంట్లు మార్కెట్ అధికారులతో కుమ్మక్కై, కొంత మంది రైతుల దగ్గర కొనుగోలు చేసినట్లు ప్రభుత్వ మద్దతు ధర పొందుతున్నారని అన్నారు.

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు పులిజుల పరుశురాములు, మండల నాయకులు కోడెల కృష్ణయ్య యాదవ్, వార్ల అశోక్ యాదవ్, కొరపాల తిరుపతయ్య, కావాలి చంద్రయ్య, ఉప్పరి సాయిరాం, రైతులు అంజయ్య, చెన్నయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ సమస్యలు పరిష్కరించి, ప్రతిష్ఠను కాపాడాలి

**ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు సిపిఐ వినతి**




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, ఆలయ ప్రతిష్టకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని సిపిఐ బృందం కోరింది. శుక్రవారం స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను ఆయన నివాసంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు నేతృత్వంలోని బృందం కలిసి, 140 సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేసి మాట్లాడారు. భక్తులకు కరువుగా మారిన మౌలిక వసతులు దేవస్థానం మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తమ పార్టీ క్షేత్రస్థాయిలో పరిశీలించి 140 సమస్యలను గుర్తించామని, అందులో 100 సమస్యలను తక్షణమే పరిష్కరించే అవకాశం ఉందన్నారు. నిత్యం వేల సంఖ్యలో వచ్చే భక్తులకు వసతి గదులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండపైన, కొండ కింద ఉన్న ఖాళీ స్థలాల్లో తక్షణమే వసతి గదుల నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ సమస్యలను ఈఓ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని, ఎమ్మెల్యే చొరవ చూపి భక్తుల కష్టాలు తీర్చాలని కోరారు. ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించే చర్యలపై మీరందరం నిఘా పెంచాలన్నారు. గత కొంతకాలంగా ఆలయ ఉద్యోగులు కొందరు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని, వస్తువుల దొంగతనాలకు పాల్పడుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల ఆలయ గౌరవానికి విఘాతం కలుగుతోందని హెచ్చరించారు. పునర్నిర్మాణ సమయంలో కొండపైన షాపులు కోల్పోయిన 114 కుటుంబాలకు గత ప్రభుత్వం వర్తక సంఘం పేరుతో ప్రత్యామ్నాయం చూపిందని, ప్రస్తుతం 150 కుటుంబాలు దానిపైనే ఆధారపడి బతుకుతున్నాయని తెలిపారు. జెఎసి పేరుతో కొందరు అసత్య ప్రచారాలు చేస్తూ ఈ కుటుంబాలను రోడ్డున పడేసే ప్రయత్నం చేస్తున్నారని, ఇది సరికాదని సిపిఐ స్పష్టం చేసిందన్నారు. ప్రస్తుతం ఉన్న షాపులకు టెండర్లు వేయడం వల్ల స్థానికులకు ఉపాధి దూరమవుతుందని, నిబంధనల ప్రకారం వారిని కొనసాగించాలని కోరారు. నిరుద్యోగుల కోసం మరిన్ని కొత్త షాపులు నిర్మించి వారికి ఉపాధి కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లపల్లి మహేందర్, మున్సిపల్ కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గో రేటి రాములు, పేరబోయిన పెంటయ్య, ఆరే పుష్ప, పేరబో యిన బంగారి, అనంతుల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి కార్యక్రమాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్న పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవం, హైదరాబాద్ పనాజీ ఎకానమిక్ కారిడార్‌లోని గుడె బల్లూర్‌మహబూబ్‌నగర్ నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన, కాజీపేటవిజయవాడ మల్టీ ట్రాకింగ్ పనులను హైదరాబాద్ హెచ్‌ఐసిసి వేదికగా ప్రధానమంత్రి ఆదివారం వర్చువల్‌గా చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలంటూ కేంద్ర ప్రభుత్వం తరఫున జాతీయ రహదారుల శాఖ రీజినల్ ఆఫీసర్ కృష్ణప్రసాద్ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు.

## హైడ్రా కమిషనర్‌కు ధిక్కరణ నోటీసు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని సూరారం గ్రామంలో రెండు స్థలాల వద్ద హైడ్రా పెట్టిన నోటీసు బోర్డులను తొలగించాలనే ఆదేశాలను అమలు చేయలేదంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. కమిషనర్ రంగనాథ్‌కు కోర్టుధిక్కరణ నోటీసులిచ్చింది. బహిరంగ నోటీసు బోర్డులను 48 గంటల్లో తొలగించాలనే ఉత్తర్వులు అమలు చేయాలన్న హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలంటూ ఇచ్చిన వినతిపత్రంపైన, కోర్టు ధిక్కరణ నోటీసుపైన హైడ్రా చర్యలు తీసుకోలేదంటూ ఆ స్థలాలకు చెందిన జితేందర్ మరొకరు కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. వీటిని జస్టిస్ శ్రవణ్ కుమార్ విచారించి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కోర్టుధిక్కరణ నోటీసులు జారీ చేశారు. గతంలో తామిచ్చిన ఉత్తర్వులు అమలు కాలేదని పిటిషనర్ అందజేసిన ఫొటోలు చెబుతున్నాయని. నోటీసు బోర్డులను తొలగించాలన్న ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో కౌంటర్ కూడా వేయలేదని, హైడ్రా కమిషనర్ రంగనాథ్ కావాలనే కోర్టు ఆదేశాలు అమలు చేయలేదని అర్థం అవుతున్నందున కోర్టుధిక్కరణ పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కోర్టుధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోరాదో జూన్ 9న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని రంగనాథ్‌కు నోటీసు ఇచ్చారు. విచారణను జూన్ 9కి వాయిదా వేశారు.

## తమిళనాడులో సెక్యూలర్ ప్రభుత్వం మంచి తరుణం :డిప్యూటీ సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తమిళనాడులో టివికె ప్రభుత్వం ఏర్పాటుపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పందించారు. లౌకికవాద ప్రభుత్వ ఏర్పాటును కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తోందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇప్పటికే ఈ అంశంపై పార్టీ వైఖరిని స్పష్టం చేశారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన భట్టి విక్రమార్క, తమిళనాడులో సెక్యులర్ ప్రభుత్వం ఏర్పడటం మంచి విషయం అని అన్నారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే తన అభిప్రాయాన్ని వెల్లడించింది అని అన్నారు. ప్రాంతీయ పార్టీలతో కలిసి బిజెపి వ్యతిరేక శక్తులు ఏకమవుతున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



## 11 నుండి విద్యా వారోత్సవాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11 వ తేదీ నుండి నిర్వహించే విద్యా శాఖ వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణ రావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. విద్యా వారోత్సవాల నిర్వహణపై విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రానా , కళాశాల విద్యా శాఖ కమిషనర్ దేవసేన, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలతో కలసి సిఎస్ జిల్లా కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్లతో సిఎస్ మాట్లాడుతూ ఈ నెల 11 న ఎల్‌బి స్టేడియంలో నిర్వహించనున్న విద్యావారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరయ్యేలా కలెక్టర్లు చొరవతీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టే వారోత్సవాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను, రోజువారీ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్లకు, విద్యాశాఖ ఉన్నతాధికారులు వివరించారు. అంతకుముందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీకి సంబంధించిన పురోగతి, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లు, జనాభా స్వీయ గణన కు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సిఎస్ జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు.

## నాడు అవినీతిపరుడు... నేడు ముఖ్యమంత్రి

### సువేందు అధికారిపై నెట్టింట విమర్శలు

### 2016లో 'తెహల్కా' బిజెపికి గుర్తులేదా: రౌత్ చురకలు

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కొందరు ఆయన పాత వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. సువేందు టీఎంసీలో ఉన్నప్పుడు లంచ తీసుకుంటూ కెమెరాకు చిక్కిన ఘటనను గుర్తు చేశారు. అవినీతిపరుడంటూ అప్పట్లో తీవ్ర విమర్శలు చేసిన ప్రధాని మోదీ ఇప్పుడు భుజాలకెత్తుకుంటూ సీఎం చేశారంటూ విమర్శలు గుప్పించారు. 'మ్యాథ్యూ శామ్యూల్ అనే పాత్రికేయుడు 2014లో తెహల్కా పత్రిక తరపున నారదా స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారు. సువేందు అధికారి ఓ గదిలో ఏం చేస్తున్నారన్న విషయాన్ని రహస్యంగా చిత్రీకరించి బయటపెట్టింది ఆ స్టింగ్ ఆపరేషన్. అందులో టీఎంసీ నేతలలో కొందరు లంచాలు తీసుకుంటూ కనిపించారు. వారిలో సువేందు అధికారి ఉన్నారు. 2016 ఎన్నికల వేళ బీజేపీ ఈ వీడియోను బాగా ప్రచారం చేసింది. తర్వాత సువేందు అధికారి బీజేపీలో చేరిన తర్వాత తమ అధికారిక ఛానల్ నుంచి ఆ వీడియోను ఆ పార్టీ తొలగించింది. బీజేపీకి చెందిన ఈ గొప్ప వ్యక్తి బెంగాల్ ముఖ్యమంత్రి అయ్యారు. మొత్తం బీజేపీ శ్రేణులు ఆయనను పొగడటానికి ఒక్కటయ్యారు. నైతికత ఏమైంది? నైతిక సూత్రాలు ఏమయ్యాయి?' అంటూ ఎంపీ సంజయ్ రౌత్ విమర్శించారు. సువేందు లంచం తీసుకున్న వీడియోను రౌత్ పోస్ట్ చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ సువేందు అవినీతిపరుడంటూ సామాజిక మాధ్యమాలు పోస్టులతో నిండిపోయాయని, ఈడీ దాడులు కూడా జరిగాయని గుర్తుచేశారు. గతంలో ఆయనపై విమర్శలు గుప్పించిన బీజేపీ ఇప్పుడు పొగడ్తలతో ముంచెత్తుతూ ఏకంగా ముఖ్యమంత్రి పీఠాన్ని కట్టబెట్టిందని దుయ్యబట్టారు.

# పరిహార చెల్లింపులకు చర్యలు తీసుకోండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గద్వాల సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో భూసేకరణ పరిహారం నిధుల మళ్లింపు ఘటన కారణంగా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపులు నిలిపివేయడం సమర్థనీయం కాదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. కోర్టు సిబ్బంది దుష్ప్రవర్తన వల్ల రైతులు నష్టపోరాదని చెప్పింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు గద్వాల జిల్లా కోర్టు, ఏసీబీ, సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలంది. ఈ మేరకు జస్టిస్ పి. శ్యాంకోశీ, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావులతో కూడిన బెంచ్ తీర్పు వెలువరించింది. జోగులాంబ గద్వాల జిల్లాలోని ర్యాలంపాడు బాలెన్సింగ్ రిజర్వాయర్ కోసం 2008లో సేకరించిన 7.12 ఎకరాల భూమికి సంబంధించి పరిహారంలో పరిహార మొత్తం రూ.3.08 కోట్లను 2015–2022 మధ్య గద్వాల కోర్టులో సీనియర్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన వై. సత్యనారాయణ తన భార్య పేరుతో చెక్‌లు మంజూరు చేశారు. నిధులను మళ్లించినట్లు ఏసీబీ కేసు నమోదు చేసింది. దీనికి చెందిన రిజిస్టర్లు, డీఫాంలు మాయం, రికార్డులు తారుమారుకావడం వల్ల పరిహారం చెల్లింపులు నిలిచిపోయినట్లు బెంచ్ గుర్తించింది. పరిహారం చెల్లింపుల కోసం పెండింగ్‌లో ఉన్న 120 చెక్‌లను చట్టబద్ధమైన విధానంలో పరిశీలించి బాధితులకు చెల్లింపులు జరపాలని జిల్లా జడ్జిని ఆదేశించింది. నిందితుడి నుంచి రాబట్టిన సొమ్మును కోర్టు ఖాతాలో జమ చేసి భూమి యజమానులకు పంపిణీ జరిగేందుకు వీలుగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఏసీబీపై ఉందని పేర్కొంది. అదేవిధంగా భూసేకరణ అధికారుల నుంచి డూప్లికేట్ డీఫాంలు, ట్రెజరీ నుంచి స్టేట్‌మెంట్‌లు, సీసీడీ రికార్డులను సమన్వయం చేయాలని గద్వాల కోర్టు అధికారులను ఆదేశించింది. క్లర్క్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్‌ల కౌంటర్ సంతకాలతో మూడు దశల అంతర్గత ఆడిట్ విధానం అమలు చేయాలని సూచించింది. పరిహారం పొందే వ్యక్తుల వ్యక్తిగత ధ్రువీకరణతో పాటు వారి న్యాయవాదుల ధ్రువీకరణ కూడా తీసుకోవాలని, అధిక మొత్తంలో పరిహారం తీసుకున్నట్లు తేలితే తిరిగి చెల్లిస్తామని అఫిడవిట్ పొందాలని ఆదేశించింది. ఏసీబీ డైరెక్టర్, దర్యాప్తు అధికారితో జిల్లా జడ్జి సమన్వయం చేసి రికవరీ అయిన మొత్తాన్ని సీసీడీ ఖాతాలో జమ చేసి బాధితులకు పంపిణీ చేయాలని తెలిపింది. పిటిషనర్ కె. హనుమంతుకు చెందాల్సిన పరిహారం మొత్తాన్ని మూడు నెలల్లో విడుదల చేయాలని గద్వాల సీనియర్ సివిల్ జడ్జి కోర్టును హైకోర్టు ఆదేశించింది.



## తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ జన సమితి రాష్ట్ర 4వ ప్లీనరీ సమావేశం నేపథ్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 12న హైదరాబాద్‌లో జరిగే ప్లీనరీ సమావేశంలో నూతన రాష్ట్ర అధ్యక్షుడిని అధికారికంగా ప్రకటించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను మరోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగించాలని కోరుతూ పార్టీ నాయకులు మూడు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఈ ఎన్నికల ప్రక్రియకు పార్టీ సీనియర్ నేతలు ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వరరావు ప్రధాన ఎన్నికల అధికారిగా, మహమ్మద్ అఫ్జల్ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కుంట్ల ధర్మార్జున్, బైరి రమేష్, నిజ్జన రమేష్, ఆశప్ప, పల్లె వినయ్ కుమార్, యూత్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సలీమ్ పాషా, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మాసంపల్లి అరుణ్ కుమార్, కార్మిక విభాగం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరసయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ధార సత్యం, యూత్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎర్ర వీరన్న, యూత్ రాష్ట్ర కోఆర్డినేటర్ కొత్త రవి, పార్టీ ఆఫీస్ ఇన్‌చార్జ్ హనుమంత రెడ్డి, భువనగిరి జిల్లా అధ్యక్షుడు దేశపాక శ్రీనివాస్, పార్టీ నాయకులు సర్దార్ వినోద్ కుమార్, రసూల్, జహీరుద్దీన్, బాలరాజు హాజరయ్యారు.

## మోదీకి కవిత బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి టిఆర్‌ఎస్ చీఫ్ కవిత ఘాటైన లేఖ రాశారు. రాష్ట్ర అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం తక్షణమే నాలుగు ప్రధాన అంశాలపై కేంద్రం నిర్ణయం తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని దక్షిణ తెలంగాణకు జీవనాడి అని కవిత అభివర్ణించారు. కరువు పీడిత ప్రాంతాలైన మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 12.31 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు వెంటనే జాతీయ హోదా కల్పించాలని కోరారు. ప్రాజెక్టు వ్యయంలో 90 శాతం నిధులను కేంద్రమే భరించి, పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. దేశంలో బిసి జనాభాపై స్పష్టమైన గణాంకాలు లేకపోవడం వల్ల అభివృద్ధి పథకాలు అందరికీ చేరడం లేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే 2027 జనాభా లెక్కల్లో బిసిల కోసం ప్రత్యేక కాలమ్ను చేర్చాలని, ప్రతి కులం పేరు స్పష్టంగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చట్టసభల్లో మహిళలకు కల్పించే 33 శాతం రిజర్వేషన్లలో బిసి మహిళలకు ప్రత్యేక సబ్ కోటా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. అప్పుడే వెనుకబడిన వర్గాల మహిళలకు రాజకీయంగా సమాన అవకాశాలు లభిస్తాయని, ఈ మేరకు బిల్లులో తగిన సవరణలు చేయాలని ప్రధానిని కోరారు. తెలంగాణలో విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన బిల్లు ప్రస్తుతం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించేలా కేంద్రం చొరవ చూపాలని లేఖలో అన్నారు. తెలంగాణకు ఎంతో మేలు చేసే ఈ నాలుగు అంశాలపై రాష్ట్ర బిజెపి ఎంపిలు దృష్టి సారించాలని కవిత కోరారు. ప్రధాని పర్యటనలో ఈ విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, రాష్ట్ర ప్రయోజనాల కోసం వారిని ఒప్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## మూసీలో పడిపోయిన మహిళను రక్షించిన హైడ్రా బృందం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైడ్రా సిబ్బంది అప్రమత్తంగా స్పందించి మూసీ నదిలో పడిపోయిన మహిళను సురక్షితంగా రక్షించారు. సమాచారం అందిన కేవలం 16 నిమిషాల్లోనే డిఆర్ఎఫ్ బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో పరిధిలో గోల్నాక సమీపంలోని మూసీ నదిలో 49 ఏళ్ల ఇందిర అనే మహిళ శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు జారి పడింది. చెట్లు అడ్డంగా ఉన్న, ఒడ్డుకు చేరుకునే అవకాశం లేని ప్రాంతంలో ఆమె చిక్కుకుపోయింది. రాత్రంతా మూసీలోనే ప్రాణభయంతో గడిపిన ఆమె కేకలు వేయగా ఎవరికీ వినిపించలేదు. శనివారం ఉదయం 10 గంటల తర్వాత స్థానికులు మహిళను గుర్తించారు. బయటకు తీయడం సాధ్యం కాకపోవడంతో హైడ్రా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. ఉదయం 10.51 గంటలకు ఫోన్ కాల్ అందగా, 11.07 గంటలకు స్వామి ఆధ్వర్యంలోని డిఆర్ఎఫ్ టీమ్16 అంబర్‌పేట్ బృందం ఘటనాస్థలానికి చేరుకుంది. హైడ్రా సిబ్బంది సహాయక చర్యలు చేపడుతుండగా అగ్నిమాపక శాఖ సిబ్బంది కూడా అక్కడికి చేరుకున్నారు. పెద్ద నిచ్చెన సహాయంతో డిఆర్ఎఫ్ సిబ్బంది మూసీలోకి దిగి ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతున్న మహిళను సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం ఆమెను కుటుంబ సభ్యులు, స్థానిక పోలీసులకు అప్పగించారు. తాను ప్రమాదవశాత్తు జారి మూసీలో పడిపోయినట్లు మహిళ తెలిపింది. భర్త లేరని, ఇద్దరు పిల్లలతో సమీప ప్రాంతంలోనే నివసిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళను వేగంగా రక్షించిన హైడ్రా సిబ్బందిని స్థానికులు అభినందించారు.

## 'అగ్ని' విజయవంతం

### ఎంఐఆర్‌వీ సామర్థ్యంగల అత్యాధునిక క్షిపణి పరీక్ష

**న్యూఢిల్లీ:** అత్యాధునిక అగ్ని క్షిపణి పరీక్ష శనివారం విజయవంతమైంది. దీంతో రక్షణ రంగం బలం మరింత పెరిగినట్లు అయింది. బహుళ స్వతంత్ర లక్ష్య పున:ప్రవేశ వాహనం (ఎంఐఆర్‌వీమల్టీపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటెడ్ రీ ఎంట్రీ వెహికల్) సామర్థ్యతగల అత్యాధునిక అగ్ని క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దీవుల్లో బహుళ పేలోడ్‌లతో వివిధ లక్ష్యాలను నిర్దేశించి ఈ పరీక్ష నిర్వహించారు. భూతల నౌక ఆధారిత కేంద్రాల నుంచి నిర్దేశిత బహళ లక్ష్యాలను ఈ క్షిపణి ఛేదించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎంఐఆర్‌వీ సాంకేతికతో ఈ క్షిపణి ఏకకాలంలో వేర్వేరు లక్ష్యాలను ఛేదించగలదని పేర్కొంది. డీఆర్‌డీఓ పరిధి ల్యాబ్‌లలో ఈ క్షిపణి తయారైందని, దేశవ్యాప్తంగా ఉన్న అనేక పరిశ్రమలు ఇందుకు సహకరించాయని ప్రకటన తెలిపింది. కాగా, ఈ పరీక్షను సీనియర్ డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు, భారతీయ సైనికులు వీక్షించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ విజయానికిగాను డీఆర్‌డీఓతో పాటు ఆర్మీ, పారిశ్రామిక భాగస్వాములను అభినందించారు. ఈ అస్త్రంతో దేశ రక్షణకు మరింత హామీ లభించిందని, భవిష్యత్ భద్రతా సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం పెరిగిందన్నారు.

## స్వీయ జనగణకు నేడే చివరి గడువు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా జరగనున్న జనగణన 2027 ప్రక్రియలో భాగంగా, పౌరులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో స్వయంగా నమోదు చేసుకునే 'స్వీయ గణన' గడువు నేటితో ముగియనుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని జిహెచ్‌ఎంసి కమిషనర్, ప్రధాన జనగణన అధికారి ఆర్.వి.కర్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. వెబ్‌సైట్ se.census.gov.in ద్వారా వివరాలు నమోదు చేయవచ్చు అన్నారు. కేవలం 10 నుండి 15 నిమిషాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు అన్నారు. ఒక కుటుంబం మొత్తానికి కలిపి కేవలం ఒక ఎస్‌ఈఐడి మాత్రమే అవసరమని చెప్పారు. ప్రజలు తమ మొబైల్ లేదా ల్యాప్‌టాప్ ద్వారా పైన పేర్కొన్న వెబ్‌సైట్‌ను సందర్శించి, ఇంటి సభ్యుల వివరాలను సులభంగా నమోదు చేయవచ్చు అన్నారు. నమోదు పూర్తయ్యాక ఒక నిర్దిష్టమైన ఎస్‌ఈఐడి జనరేట్ అవుతుందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ గణన అధికారులు ఇంటికి వచ్చినప్పుడు, వారికి కేవలం ఈ ఐడిని చూపిస్తే సరిపోతుందని తెలిపారు. దీనివల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, జనగణన ప్రక్రియ మరింత వేగంగా, సజావుగా సాగుతుందని వివరించారు. ఇది సామాజిక బాధ్యత అని, ప్రతి ఒక్కరూ తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకుని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

## 13న పుదుచ్చేరి సిఎంగా రంగసామి ప్రమాణం

**చెన్నై:** పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ఎన్.రంగసామి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. పుదుచ్చేరి ఎన్నార్ కాంగ్రెస్ అధ్యక్షుడైన ఆయన ఈనెల 13న ప్రమాణ స్వీకారోత్సవం జరుపుకోనున్నారు. 30 సీట్లు ఉన్న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో 18 స్థానాలు గెలుచుకుని ఎన్డీయే విజయం సాధించింది. ప్రభుత్వ ఏర్పాటుకు కేంద్ర మంత్రి మాండవీయ, రంగసామి నేతత్వంలో మిత్ర పక్ష నాయకులు, ఎమ్మెల్యేలు శుక్రవారం సమావేశమయ్యారు. పుదుచ్చేరి ఎన్డీయే అధ్యక్షుడిగా ఎన్.రంగసామిని ఎన్నుకున్నారు. ఆయనకు మద్దతు లేఖ అందజేశారు. అనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ కైలాశ్ నాథన్‌ను లోక్‌నివాస్‌లో కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. దీంతో రంగసామి ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు మొదలయ్యాయి. మంత్రివర్గం, ఇతర పదవులపై చర్చలు పూర్తి కాలేదు. మంత్రుల ప్రమాణ స్వీకారానికి తేదీ నిర్ణయించలేదు.

## ఎఐ దెబ్బకు 20 శాతం ఉద్యోగులు ఇంటికి...

**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెరుగుతుండటం అనేక రంగాల్లో ఉద్యోగులకు చిక్కులు తెచ్చి పెడుతోంది. తాజాగా ప్రముఖ సైబర్ భద్రతా సంస్థ 'క్లౌడ్‌ఫ్లేర్' ప్రపంచవ్యాప్తంగా తమ సిబ్బందిని 20శాతం మేర తగ్గించుకుంటోంది. కంపెనీలో ఏఐ వినియోగం పెరగడం వల్లే ఈ తొలగింపులు అంటూ ఉద్యోగులకు ఇంటర్నల్ మెమో పంపింది. 1,100 మందిని తొలగించనుంది. వడు నెలల్లో కంపెనీ ఏఐ వినియోగం 600 శాతానికి పైగా పెరిగిందని, ఇంజినీరింగ్, ఫైనాన్స్, హెచ్‌ఆర్, మార్కెటింగ్ విభాగాల్లో నిత్యం వేల సంఖ్యలో ఏఐ ఏజెంట్లు వినియోగిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఏఐ సామర్థ్యాన్ని మరింత అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతోనే కంపెనీ ఈ పునర్ వ్యవస్థీకరణ చర్యలు చేపట్టిందని తెలిపింది. ఉద్యోగుల పనితీరుతో దీనికి ఎలాంటి సంబంధం లేదంటూ మెమోలో స్పష్టతిచ్చింది. తొలగించిన ఉద్యోగులకు పరిహార ప్యాకేజీ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. క్లౌడ్‌ఫ్లేర్ గురువారమే తన తొలి త్రైమాసిక ఫలితాలను విడుదల చేసింది. ఇందులో వాల్‌స్ట్రీట్ అంచనాలను మించి కంపెనీ రాణించింది. కొన్ని గంటలకే తొలగింపుల వార్తలు రావడంతో కంపెనీ షేర్లు పడిపోయాయి. ఒక ట్రేడింగ్ సెషన్‌లోనే సంస్థ షేరు ధర 14శాతం క్షీణించింది.

## 'బేటీ బచావో' కేవలం నినాదమేనా?

### బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'బేటీ బచావో' కేవలం నినాదమేనా? కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు? లేక ఆయనకు మినహాయింపు ఉందా? అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రశ్నించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసు వ్యవహారంపై కెటిఆర్ తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని పలు ప్రశ్నలు సంధించారు. తన కుమారుడిపై నమోదైన కేసుకు సంబంధించి బండి సంజయ్ రాజీనామా చేయాలా? లేక కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. ఇక తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఒక మైనర్ బాలిక అన్ని ఆధారాలతో ముందుకు వచ్చినప్పటికీ పోలీసులు వేగంగా స్పందించకపోవడం ఎందుకు? ఇతర పోక్సో కేసుల్లో జరిగే విధంగా విచారణ ఎందుకు జరగడం లేదు? అని ప్రశ్నించారు. బాధితురాలిపైనే ఎదురుకేసులు నమోదు చేయడం, హనీట్రాప్, వసూళ్ల కేసులు పెట్టడాన్ని కెటిఆర్ తీవ్రంగా ఖండించారు. ఏ నిబంధన ప్రకారం ఒక మైనర్ బాలికపై ఇలాంటి కేసులు నమోదు చేస్తున్నారు? బాధితురాలు రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా ఒక ఎఫ్‌ఐఆర్ నమోదు చేయించుకోవడానికే బాధిత కుటుంబం పోరాడాల్సి రావడం దురదృష్టకరమన్నారు. బాధితురాలిని నిందితురాలిలా చూస్తూ వేధించడం అమానుషం అని మండిపడ్డారు. అలాగే కాంగ్రెస్, బిజెపిల మధ్య అపవిత్ర ఒప్పందం నడుస్తోందా? తెలంగాణ కాంగ్రెస్ బిజెపికి ఫ్రాంచైజీలా పనిచేస్తోందా? అని కెటిఆర్ విమర్శించారు. ఉన్నావ్ ఘటన సమయంలో చేసినట్లుగా రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు వచ్చి బాధిత కుటుంబానికి అండగా నిలుస్తారా? లేక తెలంగాణ బాధితులకు అది వర్తించదా? అని ప్రశ్నించారు. మహిళల గౌరవం కోసం గతంలో ఎన్నో పోరాటాలు చేశామని, ఆడబిడ్డల రక్షణ కోసం అవసరమైతే మరో మిలియన్ సార్లు అయినా పోరాడుతామని కెటిఆర్ స్పష్టం చేశారు.

## తెలంగాణ అభివృద్ధికి మోదీ 'గ్యారంటీ'

### కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లది ఎంఐఎం అజెండా : డా. కె. లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన అని బిజెపి రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' నినాదంతో ముందుకు వెళ్తుంటే, కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు కేవలం ఎంఐఎం అజెండాను అమలు చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్, ఎంఐఎం ఒకటే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నాయకత్వాన్ని మెప్పించుకోవడానికి కాంగ్రెస్ ఈజ్ ముస్లిం, ముస్లిం ఈజ్ కాంగ్రెస్ అనే స్థాయికి దిగజారారని విమర్శించారు. లౌకికవాదం పేరుతో ముస్లిం సంతుష్టీకరణకు పాల్పడుతూ హిందూ దేవీదేవతలను కించపరచడమే ఈ పార్టీల పనిగా మారిందన్నారు. ఓటరు జాబితా ప్రక్షాళనను రేవంత్ రెడ్డి అడ్డుకోవాలని చూడటం రాజ్యాంగ విరుద్ధమని, దొంగ ఓట్లు, రోహింగ్యాల ఓట్ల కోసమే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. 2029 నాటికి తెలంగాణలో బిజెపి బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందని, ఇతర పార్టీల ప్రముఖులు కూడా మోదీ నాయకత్వంలో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు.

## ప్రధానికి సిపిఐ(ఎం) బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రధాని మోదీ తెలంగాణకు ఇచ్చిన విభజన హామీల అమలుతో పాటు రాష్ట్ర సమస్యల పరిష్కారాలను ప్రకటించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ప్రధానికి ఆయన బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 10న హైదరాబాద్ బహిరంగసభ నిర్వహించనున్న సందర్భంగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు కావస్తున్నా విభజన హామీలు ఇప్పటివరకు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. సభలో రాజకీయ విమర్శలు, మత విద్వేషాలకే పరిమితం కాకుండా తెలంగాణ సమస్యలను ప్రస్తావించాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తోందన్నారు. సభ ప్రజల సమస్యలకు సమాధానం చెప్పే సభగా ఉండాలి కానీ, మత విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లాభం పొందేందుకు ప్రయత్నం చేస్తే, తెలంగాణ ప్రజలు సహించరని, రాష్ట్రంలోని లౌకిక శక్తులన్ని వాటిని ప్రతిఘటించేందుకు ముందుకొస్తారని జాన్‌వెస్లీ తెలిపారు.







## హైదరాబాద్‌లో ఇ-వ్యర్థాల సేకరణ డ్రైవ్‌కు విశేష స్పందన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక (పిపిపిపి) కార్యక్రమం 9వ వారం, 65వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా ఇవ్యర్థాల సేకరణ డ్రైవ్‌ను నగరంలోని అన్ని సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా నిర్వహించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సురక్షితంగా పారవేయడం, రీసైక్లింగ్‌ను ప్రోత్సహించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంలో పౌరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపయోగించని మొబైల్ ఫోన్లు, ఛార్జర్లు, బ్యాటరీలు, వైర్లు, కంప్యూటర్ ఉపకరణాలు తదితర ఇవ్యర్థాలను ప్రజలు సేకరణ కేంద్రాల్లో జమ చేశారు. ఇవ్యర్థాలను సరైన విధంగా నిర్వహించకపోతే పర్యావరణం, ప్రజారోగ్యంపై కలిగే హానికర ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ డ్రైవ్ ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. అలాగే వ్యర్థాలను వేరు చేయడం, పర్యావరణ అనుకూల పారవేత పద్ధతులను అనుసరించడం వంటి అంశాలపై నివాసితులకు మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి ప్రోత్సాహకరమైన స్పందన లభించిందని అధికారులు చెప్పారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ ద్వారా పరిశుభ్రమైన, పచ్చని, సుస్థిరమైన పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి సామూహిక బాధ్యత ఎంతో ముఖ్యమన్నారు.

## 15న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ధర్నా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కార సాధన కోసం ఈ నెల 15న హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా పిలుపునిచ్చారు. ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల శాశ్వత పరిష్కారం కొరకు ఆల్ ట్రేడ్ యూనియన్ ఆఫ్ కాంగ్రెస్ పిలుపు మేరకు ధర్నా చేపడుతున్నామని, ఈ సందర్భంగా నాలుగో తరగతి ఉద్యోగులందరూ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని రామ రాజేష్ ఖన్నా పిలుపునిచ్చారు.

# వేగంగా యాసంగి ధాన్యం కొనుగోళ్లు

**దేవరకొండ ఆర్‌డిఒ కార్యాలయంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి డివిజన్ స్థాయి సమీక్ష**



**ప్రజాపక్షం/దేవరకొండ** : యాసంగి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. దేవరకొండ నియోజకవర్గ పరిధిలో 15 రోజుల్లో ధాన్యం కొనుగోళ్ళు పూర్తి చేయాలని తెలిపారు. శనివారం దేవరకొండ ఆర్‌డిఒ కార్యాలయంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్‌తో కలిసి డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు 457 కొనుగోలు కేంద్రాల ద్వారా 3.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. మొత్తం 6.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని ముందస్తు అంచనా వేసినట్లు పేర్కొన్నారు. మిగిలిపోయిన ధాన్యం కొనుగోళ్లు వచ్చే 15 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. దేవరకొండ డివిజన్ పరిధిలో స్థానిక ఎంఎల్‌ఏ సహకారంతో మిల్లర్ల సమన్వయం ద్వారా ధాన్యం వేగంగా మిల్లులకు తరలించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డివిజన్ పరిధిలో 12 మిల్లులకు చెందిన మిల్లర్లు ధాన్యం సేకరణలో పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలని పేర్కొంటూ అదనంగా 30 లారీలను పెంచామని, ప్రస్తుతం మొత్తం 100 లారీలతో 24 గంటల వ్యవధిలో ధాన్యం ఆన్‌లోడింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ రైతు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొంటుందని, ఒక వేళ వర్షానికి ధాన్యం తడిసినా కొంటుందని తెలిపారు. దేవరకొండ నియోజకవర్గానికి ఈసారి సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉ ందని, ఇప్పటివరకు 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. డిండి ప్రాంతంలో ఇంకా వరి కోతలు కొనసాగుతున్నాయని, అక్కడి నుండి వచ్చే ధాన్యం కొనుగోలుకు అనుగుణంగా కలెక్టర్, జేసి ఆధ్వర్యంలో చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో 12 మిల్లుల మిల్లర్లు ధాన్యం స్వీకరణలో భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రస్తుతం ఉన్న 70లారీలు సరిపోకపోతే మరిన్ని లారీలు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, దేవరకొండ ఇంచార్జీ ఆర్డీవో రమణారెడ్డి, డిఎస్‌వో వెంకటేష్, డిఎం రాంపత్తి , డిసివో పత్యా, మార్కెటింగ్ ఏడి చాయాదేవి, తహాశీల్దార్ మధుసుధన్‌రెడ్డి, డిటి ముబీన్, రైస్ మిల్లర్ల తరుపున వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?

**ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో దేశ ప్రధానికి బహిరంగ లేఖ విడుదల**

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : దేశ ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో పదేళ్లుగా తెలంగాణ ప్రజలకు, యువతకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇప్పుడు మళ్లీ కొత్త హామీలతో ప్రజలను మోసం చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అందుకే నేడు తెలంగాణకు వస్తున్న మోదీకి యాదగిరి గుట్టలో అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ బహిరంగ లేఖ విడుదల చేసిన సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ ఒకవైపు దేశ యువతకు నరేంద్ర మోడీ 2014 ఎన్నికల సమయంలో ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని హామీ ఇచ్చారని, అయితే అధికారిక గణాంకాలు, నిరుద్యోగ సమస్య, ఖాళీ ప్రభుత్వ పోస్టులు, పెరుగుతున్న కాంట్రాక్టు విధానం నేపథ్యంలో ఆ హామీ పూర్తిగా ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. అదే విధంగా తెలంగాణకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ? 2014 విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన ప్రధాన హామీలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని ఏఐవైఎఫ్ విమర్శ చేస్తున్నదన్నారు. ప్రజా వ్యతిరేక, యువత వ్యతిరేక విధానాలను ఉపసంహరించకపోతే ఆందోళనలు, నిరసనలు, ముట్టడులు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ యాదగిరి గుట్ట మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, అనంతుల నరసింహ, బండ రామచందర్, తాడూరి వెంకటేష్, మహమ్మద్ వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## 11 నుంచి 17 వరకు విద్యా వారోత్సవం విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్**: ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11 నుంచి 17 వరకు విద్యా వారోత్సవం' నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. దీన్ని విజయవంతం చేయాలని కోరారు.శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు విద్యా వారోత్సవం, స్వీయ గణన, ఫార్మర్స్ రిజిస్ట్రీ, ధాన్యం కొనుగోలు అంశాలపై కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులకు సూచనలు చేశారు. విద్యా వారోత్సవంలో విద్యాసంస్థల్లో పనుల శంకుస్థాపన, ఎస్‌ఎస్‌సీలో ఫెయిలైన విద్యార్థులకు సప్లిమెంటరీ కోసం ప్రత్యేక తరగతులు, వర్క్‌షాప్‌లు, జయశంకర్ బడిబాట, తల్లిదండ్రుల సమావేశాలు, విద్యా వేడుకలు ప్రణాళిక ప్రకారం నిర్వహించాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు.ఫార్మర్ రిజిస్ట్రీ త్వరగా పూర్తి చేయాలని, జనగణనలో సెల్ఫ్ ఎన్యుమరేషన్ వేగవంతం చేయాలని ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు వేగం పెంచాలని, వర్షాలకు తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, తగిన గన్ని సంచులు, లారీలు, హమాలీలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,డీఆర్‌డీవో శేఖర్ రెడ్డి, సీపీఓ శ్రీనివాస్ నాయక్,డీఈఓ బిక్షపతి, డీఐఈఓ దస్రు నాయక్, డీసీఎస్‌వో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు భరోసా కల్పించాలి

**పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్‌పి**




**ప్రజాపక్షం/అర్వపల్లి** : అర్వపల్లి పోలీస్ స్టేషన్‌ను శనివారం జిల్లా ఎస్‌పి కె. నరసింహ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ నందు నిర్వహిస్తున్న రిసెప్షన్ సెంటర్‌ను తనిఖీ చేసి ఫిర్యాదుల వివరాలను పరిశీలించారు. పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదులు ఇవ్వడానికి వచ్చిన బాధితులతో మాట్లాడి సమస్యలు త్వరితగతిన పరిశీలించాలని సంబంధిత ఎస్‌ఐను ఆదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి బాధితులకు బరోసా కల్పించాలని సిబ్బందికి సూచించారు. బాధితులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారిలో పోలీసు శాఖ పట్ల నమ్మకాన్ని పెంచేలా పనిచేయాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘీక కార్యకలాపాలు, అక్రమ రవాణాలను పూర్తిగా నిరోధించాలని ప్రజల భాగస్వామ్యంతో పనిచేయాలని తెలిపారు. సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. పోలీసులను సంప్రదించడానికి డయల్ 100కు ఫోన్ చేయలన్నారు.

## నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన

**‘కుంభం’ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కీర్తిరెడ్డి**

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభిస్తోందని కుంభం ఫౌండేషన్ ఛైర్పర్సన్ కుంభం కీర్తిరెడ్డి అన్నారు. భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ స్కూల్లో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి నిన్న జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా ఇప్పటి వరకు 2600 పైచిలుకు మంది అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందులో ఇప్పటికే 1800 మందికి స్కీనింగ్ నిర్వహించి టోకెన్ కేటాయింపు చేయడం జరిగిందన్నారు. వివిధ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు నిర్వహించే ఇంటర్వ్యూల అనంతరం ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్వయంగా నియామక పత్రాలు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ మెగా జాబ్ మేళా ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా కుంభం ఫౌండేషన్ కృషి చేస్తోందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



# స్వీయగణనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం

**సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : స్వీయ గణనను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. స్వీయ గణన చేసుకునేందుకు ఇంకా కేవలం ఒక్క రోజు మాత్ర మే అవకాశం ఉందని, జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, మహిళా సంఘాలు, ఐటి రంగ నిపుణులు, అన్ని వర్గాల వారు స్వీయ గణనలో పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. జనగణన సంబంధించి స్వీయ గణన మే 10 వరకు అవకాశం ఉందని, మొదటి దశలో భాగంగా నిర్వహించే గృహ లెక్కింపు, గృహ పరిస్థితుల లెక్కింపు కోసం ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సౌకర్యం ప్రస్తుతం అందుబాటులో ఉందన్నారు. జిల్లా ప్రజలు తమ ఇంటి, కుటుంబ వివరాలను ప్రభుత్వ అధికారిక వెబ్‌పోర్టల్ https://se.census.gov.in ద్వారా స్వయంగా నమోదు చేసుకోవచ్చని, మొబైల్ ఫోన్, కంప్యూటర్ లేదా ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ఏ పరికరం ద్వారానైనా ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చని తెలిపారు. జనగణన ప్రక్రియలో భాగంగా స్వీయగణన, అనంతరం గృహాల లెక్కింపు, తదుపరి పూర్తి జనగణన నిర్వహిస్తారని వివరించారు. ఈనెల 11వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి హౌస్ లిస్టింగ్ చేపడతారని తెలిపారు. దేశ ప్రణాళిక, భవిష్యత్ అభివృద్ధి, వనరుల పంపిణీకి జనగణన కీలకమన్నారు. అద్దె ఇళ్లలో నివసిస్తున్నవారు కూడా తమ ప్రస్తుత నివాసం నుండే వివరాలు నమోదు చేసుకోవచ్చని సూచించారు. జనగణన సందర్భంగా అందరూ తమ కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను ఖచ్చితంగా అందించాలని కోరారు. ఈ వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, జనాభా లెక్కలకు మాత్రమే ఉపయోగించబడతాయని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ నమోదు తదుపరి ఎన్యుమరేషన్ ఐడి వస్తుందని, అట్టి నంబర్ ఆధారంగా ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని తెలిపారు. ఒక్కరోజే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ స్వీయ గణనలో పాల్గొనాలని ఆయన సూచించారు.

# నల్లగొండలో గంజాయి ముఠా అరెస్ట్

**300 గ్రాముల గంజాయి,రెండు బైకులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం**

**ముగ్గురు అరెస్ట్.. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు వెల్లడి**





**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ జిల్లాలో అక్రమంగా గంజాయి విక్రయాలు నిర్వహిస్తున్న గంజాయి ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి తెలిపారు. నిందితుల వద్ద నుండి సుమారు రూ.3 లక్షల విలువైన 300 గ్రాముల గంజాయి,రెండు పల్సర్ మోటార్ సైకిళ్లు,రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో,నల్లగొండ 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు.శనివారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో నల్లగొండ 2టౌన్ ఎస్ఐ వై.సైదులు,కానిస్టేబుళ్లు ఎల్.బాలకోటి,ఎండీ.షకీల్‌లతో కలిసి హౌసింగ్ బోర్డు కాలనీలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రెండు బైకులపై అనుమానాస్పదంగా నిలబడి ఉన్న నలుగురు వ్యక్తులను విచారించేందుకు ప్రయత్నించగా, వారు పారిపోవడానికి యత్నించారు.వెంటనే పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకోగా,మరో వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు.పోలీసుల విచారణలో పరారీలో ఉన్న బంటు కార్తీక్ ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి వీరికి సరఫరా చేస్తున్నట్లు వెల్లడైంది. నిందితులు స్వయంగా గంజాయి సేవించడమే కాకుండా,చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.500లకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు.ఈ కేసులో అరెస్టైన వారు మహమ్మద్ అబ్దుల్ నయీమ్ అలియాస్ ముజీబ్ (26),మహమ్మద్ సోహెల్ (23), షేక్ లతీఫ్ (24) కాగా, బంటు కార్తీక్ పరారీలో ఉన్నాడు.పరారీలో ఉన్న కార్తీక్‌పై గతంలో పలు క్రిమినల్ కేసులు నమోదై ఉండటంతో పాటు, నల్లగొండ II టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీట్ కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.ఈ ఘటనపై నల్లగొండ 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పట్టుబడిన ముగ్గురు నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.




## 20న ఆలేరులో ప్రజానాట్యమండలి మూడవ మహాసభలు

**ప్రజాపక్షం/బొమ్మలరామారం** : ఈనెల 20వ తేదీన ఆలేరులో జరిగే తెలంగాణ ప్రజానాట్యమండలి మూడవ మహాసభలను విజయవంతం చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేశం అన్నారు. మండలంలోని పెద్ద పర్వతాపురం గ్రామంలో ప్రజానాట్యమండలి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రజానాట్యమండలి మండల అధ్యక్షులుగా రెడ్డబోయిన మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా పిట్టలశంకర్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందని కళాకారులకు వృద్ధాప్య పెన్షన్ హెల్త్ కార్డులు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అన్నేమైన వెంకటేశం, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షురాలు ఇంజ యమల, రాజప్ప నరేష్ లింగం ఆంజనేయులు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు

## ‘డబుల్’తో పేదోడి సొంతింటి కల



**ప్రజాపక్షం/భువనగిరి** : భువనగిరి పట్టణంలోని స్థానిక ప్రగతి నగర్‌లో 13వ వార్డు నూతన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి శాసనసభ్యులు కుంభ అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేదవాడి కళ సహకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంధాల సంస్థ చైర్మన్ అవైస్ చిస్తీ, పిసిసి ప్రధాన కార్యదర్శి పోత్నాక్ ప్రమోద్ కుమార్, కూర వెంకటేష్ సీనియర్ నాయకులు మజీద్ బాబా పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక.ఈ పండుగను అందరూ సోదరభావంతో, పరస్పర గౌరవంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిఎస్‌పి కె.శివరాం రెడ్డి కోరారు.బక్రీద్ పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు బీఫ్ షాపుల యజమానులు,నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ బక్రీద్ పండుగను పురస్కరించుకుని పట్టణంలో శాంతిభద్రతలు,పరిశుభ్రత,సామాజిక సామరస్యాన్ని కాపాడేందుకు పోలీసు శాఖ అప్రమత్తంగా చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా నిషేధిత జంతువులను ఎట్టి పరిస్థితుల్లోనూ వధించకూడదని, జంతువుల రవాణా సమయంలో వెటర్నరీ డాక్టర్ ధృవీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## స్వర్ణగిరి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ



**ప్రజాపక్షం/భువనగిరి** : శ్రవణ నక్షత్రం సందర్భంగా స్వర్ణగిరి క్షేత్రంలో భక్తులు అధిక సంఖ్యలో గిరి ప్రదక్షిణ చేశారు. ముందుగా కొండ కింద ఉన్న శ్రీ వారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు చేసి అనంతరం గోవింద నామ స్మరణ చేస్తూ గిరి ప్రదక్షిణ గావించారు. గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు మంచి నీరు మజ్జిగ అందించి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్యక్షేత్రంలో శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పంచామృతములు, పసుపు, సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్ఛారణలతో వసంతోత్సవ సేవను శోభాయ మానంగా నిర్వహించారు. అనంతరం అర్చక స్వాములు కర్పూర మంగళహారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మానేపల్లి రామారావు, మురళీ కృష్ణ, గోపీకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కిడ్నీ వైఫల్య సమస్యలకు యశోద ఆసుపత్రుల్లో చికిత్స సక్సెస్

**ప్రజాపక్షం/దేవరకొండ:** అక్యూట్ కిడ్నీ ఇంజనీరింగ్ అనేది తక్కువ సమయంలో కిడ్నీ పనితీరు తీవ్రంగా దెబ్బ తినే ప్రమాదకర పరిస్థితి కొన్ని సందర్భాల్లో ఇది వేగంగా అభివృద్ధి చెంది రాపిడ్లి ప్రొగ్రెస్ రీనల్ ఫెయిల్యూర్‌గా మారి ప్రాణాపాయస్థితులకు దారితీస్తుందని యశోద ఆసుపత్రి వైద్యులు చేతన్ వీరమనేని కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ తెలిపారు. శనివారం దేవరకొండలోని గ్రీన్ గార్డెన్ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శరీరమంతా వాపు మూత్ర విసర్జన తగ్గిపోవడం, రక్తంలో వ్యర్థాలు పెరగడంవంటి సమస్యలు తలుపుతాయని ఇలాంటి సందర్భాల్లో ముందస్తు నిర్ధారణ ప్రత్యేక సమయానికి వైద్యం అందడం అత్యంత కీలకమని వారన్నారు. దేవరకొండకు చెందిన 32 సంవత్సరాల పద్మ అనే మహిళ జర్వం, వనుకు, శరీరం అంతా వాపులతో బాధపడుతూ యశోద సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి మలక్‌పేటకు చేరుకున్నారు. యశోద ఆసుపత్రిలో డా. చేతన్ వీరమనేని కన్సల్టెంట్ నేఫ్రాలజిస్ట్ మరియు ట్రాన్స్‌ప్లాంట్ ఫీజిషియన్ ఆధ్వర్యంలో రోగికి సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి కిడ్నీలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు నిర్ధారణ కావడంతో వ్యాధి మూలకారణాలు గుర్తించేందుకు అల్ట్రా సౌండ్ మార్గదర్శకత్వంతో రియల్ టైం రీనల్ బయోపిక్ బయాప్సి నిర్వహించిన్లు తెలిపారు. దీని కారణంగా ఫలితాలు వచ్చాయని రోగి ఆరోగ్యం మెరుగుపడిందని తెలిపారు. బయాప్సి ప్రక్రియ ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తయిందని శరీరం వాపులు తగ్గి రోగి పరిస్థితి స్థిరపడిందన్నారు. గ్రామీణ వైద్యులు అవగాహన లేకుండా జీవితాన్ని వృధా చేసుకోకుండా బాధితులు యశోద ఆసుపత్రిని సంప్రదించాలని తక్కువ ఖర్చుతో అత్యాధునిక చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్ కోర్కంటి పవన్, యూనిట్ హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, అసోఎసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేది ఐజెయునే

**ఐజెయు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చలసాని శ్రీనివాసరావు జిల్లా వ్యాప్తంగా సభ్యత్వాల నమోదు**



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్**: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు పోరాటాలు చేసేది టియుడబ్ల్యూజె యూనియన్ మాత్రమేనని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోల నాగేశ్వరరావు అన్నారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలో యూనియన్ సభ్యత్వ కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. ఐజెయు కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసారావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ముమ్మరంగా నడుస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టులందరూ యూనియన్ సభ్యత్వాన్ని తప్పని సరిగా నమోదు చేయించుకోవాలని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా యూనియన్ ఆధ్వర్యంలో అర్హులైన జర్నలిస్టులందరికి తప్పని సరిగా అక్రిడేషన్ కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని అన్నారు. ఇల్లు, ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వంతో ఇప్పటికే మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి అనేక దఫాలుగా చర్చలు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పనిచేసే జర్నలిస్టులకు అక్రిడేషన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ఖచ్చింతగా హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. మీడియా అకాడమీ, ప్రభుత్వంపై కొంతమంది వ్యక్తులు నిరాధార ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని అన్నారు. గత 10 సంవత్సరాల పాటు అధికారం ఉన్న కొన్ని సంఘాలు జర్నలిస్టులను పక్కదారి పట్టించేలా ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు త్వరలోనే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని యూనియన్ ప్రతినిధి వర్గం కలవనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 23 మండలాల్లో ఉన్న జర్నలిస్టులకు ఇల్లు మంజూరు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. యూనియన్ సభ్యత్వ నమోదు పూర్తి అనంతరం యూనియన్ జిలా మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రతినిధి వర్గం బసవోజు శ్రీనివాసచారి, దేనుమకొండ శేషంరాజు, షేక్ నాగుల్‌మీరా, పిల్లలమర్రి శ్రీనివాసరావు, దేవరం రామిరెడ్డి, వెంకటరెడ్డి, ఇందిరాల రామకృష్ణ, కీత రామనాధం, కొమర్రాజు అంజయ్య పాల్గొన్నారు.

హైదరాబాద్
ఆదివారం
10-05-2026
www.prajapaksham.in

"ఆంధ్ర ప్రదేశ్ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ నూతన చైర్మన్‌గా భరత్ భూషణ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏపి సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో భరత్ భూషణ్‌కు చైర్మన్ పదవి దక్కింది. భరత్ భూషణ్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షునిగా పని చేశారు."

# రీల్

## 'రౌడీ జనార్ధన' స్పెషల్ పోస్టర్



స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌లో నటిస్తున్న క్రేజీ మూవీ 'రౌడీ జనార్ధన'. స్టార్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టాలెంటెండ్ యంగ్ డైరెక్టర్ రవి కిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా 'రౌడీ జనార్ధన' సినిమా రూపొందుతోంది. హీరో విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు బర్త్ డే విషెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. రౌడీ జనార్ధన మూవీ మేకర్స్. ఈ బర్త్ డే పోస్టర్ లో వర్షంలో తడుస్తూ చేతిలో పిస్టల్ తో ఉన్న విజయ్ స్టిల్ ఆకట్టుకుంటోంది. ఆయన ఛాతీపై హీరోయిన్ కీర్తి సురేష్ కాలు పెట్టినట్లు చూపించడం ఆసక్తి కలిగిస్తోంది. ఈ పోస్టర్ యాక్షన్ తో పాటు రొమాంటిక్ యాంగిల్‌ను ఎస్టాబ్లిష్ చేస్తోంది. రౌడీ జనార్ధన సినిమాను సిల్వర్ స్క్రీన్ పై చూసేందుకు రౌడీ ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ వెయిట్ చేస్తున్నారు. ఈ డిసెంబర్ లో ఈ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమాకు ప్రొడక్షన్ డిజైనర్ డినో శంకర్, డిఒపి ఆనంద్ సి చంద్రన్.

## 'రణబాలి' గ్లింప్స్ రిలీజ్

విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ రోజు హీరో విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు విషేస్ చెబుతూ 'రణబాలి' మూవీ నుంచి స్పెషల్ మేకింగ్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'రణబాలి' సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్‌కు రాబోతోంది. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా 'రణబాలి' సినిమా రూపొందుతోంది.




## రాధిక జయంతి డైరక్షన్‌లో 'రాయవలస'




కార్తీక్ జయంతిని హీరోగా పరిచయం చేస్తూ రాయ్‌సన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ రాయవలస. ఈ చిత్రాన్ని జె.గోపీ కృష్ణ నిర్మించగా మహిళా దర్శకురాలు రాధిక జయంతి దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ మంచి రెస్పాన్స్ వచ్చింది. కర్స్ టీజర్ లాంచ్ చేశారు. యంగ్ హీరో ఆకాష్ జగన్నాథ్ ఈ వేడుకకు హాజరయ్యారు. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ఆకాష్ జగన్నాథ్ మాట్లాడుతూ ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ టీజర్ చూసినపుడు చాలా హ్యాపీగా అనిపించింది. టీజర్ చాలా బాగుంది. కార్తీక్ హీరోగా, వాళ్ల అమ్మ డైరెక్టర్‌గా, వాళ్ల నాన్న ప్రొడ్యూసర్‌గా ఉండడం చాలా క్రేజీగా అనిపించింది. రాధికకి హ్యాట్సాఫ్. తనంత బాధ్యత తీసుకుని వాళ్ల అబ్బాయిని హీరోగా లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. వారు మరిన్ని మంచి సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను అన్నారు. కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ సినిమా చాలా ప్రత్యేకంగా ఉంది. కార్తీక్‌ని వాళ్ల తల్లిదండ్రులే ప్రొడ్యూస్ చేస్తూ డైరెక్ట్ చేయడం విశేషం. తల్లి డైరెక్ట్ చేయడం, ఫాదర్ ప్రొడ్యూస్ చేయడం, కొడుకు హీరోగా చేయడం ఈ కాంబినేషన్ చాలా ప్రత్యేకంగా ఉందని చెప్పారు. హీరో కార్తీక్, డైరెక్టర్ రాధిక జయంతి, హీరోయిన్ శ్రీష అనిత చౌదరి, యాక్టర్ రవివర్మ పాల్గొన్నారు.

## హీరో విక్రాంత్‌కు 'సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్'




'సంతాన ప్రాప్తిరస్తు' చిత్రంతో మంచి విజయాన్ని దక్కించుకున్న యంగ్ టాలెంటెడ్ హీరో విక్రాంత్. ఇప్పుడు మరో ఘనతను సొంతం చేసుకున్నారు. ఈ చిత్రంలోని నటనకు ఆయన ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్ 2026లో 'సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ జ్యూరీ స్పెషల్ అవార్డ్ అందుకున్నారు. కెరీర్ ప్రారంభంలోని ఇలాంటి ప్రతిష్టాత్మక అవార్డ్ దక్కడంపై హీరో విక్రాంత్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## నార్త్ అమెరికాలో 'పెద్ది' ఆల్ టైమ్ రికార్డు



రామ్ చరణ్ హీరోగా రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' థియేటర్‌లలోకి రాకముందే సంచలనాలు సృష్టిస్తోంది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రానికి నార్త్ అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్స్ దూసుకెళ్తున్నాయి. బుకింగ్స్ ప్రారంభమైన కేవలం నాలుగు గంటల్లోనే సినిమా 100కే డాలర్ల మార్క్‌ను దాటేసి ఆల్‌టైమ్ రికార్డ్ నమోదు చేసింది. ట్రైలర్ కూడా విడుదల కాకముందే ఈ స్థాయి ఓపెనింగ్ రావడం సెన్సేషనల్ గా మారింది. రామ్ చరణ్ స్టార్ పవర్‌పై ప్రేక్షకులకు ఉన్న నమ్మకం, బుచ్చిబాబు స్టోరీ టెల్లింగ్ ప్రత్యేకత కలిసివచ్చి ఈ భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. నార్త్ అమెరికా రిలీజ్ ప్రత్యంగిరా సినిమాస్ నిర్వహిస్తోంది. వారి రిలీజ్ ప్లానింగ్ కూడా భారీ స్థాయిలో ఉంది. నార్త్ అమెరికాతో పాటు శ్రీలంక, ఆస్ట్రేలియా, సింగపూర్ సహా పలు దేశాల్లో ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఇప్పటివరకు 'పెద్ది' నుంచి విడుదలైన రెండు పాటలు, రెండు గ్లింప్స్, పోస్టర్లు.. ప్రతి అప్డేట్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. రస్టిక్ మూడ్ రూరల్ బ్యాక్ డ్రాప్, రామ్ చరణ్ రగడ లుక్ అన్నీ సినిమాపై భారీ అంచనాలను పెంచాయిమ. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. పెద్ది' జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుండగా, జూన్ 3 నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్నాయి.

## జులై 3న 'రావు బహదూర్' విడుదల



సూపర్‌స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ సైకాలజికల్ థ్రిల్లర్ 'రావు బహదూర్' చిత్రాన్ని సగర్వంగా సమర్పిస్తున్నారు. వెంకటేష్ మహా ఈ చిత్రానికి దర్శకత్వం వహించడమే కాకుండా కథ, ఎడిటింగ్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏ+ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, అలాగే ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న 'ఓ సుందరి' పాట సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. వింటేజ్ వాతావరణాన్ని అద్భుతంగా రీక్రియేట్ చేసిన ఆ పాటలోని మెలోడీ, విజువల్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ చిత్రాన్ని జూలై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. రిలీజ్ డేట్ పోస్టర్‌లో సత్యదేవ్ వయసు పైబడిన రాయల్ లుక్‌లో కనిపించారు. రాయల్ పర్పుల్ దుస్తులు, ముత్యాల అలంకరణలు, హ్యాండ్ ఫ్యాన్, వెనుక గ్రాండ్ సెటప్ కలిసి ఓ మిస్టీరియస్ అరిస్టోక్రాటిక్ ప్రపంచాన్ని చూపిస్తున్నాయి. పోస్టర్ మొత్తం సైకాలజికల్ డ్రామాకు తగ్గట్టుగా ఇంటెన్స్ వాతావరణాన్ని సృష్టిస్తోంది. ఈ చిత్రంలో దీపా థామస్ కథానాయికగా నటిస్తుండగా, వికాస్ ముప్పాల, బాలా పరాశర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాక, మాస్టర్ కిరణ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కార్తీక్ పరమార్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, స్మరణ్ సాయి సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలను రోహన్ సింగ్ నిర్వహిస్తున్నారు.

## సువేందు అధికారి ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

చెందినవారు కాగా, ఘోష్ ఒబిసి వర్గానికి, అగ్నిమిత్ర పాల్ కాయస్థ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కీర్తానియా ప్రముఖ మతువా నాయకుడు, టుడు జంగల్‌మహల్ గిరిజన ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక ప్రమణిక్ ఉత్తర బెంగాల్‌కు చెందిన ప్రభావవంతమైన రాజబన్షీ నాయకుడిగా పరిగణించబడుతున్నారు. బిజెపి తొలి మంత్రివర్గంలో ఇద్దరు మంత్రులు ఉత్తర బెంగాల్‌కు చెందినవారు కాగా, ముగ్గురు దక్షిణ బెంగాల్‌కు చెందినవారుగా ఉన్నారు. బెంగాల్‌లోని అత్యంత ప్రముఖ రాజకీయ నాయకులను, ముఖ్యమంత్రులను అందించిన నగరమైన కోల్‌కతా నుండి మంత్రుల తొలి జాబితాలో ఏ ప్రతినిధి లేకపోవడం గమనార్హం. బిజెపి ప్రభుత్వంలోని మిగిలిన మంత్రులు సోమవారం రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. కొత్త మంత్రివర్గ తొలి సమావేశం కూడా అదే రోజు జరగనున్నట్లు సమాచారం. అయితే మంత్రుల శాఖలను ఇంకా ప్రకటించలేదు. ఇటీవల ముగిసిన ఎన్నికల్లో 294 మంది సభ్యులున్న అసెంబ్లీలో బిజెపి 207 స్థానాలను కైవసం చేసుకుని, తృణమూల్ కాంగ్రెస్ 15 ఏళ్ల పాలనకు ముగింపు పలికి, తూర్పు భారతదేశంలో తన అతిపెద్ద ఎన్నికల విజయాన్ని లిఖించుకుంది.

## 'ఇండియా'కు బీటలు

(మొదటి పేజీ తరువాయి)

రాజా అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. తమిళనాడులోనే కాకుండా అనేక రాష్ట్రాల్లో ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని చెప్పారు. ప్రతిపక్షాల మధ్య ఐక్యత పెంచడానికి బదులు విభేదాలు పెరగడానికి కాంగ్రెస్ కారణమవుతుందని రాజా అన్నారు. తప్పు ఎక్కడ జరుగుతుందో ఆ పార్టీ తెలుసుకోవాలని, ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. ఇండియా ఐక్య సంఘటనలో మారుతున్న సమీకరణలతో పెరుగుతున్న రాజకీయ ఉత్కంఠ నేపథ్యంలో డి.రాజా వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. తమిళనాడులో టివికె ప్రభుత్వం ఏర్పాటునకు సిపిఐ, సిపిఎం, విసికె మద్దతు ప్రకటించిన విషయం విదితమే. కాగా, సిపిఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు శనివారం ఢిల్లీలోని అజయ్ భవన్‌లో ప్రారంభమయ్యాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై సమీక్ష సమావేశం సమీక్షించింది. అసోం, పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి రావడం కోసం మత ప్రాతిపదికన బిజెపి ఓట్లు చీల్చిందని విమర్శించింది. ప్రభుత్వ ఏర్పాటుపై తమిళనాడు గవర్నర్ అర్లేకర్ వ్యవహరించిన తీరుపై అసంతృప్తి వ్యక్తంచేసింది. తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటు



టివికె అధినేత విజయ్‌ను పిలవకపోవడం విచారకరమని అభిప్రాయపడింది. గవర్నర్ వ్యవస్థ ద్వారా తమిళనాడును తన గుప్పెట్లోకి తెచ్చుకోవాలని బిజెపి ప్రయత్నం చేస్తోందని విమర్శించింది. బిజెపి తీరును సమావేశం తీవ్రంగా ఖండించింది. గవర్నర్ ద్వారా పరిపాలన చేయాలని బిజెపి చూస్తుందని, గవర్నర్ తక్షణమే విజయ్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు పిలవాలని డిమాండ్ చేసింది. వామపక్షాల బలం తగ్గిన మాట వాస్తవమేనని, ఫలితాలు ఎందుకిలా వస్తున్నాయనే అంశంపై సమావేశం చర్చిస్తోంది. గవర్నర్ వ్యవస్థ ద్వారా రాష్ట్రాలలో కేంద్ర ప్రభుత్వం పెత్తనం కొనసాగిస్తోందని విమర్శించింది. బిజెపి వైఖరిని నితీశ్‌కుమార్, చంద్రబాబు నాయుడు ఖండించాలని, గవర్నర్ వ్యవస్థకు వ్యతిరేకంగా ఎన్టీ రామారావు తరపున చంద్రబాబు నాయుడు పోరాటం చేసిన విషయాన్ని గుర్తుచేసింది. కాగా తెలంగాణలో కార్యకాలపాలపై సిపిఐ సహాయ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావ్ నివేధిక సమర్పించారు.

## ఎండ.. వాన..

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30—40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. శని, ఆదివారం ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆది, సోమవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో ఇదే తరహా వాతావరణ పరిస్థితులు ఉండే అవకాశముందన్నారు. ఇక రానున్న రోజుల్లో రాష్ట్రంలో పొడి వాతావరణమే కొనసాగనుందని, ప్రత్యేక హెచ్చరికలు లేవన్నారు.

## నిర్ణయాన్ని గౌరవిస్తా

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నా సరే, తాము ఆ నిర్ణయాన్ని గౌరవించాలని, వారితో సమన్వయంతో వ్యవహరిస్తూ ఒక స్థిరమైన ప్రభుత్వం ఏర్పడేలా చూడాలని, తద్వారా మరోసారి ఎన్నికలు జరిగే పరిస్థితికి తావివ్వకూడదని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు తెలిపారు. 'ప్రస్తుత సంక్షోభాన్ని నివారించే ఉద్దేశంతో టివికె ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మేము(వామక్షాలు, విసికె) మద్దతు ప్రకటించినప్పటికీ, సిద్ధాంతపరమైన ప్రాతిపదికన డిఎంకె నేతృత్వంలోని లౌకిక ప్రగతిశీల కూటమిలోనే మేము కొనసాగుతాము' అని మా కూటమి మిత్రపక్షాలు చేసిన ప్రకటనను తాను స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

తమ కూటమి తరపున పోటీ చేసి విజయం సాధించిన కాంగ్రెస్ శాసనసభ్యులు కృతజ్ఞతలను తెలియజేయడానికి 'అన్నా అరివాలయం'(డిఎంకె కార్యాలయానికి)కు రాలేదని, అదే రోజున, కాంగ్రెస్ పార్టీ డిఎంకెతో తమ సంబంధాలను తెంచుకుని, తమ దారిలో తాము వెళ్లిపోయిందని స్టాలిన్ విమర్శించారు. అదే సమయంలో, కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ వీరపాండియన్ , కామ్రేడ్ షణ్ముగం, విసికె నాయకుడు తిరుమావలవన్ డిఎంకెతోనే చేతులు కలిపి కొనసాగుతామని, తమిళనాడు హక్కుల పరిరక్షణ కోసం, ప్రజల సంక్షేమం కోసం పోరాడుతామని ప్రకటించారని, తద్వారా వారు తమ సహచర భావాన్ని చాటుకోవడమే కాకుండా, సిద్ధాంతపరంగా ఎంతో బలంగా ఉన్న ద్రవిడ మున్నేట్ర కళగంపై తమకున్న విశ్వాసాన్ని కూడా నిరూపించుకున్నారని అన్నారు. ఈ క్లిష్టమైన పరీక్షా సమయంలో, ప్రొఫెసర్ ఆయా కథర్ మొహిదీన్, అన్నన్ వైకో, ప్రేమలత విజయకాంత్, ప్రొఫెసర్ జవహిరుల్లా, ఈశ్వరన్, తమీమున్ అన్సారీలతో సహా, తమకు అండగా నిలబడిన కూటమి ఉద్యమ నాయకులందరికీ స్టాలిన్ హృదయపూర్వక కృతజ్ఞతలను తెలియజేయజేశారు. వారి దృఢసంకల్పానికి, ఎటువంటి కృతజ్ఞతలు లేదా ప్రశంసలు సరిపోవు అని వ్యాఖ్యానించారు. దూరదృష్టితో కూడిన ఆలోచన, పటిష్టమైన ప్రణాళికతో రూపొందించిన తమ ప్రభుత్వ పథకాలను, ఏర్పడబోయే కొత్త ప్రభుత్వం కూడా కొనసాగించాలనేది తన వ్యక్తిగత ఆకాంక్ష అని పేర్కొనానరు. మరోసారి, ఏర్పడబోయే కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## తదుపరి సిడిఎస్‌గా రాజా సుబ్రమణి

(మొదటి పేజీ తరువాయి)

రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుత ప్రస్తుత సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్ మే 30న పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఆయన స్థానంలో రాజా సుబ్రమణి బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఎన్ఎస్ రాజా సుబ్రమణి జాతీయ భద్రతా మండలి కార్యదర్శిత్వంలో (ఎన్ఎస్‌సిఎస్) సైనిక సలహాదారుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అంతకుముందు 2024 జూలై 1 నుంచి 2025 జూలై 31 వరకు భారత సైన్య ఉప ప్రధానాధికారిగా (వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్) పనిచేశారు. అలాగే 2023 మార్చి నుంచి 2024 జూన్ వరకు సెంట్రల్ కమాండ జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌ఇన్‌చీఫ్‌గా సేవలందించారు. ఎన్‌డిఎ, ఇండియన్ మిలిటరీ అకాడమీ పట్టభద్రుడైన రాజా సుబ్రమణి 1985 డిసెంబర్ 14న గఢ్వాల్ రైఫిల్స్ 8వ బెటాలియన్‌లో కమిషన్ పొందారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని జాయింట్ సర్వీసెస్ కమాండ్ అండ్ స్టాఫ్ కాలేజ్, ఢిల్లీ నేషనల్ డిఫెన్స్ కాలేజ్‌లలో శిక్షణ పొందారు. లండన్ కింగ్స్ కాలేజ్ నుంచి ఎంఎ, మద్రాస్ యూనివర్సిటీ నుంచి డిఫెన్స్ స్టడీస్‌లో ఎంఫిల్ పట్టాలు సాధించారు.

**నాలుగు దశాబ్దాలకు పైగా సేవలు**

నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన సైనిక సేవల్లో అసోం, జమ్ముకశ్మీర్, పశ్చిమ, ఉత్తర సరిహద్దు ప్రాంతాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆపరేషన్ రైనో కింద అసోంలో 16 గఢ్వాల్ రైఫిల్స్‌కు కమాండ చేశారు. జమ్ముకశ్మీర్‌లో 168 ఇన్ఫెంట్రీ బ్రిగేడ్, సెంట్రల్ సెక్టార్‌లో 17 మౌంటైన్ డివిజన్‌కు నాయకత్వం వహించారు. పశ్చిమ సరిహద్దులో భారత సైన్యానికి కీలకమైన 2 కారప్స్‌కు కూడా కమాండర్‌గా వ్యవహరించారు. అదనంగా జాతీయ రక్షణ అకాడమీలో డివిజనల్ ఆఫీసర్, కజకిస్థాన్‌లో డిఫెన్స్ అటాషే, మిలిటరీ ఇంటెలిజెన్స్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్, వెల్లింగ్టన్ డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్‌లో చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ వంటి పలు కీలక హోదాల్లో సేవలందించారు. దేశ భద్రతకు ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం పరమ విశిష్ట సేవా మెడల్ , అతి విశిష్ట సేవా మెడల్ వంటి గౌరవ పురస్కారాలతో సత్కరించింది.

**2028 వరకు నేవీ చీఫ్‌గా స్వామినాథన్ బాధ్యతలు**

ప్రస్తుతం నేవీ చీఫ్‌గా ఉన్న అడ్మిరల్ దినేశ్ కుమార్ త్రిపాఠి ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. అదే రోజున వైస్ అడ్మిరల్ కృష్ణ స్మామినాథన్ బాధ్యతలు స్వీకరించనున్నారు. 2028 డిసెంబర్ 31, వరకూ ఆ పదవిలో కొనసాగుతారు. వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ 2025 జూలై 31న పశ్చిమ నౌకాదళ కమాండ 34వ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్‌చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన 1987 జూలై 1న భారత నౌకాదళంలో చేరారు. కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ విభాగాల్లో నిపుణుడిగా గుర్తింపు పొందారు. కృష్ణ స్వామినాథన్ నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఖడక్వాస్లా పూర్వ విద్యార్థి. అలాగే యునైటెడ్ కింగ్‌డమ్‌లోని జాయింట్ సర్వీసెస్ కమాండ్ అండ్ స్టాఫ్ కాలేజ్, శ్రీవెన్‌హామ్; కరంజాలోని కాలేజ్ ఆఫ్ నావల్ వార్‌ఫేర్; అమెరికాలోని రోడ్ ఐలాండ్ న్యూపోర్ట్‌లో ఉన్న యునైటెడ్ స్టేట్స్ నావల్ వార్ కాలేజ్‌లలో శిక్షణ పొందారు.

**పలు కీలక నౌకలకు కమాండ్**

నౌకాదళంలో కృష్ణ స్వామినాథన్ అనేక కీలక బాధ్యతలు నిర్వర్తించారు. క్షిపణి నౌకలు ఐఎన్ఎస్ విద్యుత్, వినాశ్; మిసైల్ కార్వెట్ ఐఎన్ఎస్ కులిశ్; గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ మైసూర్; విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్యలకు కమాండర్‌గా పనిచేశారు. రియర్ అడ్మిరల్ హోదాకు పదోన్నతి పొందిన అనంతరం కొచ్చిలోని సదరన్ నావల్ కమాండ్ ప్రధాన కార్యాలయంలో చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ (ట్రైనింగ్)గా సేవలందించారు. భారత నౌకాదళంలో శిక్షణ కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. నౌకాదళంలోని అన్ని విభాగాల్లో ఆపరేషనల్ భద్రతను పర్యవేక్షించే ఇండియన్ నావల్ సేఫ్టీ టీమ్ ఏర్పాటులో కూడా ఆయన ముఖ్య పాత్ర వహించారు. వైస్ అడ్మిరల్ హోదాలో ఆయన వెస్ట్రన్ నావల్ కమాండ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా, కంట్రోలర్ ఆఫ్ పర్సనల్ సర్వీసెస్‌గా, నావల్ హెడ్‌క్వార్టర్స్‌లో చీఫ్ ఆఫ్ పర్సనల్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుత బాధ్యతలకు ముందు నావల్ హెడ్‌క్వార్టర్స్‌లో వైస్ చీఫ్ ఆఫ్ నావల్ స్టాఫ్‌గా పనిచేశారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com